epaper.vaartha.com
WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
26-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 146 పేజీలు: 8+16 వెల: 6.50
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam



జులై 1 నుంచి పాస్‌పోర్టు దరఖాస్తు ఫీజులు పెంపు
9వ తరగతిలో పాఠ్యాంశంగా 'ఎమర్జెన్సీ' 5

# వెనిజులా నేల మట్టం



## స్వల్ప వ్యవధిలో రెండు భారీ భూకంపాలు

## 200 పైనే మృతులు..

### వెయ్యికి పైగా క్షతగాత్రులు



కారకాస్‌లో పరుగులు తీస్తున్న ప్రజలు

### రాజధాని, మరికొన్ని నగరాల్లో నేలకొరిగిన భవనాలు, హోటళ్లు

### ఆకాశం నిండిపోయిన ధూళి మేఘాలు

**కారకాస్, జూన్ 25:** వెనిజులా కరీబియన్ తీరప్రాంతంలో బుధవారంసాయంత్రం సంభవించిన రెండు వరుస భారీ భూకంపాలు ఆ దేశాన్ని వణికించాయి. రాజధాని కారకాస్ సహా పలు నగరాల్లో భూమి కంపించడంతో అనేక భవనాలు కుప్పకూలాయి. భారీ ఆస్తి నష్టం సంభవించడంతో పాటు కరీబియన్ >>2

# 'నీటి అడుగులు' ముందుకు



తుంగభద్ర గేట్లను తెరిచిన అనంతరం కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌తో కలిసి సంఘీభావం ప్రకటించిన ముగ్గురు సిఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డికె శివకుమార్. చిత్రంలో మంత్రి ఉత్తమ్

### మూడు రాష్ట్రాల మధ్య జల వివాదాలు కొలిక్కి

### 15 టిఎంసిలలో నాలుగైదే వాడుకొంటున్నాం

### తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ చరిత్రలో శాశ్వతం

### కష్టాలు తెలిసిన నాయకుడు చంద్రబాబు: సిఎం రేవంత్

### కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌తో కలిసి గేట్లు ప్రారంభించిన సిఎంలు రేవంత్, చంద్రబాబు, శివకుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పిల్ వే గేట్లు ప్రారంభించారు. కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు >>2



## సాగునీటి ప్రాజెక్టుల్లో పూడిక తీత

### కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్.పాటిల్

**అనంతపురం, జూన్ 25 ప్రభాతవార్త బ్యూరో:** దేశ వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడిక తీసి వేసేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ ప్రణాళిక చేపడుతోందని కేంద్ర ప్రభుత్వ జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ వెల్లడించారు. గురువారం కర్ణాటకలోని టిబి డ్యాం >>2

# మొదలైన 'సర్'


### జులై 24 వరకు ఇంటింటి సర్వే



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** తెలంగాణలో గురువారం నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రారంభమైంది. భవిష్యత్‌లో మీరు ఓటు హక్కు వినియోగించుకోవాలి అంటే కచ్చితంగా సర్ ప్రక్రియలో పాల్గొనాల్సిందే. అధికారులు అడిగిన పత్రాలు చూపించి మీ ఓటు హక్కును నిర్ధారించుకోండి. వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేకపోయినా, సరైన పత్రాలు చూపించలేక పోయినా మీ ఓటు ప్రమాదంలో పడుతుంది. అందుకే బిఎల్ఓలు మీ ఇంటికి వచ్చినప్పుడు ప్రశాంతంగా వారు అడిగిన వివరాలు అందజేయడం మంచిదని అధికారుల సూచిస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 3,38, 26, 228 మంది ఓటర్ల డేటాను వడపోసే ప్రక్రియను అధికారులు చేపట్టారు. కేవలం ఓటు ఉండటమే కాదు, అందులో మీ ఫొటో పేరు, అడ్రస్ అన్నీ కరెక్ట్‌గా ఉన్నాయో లేదే చెక్ చేసుకోవడానికి ఇదే సరైన టైం. ఒక వేళ ఈ అవకాశాన్ని మిస్ చేసుకుంటే రాబోయే ఎన్నికల్లో ఓటు వేసే ఛాన్స్ కోల్పోయే >>2

మీరు ఇవ్వరు.. వసూలు చేసుకోనివ్వరా? 2
జిఒ 9పై 30 వరకు తెలంగాణ హైకోర్టు స్టే

నేను గుంపు మేస్త్రీనే.. 2
నా గుంపులో ఉన్నవారంతా భేష్
ఉద్యోగులు రోజుకో గంట అదనంగా పనిచేయాలి
వారి బీమా కోసం ఎంఒయు: సిఎం రేవంత్



# మొదలైన 'సర్'

>> ప్రమాదం ఉంది. అందుకే బీఎల్‌వోలు అడిగే వివరాలను సిద్ధం చేసుకోండి. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నేటి నుంచి జులై 24 వరకు అంటే నెల రోజులు పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింట సర్వే నిర్వహిస్తారు. ఈ యజ్ఞంలో దాదాపు 36వేల మంది తీలీవీలు పాల్గొంటున్నారు. ప్రతి బీఎల్‌వో తన బూత్ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఓటర్లకు రెండు ఎన్యూమరేషన్ పత్రాలు ఇస్తారు. ఆ బీఎల్‌వోలు ప్రతి ఇంటినీ మూడు సార్లు విజిట్ చేస్తారు. హైదరాబాద్ పరిధిలో పత్రాలు ఇంగ్లీష్‌లో ఉంటాయని, మిగిలిన అన్ని జిల్లాల్లో తెలుగులో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. మీరు పూర్తి చేసిన రెండు పత్రాల్లో ఒకదాని బీఎల్‌వో తీసుకుంటారు. రెండోదాన్ని రసీదుగా మీకే ఇస్తారు. భవిష్యత్ అవసరాల కోసం దీన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలి.

**ఆన్‌లైన్‌లోనూ అప్‌డేట్**

మీరు ఆఫీసు పనుల్లో బిజీగా ఉంటే బిఎల్‌ఓ కోసం ఇంట్లో ఎదురు చూసే పరిస్థితి లేకుంటే, మీ కోసం ఎన్నికల సంఘం స్మార్ట్ ఆప్షన్ తీసుకొచ్చింది. ఆన్‌లైన్‌లోనే వివరాలను పూర్తి చేయవచ్చు. మీ మొబైల్ నెంబర్, ఎపిక్ కార్డు నెంబ్ ఉపయోగించి లాగిన్ అవ్వండి. మీ ఓటరు జాబితా వివరాలు, ఆధార్ కార్డులోని పేరు సరిపోలితేనే ఈ డిజిటల్ సౌకర్యం వర్తిస్తుంది. రాష్ట్రంలో 3 కోట్ల 38లక్షల 29వేల 18 మంది ఓటర్లు ఉండగా 69.92 శాతం అంటే 2 కోట్ల 36 లక్షల 54వేల 232 ఓటర్ల వివరాలు 2002లోని ఓటర్లు లేదా వారి కుటుంబ సభ్యులతో మ్యాచ్ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 35.73శాతం కోటీ లక్ష 74వేల 786 మంది ఓటర్ల వివరాలు సరిపోలలేదు. మ్యాపింగ్ జరిగిన ఓటర్లలో 35.73 శాతం అంటే 89 లక్షల 44 వేల 713 మంది పేర్లు, అడ్రస్, వయసు తదితర వివరాలు కొంత అనుమానాస్పదంగా ఉన్నాయి. వీటిపై విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటారు. అర్హులైన ఓటర్లందరి వివరాలు జాబితాలో చేర్చాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ భారీ కసరత్తు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పట్టణాల్లో 14 వేల 750, గ్రామాల్లో 21 వేల 157 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎస్ఐఆర్ కోసం 119 ఈఆర్‌వోలు, 882 ఏఈఆర్‌వోలు, 3 వేల 596 సూపర్‌వైజర్లు, 35 వేల 985 బూత్ లెవెల్ ఆఫీసర్లను నియమించి వివిధ దశల్లో శిక్షణ ఇచ్చారు. రాజకీయ పార్టీలు తమ ఏజెంట్లను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీలు 49 వేల 18 మంది బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్‌వోల సమన్వయంతో ఎస్ఐఆర్‌లో పాల్గొననున్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ జులై 24 వరకు నిర్వహించి 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురిస్తారు.



కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో కలిసి తుంగభద్ర గేట్లను ప్రారంభిస్తున్న ముగ్గురు సిఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డికె శివకుమార్. చిత్రంలో మంత్రి ఉత్తమ్

# 'నీటి అడుగులు' ముందుకు

>> అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ఆర్డిఎస్ కింద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించకపోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.డికె శివకుమార్ నాకు బడా భాయ్ ఆయన వల్లే కేంద్ర మంత్రితో ముగ్గురు సిఎంల భేటీ సాధ్యమైందని చెప్పారు. దేశంలోనే అత్యంత అనుభవజ్ఞులైన నాయకుడు చంద్రబాబు అని వ్యాఖ్యానించారు. ఇది 33 గేట్ల పునరుద్ధరణ కార్యక్రమం కాదు.. మూడు తరాల సమస్యను పరిష్కరించే కార్యక్రమం లక్షలాది మంది రైతుల సమస్యలను ఈ గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోందన్నారు. సీఆర్ పాటిల్ కేంద్ర జలశక్తి మంత్రి మూడు రాష్ట్రాల సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారిస్తారని నమ్ముతున్నానని చెప్పారు.

గద్వాల, అలంపూర్, పాలమూరు జిల్లా ప్రాంతంలో రాజోలిబండ డైవర్షన్ స్కీంకు కేటాయించిన 17.9 టీఎంసీల నీళ్లలో కేవలం 5 నుంచి 6 టీఎంసీలే మా రైతాంగం వాడుకుంటోంది దాదాపు 10 టీఎంసీల నీళ్లు మాకు రావడంలేదని చెప్పారు. తుంగభద్రలో మట్టి పేరుకుపోవడం, నీటి కేటాయింపుల సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాం నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సమావేశంలో నిర్ణయించుకున్నామని చెప్పారు. పంచాయితీ కావాలా సమస్య పరిష్కారం కావాలా అంటే నేను పరిష్కారమే కోరుకుంటానని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా తుంగభద్ర నదీ ఒడ్డున జరిగిన చర్చలు గొప్ప నిర్ణయంగా మారబోతోందని, అంతర్రాష్ట్ర జల వివాదాలకు ఇది శాశ్వత పరిష్కారం చూపుతుందని నమ్ముతున్నానని చెప్పారు. మైసూరు రాజులే రైతుల కోసం యుద్ధాన్ని వీడి పరిష్కారం కోసం ముందుకొచ్చారు. రైతులకోసం రాజకీయాలకు అతీతంగా ముందుకు నడవాల్సిన బాధ్యత అందరిపై ఉంది త్వరలోనే కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ పరిష్కారం చూపిస్తారని ఆశిస్తున్నా ఇందుకు తుంగభద్ర సమావేశంతో మొదటి అడుగు పడిందని భావిస్తున్నా అని చెప్పారు.

**6 నెలల్లో 33 గేట్ల పునరుద్ధరించాం: సీఎం చంద్రబాబు**

రాయలసీమలోని పలు ప్రాంతాలకు సాగునీరు.. మరికొన్ని ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు తుంగభద్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.

దేశంలో నదుల అనుసంధానం తన కలల ప్రాజెక్టు అని ఉద్ఘాటించారు. గంగా, గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరగాలని పేర్కొన్నారు. తుంగభద్ర డ్యామ్ 70 ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాజెక్టు అని తెలిపారు. తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. అందరూ రైతులకూ నమస్కారాలు అంటూ సీఎం చంద్రబాబు కన్నడలో ప్రసంగించారు. ప్రాజెక్టు నిర్వహణ బాగుంటేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతోందని చెప్పారు. 6 నెలల్లో తుంగభద్ర ప్రాజెక్టు 33 గేట్ల పునరుద్ధరించామని వివరించారు. తమిళనాడుకు నీళ్లు ఇవ్వాలని 1983లో నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు.

నీటి సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇవాళ ముగ్గురు సీఎంలు కలవడం చరిత్రాత్మకమని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు సమస్య ఉందని తెలిపారు. నీరు ఉంటేనే చరిత్ర, నాగరికత అని.. ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని సీఎం చంద్రబాబు అభివర్ణించారు.

**ముగ్గురం సీఎంలు కలిసి చరిత్ర సృష్టిస్తాం: డీకే శివకుమార్**

కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో చరిత్రాత్మక తీర్మానం చేశామని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతుల కోసం తీసుకున్న నిర్ణయం ఓ చరిత్ర అని తెలిపారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, తాను చరిత్ర సృష్టిస్తామని చెప్పారు. అందరం కలిసి సమన్వయంతో పనిచేస్తామని అన్నారు. మూడు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తామని సీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు.

**20వ గేటును ప్రారంభించిన సీఎం రేవంత్**

అంతకుముందు కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లను మూడు రాష్ట్రాల సీఎంలు డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కలిసి ప్రారంభించారు. తుంగభద్ర ప్రాజెక్టు 20వ గేటును సీఎం రేవంత్ రెడ్డి, 18వ గేటును కర్ణాటక సీఎం డీకే శివకుమార్, 19వ గేటును ఏపీ సీఎం చంద్రబాబు, 17వ గేటును కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ప్రారంభించారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల ప్రారంభోత్సవం జరగడానికి ముందు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కలుసుకున్నారు. హోస్పేట్‌లోని ఐఆర్‌బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సంస్కరణ ప్రక్రియగానే సర్‌ను చూడాలి

### అక్రమ, నకిలీ, డూప్లికేట్ ఓటరు కార్డులను తొలగించాలి: కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** ఎన్నికల జాబితా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ అనేది కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపడుతున్నటువంటి రాజ్యాంగపరమైన, చట్టబద్ధమైన కార్యక్రమం అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటర్ల జాబితాలో పారదర్శకత, స్పష్టత, విశ్వసనీయత ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను చేపడుతోందని పేర్కొన్నారు.

ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఈ సర్ ప్రక్రియను విడతల వారిగా చేపడుతున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియ ఎలాంటి అవాంతరాలు లేకుండా జరుగుతోందన్నారు.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో.. ఎన్నికల జాబితాను సవరించి.. ఈ జాబితాను పూర్తిగా అప్‌డేట్ చేస్తున్నారని తెలిపారు. మొన్నటికి మొన్న అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లోనూ విజయవంతంగా సర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. 25వ తేదీ నుంచి తెలంగాణలోనూ సర్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో దీన్ని.. రాష్ట్ర ఓటర్ల జాబితా సంస్కరణ ప్రక్రియగా చూడాలే తప్ప.. రాజకీయ కోణంలో కాదు అని పేర్కొన్నారు. కొన్నిపార్టీలు, కొందరు రాజకీయ నాయకులు.. ఏదో జరిగిపోతోందంటూ రెచ్చగొట్టేలా ప్రకటనలు చేస్తున్నారు. ఇది సరికాదు అని తెలిపారు.

ఎన్నికల ఓటర్ల జాబితాను పారదర్శకంగా అప్‌డేట్ చేసేందుకు జరిగే ప్రక్రియలకు భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ సహకరిస్తూనే ఉంటుందన్నారు. అర్హుడైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటుహక్కు ఉండాలి, అదే సమయంలో అక్రమ, నకిలీ, డూప్లికేట్ ఓటరు కార్డులను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని చెప్పారు.

బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ మార్గదర్శనంలో, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు నేతృత్వంలో.. అందరు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు.. ఈ సర్ ప్రక్రియలో క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒక్క డూప్లికేట్ ఓట్, ఒక్క నకిలీ ఓటు కూడా కొత్త జాబితాలో ఉండకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.



కారకాస్‌లో గురువారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భూకంప క్షతగాత్రులు

# వెనిజులా నేలమట్టం

>> తీర ప్రాంత దేశాలు సునామీ భయంతో వణికిపోయాయి. యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం మొదట కారకాస్‌కు పశ్చిమాన 160 కిలోమీటర్ల దూరంలోని మొరోన్ సమీపంలో 7.1 తీవ్రతతో భూకంపం సంభవించగా, సరిగ్గా దాని తర్వాతి నిమిషంలోనే అదే ప్రాంతంలో 7.5 తీవ్రతతో రెండో భూకంపం కుదిపేసింది. భూ అంతర్భాగంలో కేవలం 10 నుండి 13 కిలోమీటర్ల లోతులోనే ఈ ప్రకంపనలు కేంద్రీకృతం కావడం వల్ల నష్టం తీవ్రత ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం 200 మందికిపైగా మృతిచెందగా వెయ్యి మందికిపైగా తీవ్ర గాయాల పాలయ్యారని తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగో తెలిపారు. శతాబ్ద కాలంలో వెనిజులా ఎదుర్కొన్న అత్యంత బలమైన భూకంపాలలో ఇది ఒకటి. భూమి ఒక్కసారిగా ఊగిపోవడంతో ప్రజలు ప్రాణభయంతో ఇళ్ల నుండి వీధుల్లోకి పరుగులు తీశారు. అనేక భవనాల గోడలు కూలిపోయి లోపల ఉన్న ఫర్నిచర్ రోడ్డుపైకి కనిపించేలా దెబ్బతిన్నాయి. కారకాస్‌లోని ప్రముఖ అల్టామిరా పరిసర ప్రాంతాల్లో, తీర ప్రాంత నగరమైన లా గుఐరాలో బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, గృహాలు కుప్పకూలాయి. ప్రమాద స్థలాల నుండి భారీగా ధూళి మేఘాలు గాల్లోకి లేచాయి. విద్యుత్, ఇంటర్నెట్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగింది. దేశ అంతర్గత వ్యవహారాల మంత్రి డియోస్డాడో కాబెల్లో ప్రభుత్వ టెలివిజన్ ద్వారా మాట్లాడుతూ అల్టామిరా ప్రాంతంలో భవనాలు, ఇళ్లు కూలిపోయిన అత్యంత ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయి. అందుబాటులో ఉన్న అన్ని వనరులతో సహాయక చర్యలు అందిస్తున్నాయని తెలిపారు. తదుపరి ప్రకంపనలు వచ్చే ముప్పు ఉన్నందున ప్రజలు ఇళ్లలోకి వెళ్లకుండా బహిరంగ ప్రదేశాల్లోనే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంబులెన్సుల రవాణాకు ఆటంకం కలిగించకుండా వాహనదారులు సహకరించాలని కోరారు. ఈ భారీ భూకంపాల నేపథ్యంలో అమెరికాకు చెందిన పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం ప్యూర్టో రికో, యూఎస్ అండ్ బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, అలాగే వెనిజులా తీర ప్రాంతాలకు తక్షణ సునామీ అడ్వైజరీ జారీ చేసింది. సముద్ర అలల్లో తీవ్ర మార్పులు, బలమైన పోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించినప్పటికీ, సుమారు గంట తర్వాత పరిస్థితి అదుపులోకి రావడంతో ఈ హెచ్చరికలను ఉపసంహరించుకున్నారు. కరేబియన్, దక్షిణ అమెరికా టెక్టోనిక్ ప్లేట్ల సరిహద్దుల్లో ఉండే వెనిజువెలా తీవ్రమైన భూకంపాల జోన్‌లో ఉంది. 1821 నాటి స్వాతంత్ర్య యుద్ధ విజయానికి గుర్తుగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ సెలవు దినం జరుపుకుంటున్న రోజే ఈ విపత్తు సంభవించింది. 1967 నాటి ప్రాణాంతక భూకంపం కంటే కూడా దీని తీవ్రత భయంకరంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

**పేకమేడలా కుప్పకూలిన 10 అంతస్తులహోటల్**

వెనిజులాలో ఇవాళ ఒక్క నిమిషం తేడాతో రెండు భారీ భూకంపాలు భారీ ఆస్తినష్టం కలిగించాయి. దేశంలోని లా గైరా రాష్ట్రంలో ఉన్న ఓ హోటల్ పేకమేడలా కూలింది. 10 అంతస్తులు ఉన్న ద హోటల్ ఎడువార్డ్ భూకంప ధాటికి శిథిలమైంది. ఆ హోటల్ ముందు నుంచి భూకంపం తర్వాత ఓ బైకర్ తీసిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. భూకంపం రాకముందు ఎలా ఆ హోటల్ ఉందో మరో పిక్‌లో చూడవ చ్చు. అయితే 7.2, 7.5 తీవ్రతతో కేవలం 40 సెకన్ల తేడాతో వెనిజు వెలాలో ఇవాళ భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది.

**వెనిజులా భూకంపంపై ప్రధానిమోడీ విచారం**

**న్యూఢిల్లీ,జూన్ 25:** వెనిజులాలో సంభవించిన వరుస భూకంపాల్లో ప్రాణ, ఆస్తినష్టం అపారంగా జరగడంపై ప్రధానిమోడీ విచారం వ్యక్తంచేసారు. ఇప్పటివరకూ 200 మంది మృతిచెందగా, వెయ్యి మందికిపైగా గాయపడినట్లు వార్తలు అందాయి. ఈభూకంపాలపై ప్రధానిమోడీ స్పందించారు. బాధితకుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేసారు. ఈ సంక్లిష్టసమయంలో వెనిజులాకు అండగా ఉంటామని సోషల్‌మీడియా వేదికగా ప్రకటించారు.

**వెంటనే సాయమందిస్తాం: ట్రంప్..** భూకంపాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. వెంటనే తక్షణ సాయం అందిస్తామని వెల్లడించారు. భూకంప ప్రభావితప్రాంతాల్లో సహాయక చర్యలుచేపట్టాలని కోరారు. అన్ని ఏజెన్సీలు ఈ సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని, ఇప్పటికే ఆదేశంలో సహాయక బృందాలను సిద్ధంచేసామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబడియో అన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల్లో పూడికతీత

>> నూతన గేట్లను ముగ్గురు ముఖ్యమంత్రులతో కలిసి ప్రారంభించిన తర్వాత జరిగిన సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తుంగభద్ర జలాశయంలో పూడిక పేరుకుపోవడంతో ఘననీయంగా నీటి నిల్వ తగ్గిపోయిందన్నారు. ఆంధ్ర-కర్ణాటక-తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన ఈ ప్రాజెక్టులో పూడిక తీయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల్లో పూడిక తీతకు సాంకేతిక సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని పూడిక తీసే బాధ్యత ఆయా రాష్ట్రాలదేనని ఆయన చెప్పారు. గతంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి నీటి పంపిణీ విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండేవని సిఆర్ పాటిల్ గుర్తు చేశారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రులు ఇక్కడ కలుసుకోవడం సంతోషించ దగ్గ విషయమన్నారు.

## సహనానికి మొహర్రం ప్రతీక: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** త్యాగనిరతి, అనిర్వచనీయ సహనానికి మొహరం ప్రతీకగా నిలుస్తుందని సిఎం రేవంత్ స్పష్టం చేశారు. ముహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని సంస్మరణగా మొహరం జరుపుకుంటారని గుర్తుచేశారు. కొన్నేళ్లుగా తెలంగాణలో హిందూముస్లింలు కలిసి పీర్ల ఊరేగింపు నిర్వహిస్తారని గుర్తు చేసుకున్నారు. ఈ సంస్మరణ తెలంగాణ ప్రాంతంలో గంగా జమునా తెహజీబ్ విధానానికి గొప్ప నిదర్శనమని చెప్పారు. మొహరం సందర్భంగా రాష్ట్రంలో హిందూ ముస్లింలు ఐక్యంగా... శాంతియుతంగా పీర్ల ఊరేగింపు నిర్వహించుకోవాలని కోరారు. ఈ తెలంగాణలో కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య సఖ్యతకు, ఐక్యతకు వారధిగా మొహరం నిలుస్తుందని సిఎం రేవంత్ తెలిపారు.

## మీరు ఇవ్వరు.. వసూలు చేసుకోనివ్వరా?

### జిఒ 9పై 30 వరకు తెలంగాణ హైకోర్టు స్టే

### ప్రైవేట్ కాలేజీలకు హైకోర్టులో స్వల్ప ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** తెలంగాణ హైకోర్టులో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట దక్కింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9లోని కొన్ని మార్గదర్శకాలపై స్టే విధించింది. వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు కాలేజీలు వేసిన పిటీషన్లపై హైకోర్టు గురువారం కూడా విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ప్రభుత్వానికి హైకోర్టు పలు ప్రశ్నలను సంధించింది. మీరు బకాయిలు చెల్లించరు, విద్యార్థుల నుంచి కళాశాలలను ఫీజులు వసూలు చేయవద్దంటే వారు ఎలా నడుపుతారని కోర్టు ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. అలానే ఫీజు రీయింబర్స్మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని అడిగింది. బడ్జెట్ సెషన్ కూడా అయిపోయినట్టు ఉందని, ఇంకా బకాయిలు ఎందుకు రిలీజ్ చేయలేదని ప్రభుత్వాని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. పెండింగ్ బకాయిలు ఎప్పటి లోగా చెల్లిస్తారో తెలపాలని పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు15 లోపు బకాయిలు అన్ని క్లియర్ అవుతాయని ప్రభుత్వ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలియజేశారు.ఆగస్టు 15 లోపు బకాయిలు క్లియర్ అయితే ఆరోజే మా పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు కోర్టుకు తెలిపాయి. వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం జీవో 9లోని కొన్ని నిబంధనలపై వచ్చే మంగళవారం వరకు (జూన్ 30) స్టే విధించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది.

# నేను గుంపు మేస్త్రీనే..

### నా గుంపులో ఉన్నవారంతా భేష్

### ఉద్యోగులు రోజుకో గంట అదనంగా పనిచేయాలి

### వారి బీమా కోసం ఎంఒయు: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రూ.1 కోటి ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు,పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి 14 బ్యాంకులతో ప్రభుత్వం ఎంవోయులు కుదుర్చుకుంది. గురువారం సాయంత్రం రవీంద్రభారతిలో సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంలో ఉద్యోగులదే కీలకపాత్ర, ఉద్యోగుల భద్రత, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రమాద బీమా పథకాన్ని తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించామన్నారు. 45 మంది కార్మికుల కుటుంబాలకు బీమా సాయం అందించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంత్రివర్గానికీ తానే మేస్త్రీ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని, రేవంతన్నగా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని చెప్పారు. పదవులు, హోదాలు మారొచ్చుగానీ ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ మారదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1 నుంచి ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందంటే అది ఉద్యోగుల వల్లేనని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం అమలులో ఉద్యోగుల శ్రమ,సేవ ఉందని చెప్పారు. ఉద్యోగులు రోజుకో గంట అదనంగా పనిచేయాలని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

**ఉద్యోగులపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా: భట్టి విక్రమార్క**

లక్షలాది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని డి.సిఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందన్నారు.

## రాజ్యసభలో 10 మంది నూతన ఎంపిల ప్రమాణ స్వీకారం

**న్యూఢిల్లీ, జూన్ 25:** ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ గురువారం పార్లమెంట్ భవన్‌లో నూతనంగా ఎన్నికైన మరియు తిరిగి ఎన్నికైన 10 మంది రాజ్యసభ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు దేశం పార్టీ సభ్యులు సనా సతీష్ బాబు, విజయ్ చింతకాయల, బాష్యం రామకృష్ణతో పాటు జనసేన పార్టీకి చెందిన లింగమనేని రమేష్ ఉన్నారు. అలాగే అరుణాచల్ ప్రదేశ్ నుంచి బీజేపీ సభ్యుడు తాయ్ టాగాక్, ఒడిశా నుంచి బీజేపీకి చెందిన దేబాశిష్ సమంతరాయ్, తమిళనాడు నుంచి కాంగ్రెస్ సభ్యుడు ప్రవీణ్ చక్రవర్తి, గుజరాత్ నుంచి బీజేపీ సభ్యుడు రాజేష్ పరమానంద్ శుక్లా కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక జార్ఖండ్ నుంచి ఎన్నికైన జార్ఖండ్ ముక్తి మోర్చా సభ్యుడు బైద్యనాథ్ రామ్, స్వతంత్ర సభ్యుడు పరిమల్ నత్వానీ కూడా రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ నూతన సభ్యులను అభినందించి, సభా కార్యకలాపాల్లో ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ 10వ తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** తెలంగాణ 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల య్యాయి. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఫలితాలను పాఠశాల సంచాలకుడు నవీన్ నికోలస్ విడుదల చేశారు. జూన్ 5 నుంచి 12 వరకు పరీక్షలు నిర్వహించగా.. 27,857 మందిలో 23,103 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షల్లో 82.61 శాతం ఉత్తీర్ణత నమోదయింది. రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే సప్లిమెంటరీ ఫలితాల్లో కూడా బాలికలే పై చేయి సాధించారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అధికారులు తెలిపారు.

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను కలిసిన మేఘాలయ సిఎం సి.కె సంగ్మా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన మేఘాలయా ముఖ్యమంత్రి సీ.కే. సంగ్మా గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్ కు వచ్చిన మేఘాలయా ముఖ్యమంత్రి సంగ్మాను శాలువాతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సత్కరించారు.

## మొహర్రం త్యాగానికి ప్రతీక: గవర్నర్ శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** మొహర్రం త్యాగం, ధర్మనిరతి, మానవతకు ప్రతీకగా నిలుస్తుందని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు.ఈ నెల 26న మొహర్రం సందర్భంగా గవర్నర్ రాష్ట్ర ప్రజలకు సందేశాన్ని అందించారు.ఈ మేరకు గురువారం లోక్ భవన్ పత్రికా ప్రకటనను విడుదల చేసింది.సత్యం, న్యాయం కోసం ప్రాణ త్యాగం చేసిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్ సేవలను గవర్నర్ గుర్తు చేసుకున్నారు. త్యాగం, శాంతి, న్యాయం అనే మొహర్రం ఆదర్శాలు అందరికీ స్ఫూర్తినివ్వాలని గవర్నర్ ఆకాంక్షించారు.

## వారం - వర్జ్యం

26-06-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
ద్వాదశి రా.10.23, విశాఖ రా.7.16
వర్జ్యం : రా.11.45-రా.1.33
దు.ఉ.8.13-ఉ.9.05,
2) మ.12.36-మ.1.28
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేస్తారు. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి.బంధువుల కలయిక.

**వృషభం:** సకుటుంబంగా వివాహాది శుభ కార్యాలకు హాజరవుతారు. సంతానపరంగా బాధ్యత కలిగి వుంటారు.

**మిథునం:** ఉద్యోగులు పదోన్నతులు పొందుతారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు.సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** ఏది లాభించే అంశమో, ఏది నష్టపరిచే అంశమో తెలివిగా తెలుసుకొని తదనుగుణంగా మసలుకుంటారు.

**సింహం:** అందరిలోనూ ప్రత్యేకమైన గుర్తింపు లాభిస్తుంది. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. బంధువుల కలయిక.

**కన్య :** అదృష్టానికి దగ్గరగా రోజులు గడుస్తున్నట్లు తోస్తుంది. సంపూర్ణ శుభ ఫలితాలు మాత్రం చేతికి అందవు. ఆస్తి వివాదాలు.

**తుల:** ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవలసి నప్పుడు ఆలోచించి ముందుకు సాగడం మంచిది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** అధిక ప్రయోజనాలు కలిగి చౌకగా వచ్చే వస్తువులను కొనుగోలు చేస్తారు. లలిత కళలు అభ్యసిస్తారు.

**ధనుస్సు:** డబ్బు కన్నా మానవత్వానికి విలువనిచ్చి కొన్ని మంచి పనులు చేస్తారు. వ్యాపార విస్తరణ చేస్తారు.వస్త్రలాభం.

**మకరం:** ముఖ్యమైన బరువు బాధ్యతలను దించుకోగలుగుతారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకొన్నప్పటికీ చికాకులు తప్పవు.

**కుంభం:** మాతృవర్గీయులు మీ సహాయ సహకారాలు అందుకుంటారు. పూర్వంలా కాక కొత్త తరహా ఆలోచనలు చేస్తారు.

**మీనం:** మీ గురించి చెడుగా ప్రచారం చేసే వ్యక్తులకు, దుష్టులకు దూరంగా వుండండి. స్పెక్యులేషన్ లాభించదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు..
# మరోసారి హైకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేసు విచారణను వాయిదా వేస్తూ తదుపరి విచారణను జూలై 22కు నిర్ణయించింది. కాగా, ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో స్పీకర్‌ను పార్టీ చేయవద్దని కోరుతూ స్పీకర్ కార్యాలయం త్వరలో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేయనుంది. దీనికి సంబంధించి సుప్రీం కోర్టు జడ్జిమెంట్లను అందజేయనుంది.

# మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చంచల్‌గూడ జైలు నుండి విడుదల

**హైదరాబాద్ (సైదాబాద్), జూన్ 25, ప్రభాతవార్త:** వివాదాస్పద వ్యాఖ్యాల నేపథ్యంలో అరెస్టయి చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై పెట్టిన కేసులు అన్ని రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమేనని అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలు, కార్మికుల సమస్యలు, బొగ్గు లెక్కలు, డీజిల్ కుంభకోణం, సోలార్ టెండర్ల గురించి ప్రశ్నిస్తున్నందుకే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. సింగరేణిలో ఎలాంటి అక్రమాలు జరుగకపోతే ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని, 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుకు సంబంధించిన రూ1500 కోట్ల కుంభకోణంపై వస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బొగ్గు మాయం కాకుంటే ప్రజలకు లెక్కలు చూపించి, బయటపెట్టాలని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులకు, ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. డీజిల్ కొనుగోళ్లు, వినియోగంలోని అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయని, సోలార్ టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందనే అనుమానాలు ఉన్నాయని, వీటికి సమాధానం చెప్పకుండా ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం ద్వారా అసలు విషయాన్ని మరుగున పడేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు.

# ఎక్సైజ్ శాఖలో భారీగా బదలీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్25:** రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎక్సైజ్ శాఖలో డిప్యూటీ కమిషనర్లుగా పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మరికొందరికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జె.హరికిషన్‌ను సైబరాబాద్ డీసీగా, నల్గొండలో డీసీగా పని చేస్తున్న ఏ శ్రీనివాస్‌రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా బదలీ చేశారు. రంగారెడ్డి డీసీగా ఉన్న దశరథను టీజీబీసీఎల్ డీసీగా, ఖమ్మంలో డీసీగా ఉన్న జనార్దన్ రెడ్డి ఆదిలాబాద్ డీసీగా బదిలీ చేశారు. టీజీబీసీఎల్ ఆర్ఆర్ 1లో ఉన్న దాతురాజు గౌడ్‌ను వరంగల్ డీసీగా, నిజామాబాద్‌లో ఏసీగా ఉన్న వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా, కరీంనగర్ బీసీఎల్‌లో మేనేజర్‌గా ఉన్న రవీకుమార్‌ను కరీంనగర్ డీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ లేబుల్స్‌లో పనిచేస్తున్న పి శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా, హెడ్‌క్వార్టర్స్‌లో డీసీగా ఉన్న కె రఘురాంను రంగారెడ్డి డీసీగా, హైదరాబాద్ ఏసీగా ఉన్న ఏ అనిల్‌కుమార్‌రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లో ఏసీగా ఉన్న పి.ప్రణవిని మల్కాజిగిరి డీసీగా, మహబూబ్ నగర్ ఏసీ విజయ్ భాస్కర్‌రెడ్డి డీసీ అక్కడే పదోన్నతి కల్పించింది. బ్రేవరీస్‌లో ఏసీగా ఉన్న చంద్రయ్యను మెదక్ డీసీగా, ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న సీవీ శశిధర్‌రెడ్డిని నల్గొండ డీసీగా బదలీ చేసింది. బదలీ అయిన అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది.


తెలంగాణ ప్రభుత్వం
ఫారం-6

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ), నాగర్‌కర్నూల్ జిల్లా
**ప్రాథమిక ప్రకటన**

భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

నెం. G2/807/2026 తేది: 12.06.2026
గెజిట్ నెం. 94/2026

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలములోని వంజుగుల గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.0.29 గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్-64 (MJR-2/Minor-4) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్‌గారు భావిస్తున్నారు. కావున ఎ॥లు 0.29 గుం॥ భూమి డిస్ట్రిబ్యూటరీ కెనాల్-64 (MJR-2/Minor-4) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకుగాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**షెడ్యూల్**

గ్రామము : వంజుగుల మండలం : కల్వకుర్తి జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్. డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట /ఆయకట్టు /తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేర్లు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 10 | 486 | పట్టా | మెట్ట | 0.29 | బుర్రి రాంరెడ్డి తండ్రి: జంగారెడ్డి (0.14)<br>బుర్రి శేఖర్ రెడ్డి తండ్రి: జంగారెడ్డి (0.15)<br>మేరెడ్డి రజిత భర్త : వెంకటరెడ్డి<br>సూర్య చిన్న జంగయ్య తండ్రి: బాలయ్య<br>మేరెడ్డి రాంరెడ్డి తండ్రి: బక్కయ్య<br>మేరెడ్డి వెంకటరెడ్డి తండ్రి: బక్కారెడ్డి<br>సురభి కమలాకర్‌రావు తండ్రి : వెంకట్‌రావు | 485 | VB | 485 | 487 | లేవు | లేవు | లేవు | లేవు |
| | మొత్తము | | | 0.29 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలుగాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి.,నాగర్‌కర్నూల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No.51 తేది: 25.07.2017 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013లోని అధ్యాయము-II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ. సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్
సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్


DIPR RO.NO:361/LA/PP/Advt/Pub/2026-27


# రాజ్యసభ ఎంపిల ఆస్తుల విలువ రూ.26,047 కోట్లు

### ఎడిఆర్ అధ్యయన నివేదికలో ఆసక్తికర అంశాలు

**న్యూఢిల్లీ, జూన్ 25:** రాజ్యసభ సభ్యుల ఆర్థిక, నేర చరిత్రపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విడుదల చేసిన తాజా నివేదికలో పలు కీలక, ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలోని పెద్దల సభలో అత్యధిక సంపన్నులతో పాటు తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది. మొత్తం 233 మంది సభ్యులకు గాను 226 మంది సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఈ విశ్లేషణ జరిగింది. నివేదిక ప్రకారం ఈ 226 మంది ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ.26,047 కోట్లుగా ఉంది. సగటున ఒక్కో ఎంపీ ఆస్తి రూ.115 కోట్లకు పైగా ఉండటం గమనార్హం. వీరిలో 31 మంది ఎంపీలు (14శాతం) రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న బిలియనీర్లుగా ఉన్నారు. మరోవైపు కేవలం నలుగురు ఎంపీలు మాత్రమే తమ ఆస్తుల విలువ రూ.20 లక్షల లోపు ఉన్నట్లు ప్రకటించారు. సుమారు 100 మంది ఎంపీల ఆస్తులు రూ.10 కోట్లకు పైగా ఉండగా, 41 మందికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల మధ్య, 66 మందికి రూ.1 కోటి నుంచి రూ.5 కోట్ల మధ్య ఆస్తులున్నాయి. ఆస్తులతో పాటు ఎంపీల నేర చరిత్రను కూడా ఏడీఆర్ విశ్లేషించింది. విశ్లేషించిన వారిలో 69 మంది ఎంపీలపై (31 శాతం) క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరిలో 36 మంది ఐదేళ్ల లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉన్న తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఒక ఎంపీపై హత్య కేసు (సెక్షన్ 302), మరో నలుగురిపై హత్యాప్రయత్నం (సెక్షన్ 307) కేసులు ఉన్నాయి. ఇంకో నలుగురు ఎంపీలపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి.

పార్టీల వారీగా చూస్తే బీజేపీకి చెందిన 107 మంది ఎంపీలలో 28 మందిపైనా, కాంగ్రెస్‌కు చెందిన 29 మందిలో 12 మందిపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయి. టీడీపీకి చెందిన నలుగురిలో ముగ్గురిపై, బీఆర్ఎస్ కి చెందిన ముగ్గురు ఎంపీలపైనా కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ 9 మందిలోఇద్దరు, డీఎంకే 8 మందిలోఇద్దరు, సమాజ్‌వాదీ పార్టీ నలుగురిలో ఇద్దరు, సీపీఎం ముగ్గురులో ఒకరు, ఆర్జేడీ ముగ్గురిలో ఇద్దరు చొప్పున క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎంపీలు ఉన్నారు. రాష్ట్రాల వారీగా సంపద కేంద్రీకరణలో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. రాష్ట్రానికి చెందిన ఏడుగురు ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ.8,310 కోట్లు కాగా, వారిలో నలుగురు బిలియనీర్లు ఉన్నారు. వ్యక్తిగతంగా చూస్తే, బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రూ.5,300 కోట్లకు పైగా ఆస్తులతో దేశంలోనే అత్యంత సంపన్న రాజ్యసభ సభ్యుడిగా నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజిందర్ గుప్తా (రూ.5,053 కోట్లు), కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ (రూ.2,558 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మరోవైపు ఆప్ ఎంపీ సంత్ బల్బీర్ సింగ్ కేవలం రూ.3.79 లక్షల ఆస్తితో జాబితాలో అట్టడుగున ఉన్నారు. కొంతమంది ఎంపీలకు ఆస్తులతో పాటు భారీగా అప్పులు కూడా ఉన్నట్లు నివేదిక



పేర్కొంది. జార్ఖండ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పరిమళ్ నత్వానీకి రూ.755 కోట్ల ఆస్తులుండగా, అత్యధికంగా రూ.256 కోట్ల అప్పులు ఉన్నాయి. ఏపీ చెందిన టీడీపీ ఎంపీ బి. రామకృష్ణ రూ.672 కోట్ల ఆస్తులు, రూ.200 కోట్లకు పైగా అప్పులు ఉన్నట్లు ప్రకటించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్‌కు రూ.1,578 కోట్ల ఆస్తులు, రూ.149 కోట్లకు పైగా అప్పులు ఉన్నట్లు తెలిపారు.

# రాష్ట్రాన్ని మహార్దశకు చేర్చనున్న హ్యామ్‌రోడ్లు

### సిఎం రేవంత్‌రెడ్డిచే 28న హ్యామ్‌రోడ్ పైలాన్ ఆవిష్కరణ
### ఆర్అండ్‌బి 419 రోడ్లకు రూ. 13వేల కోట్లు
### 96 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,450 కిమీ పిఆర్ రోడ్లు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** తెలంగాణకు హైబ్రిడ్ అన్యూటిమోడ్ విధానంతో 12వేల కి.మీ. ఆర్అండ్‌బి, 7,450 కి.మి పంచాయితీరాజ్ రోడ్లను నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణ చేసే ప్రక్రియ ఆరంభిస్తుండటంతో రవాణా రంగంలో రాబోతున్న గణీయమైన మార్పుతో రాష్ట్రంకు మహర్థశ పట్టనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 28న ఆర్ అండ్ బి 13వేల కోట్లతో నిర్మించి అభివృద్ధి నిర్వహణ చేసే హ్యామ్‌రోడ్ల పైలాన్ నల్లగొండ జిల్లా కనగల్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఆవిష్కరిస్తారు. తెలంగాణలో ఆర్ అండ్‌బి ఆధ్వర్యంలో నిర్మించబోయే 5824.27కిమి నిడివి కలిగిన 419 రోడ్లకు లాంఛనంగా శంకుస్థాన చేయబోతు న్నారు. హ్యామ్ పద్ధతిలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మంచి ర్యాల, నల్లగొండ, నిజామాబాద్,సంగారెడ్డి సిద్ది పేట, వనపర్తి, యాదగిరి భువనగిరి జిల్లాలో రోడ్లను అభివృద్ధి పరచాలని దృష్టి సారించింది. హ్యామ్ విధానంలో 40శాతం వ్యయం రాష్ట్రప్రభుత్వం భరించగా 60శాతం కమిషనీయర్ పెట్టుబడిపెడుతారు . నిర్మాణ సమయంలో ప్రభుత్వం నలుబైశాతంను పది సమాన వాయిదాల్లో నిర్మాణ వ్యయం అందిస్తోంది. ఈ 60శాతంను 15సంవత్సరాలలో 30 వాయిదాల్లో తిరిగి చెల్లిస్తుంది. రోడ్ల నిర్వహణ బాధ్యత పెట్టుబడిదారుడికే ఉంటుంది. మొదటి దశలో 32 ప్యాకేజిలలో పనులు చేయబోతున్నారు.

ఆర్అండ్‌బి తరహాలోనే 96 అసెంబ్లీ నియోజకవర్గాలలో 7450 కిమి పల్లెగ్రామీణ రహదారులను కూడా నిర్మించబోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్‌బి, పిఆర్‌కు చెందఇన కీలకమైన గామీణరోడ్లు, రాష్ట్రరోడ్లు, ప్రధానమార్గలను అద్దంలా నున్నగా అన్నికాలకు అనువైన రోడ్లుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో హ్యామ్ రోడ్ల విధానంకు ప్రభుత్వం మొగ్గు చూపింది. హైబ్రిడ్ అన్యూటీ మోడ్ విషయంలో కాంట్రాక్టర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూపడంలేదు దీనితో కాంట్రాక్టు ఒప్పొందాలు చేసుకోవడం ఆలస్యం అవుతోన్నది. సిఎం పర్యటన సందర్భంగా అర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో బయలుదేరి నల్లగొండ జిల్లా కనగల్ మండలం చేరుకొని మొదటగా మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన "హ్యామ్" రోడ్ల పైలాన్ ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తారు. అనంతరం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో మొదటి ఫేజ్ డ్రింకింగ్ వాటర్ అందించే పనులకు శంకుస్థాపన చేస్తారు సిఎం ఎన్జీ కాలేజి గ్రౌండ్స్ లో జరిగే భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి హాజరవుతారు.

# టిజి లాసెట్, పిజిఎల్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

### రిజిస్ట్రేషన్లు, సీట్ల కేటాయింపుల తేదీలు ఖరారు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** తెలంగాణలో మూడేళ్ళ, ఐదేళ్ల లా కోర్సులతో పాటు రెండేళ్ల ఎల్ఎల్ఎమ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ లాసెట్, టీజీ పీజీఎల్‌సెట్2026 ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పీజీఆర్‌ఆర్‌సీడీఈ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సెంటర్ వేదికగా కన్వీనర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి గురువారం సాయంత్రం షెడ్యుల్ విడుదల చేశారు. అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ ప్రవేశాలకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్‌ను ఈనెల 26 విడుదల చేయ నున్నట్లు కన్వీనర్ ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం టీజీ లాసెట్ (3వైడిసి అండ్ 5వైడిసి) కోర్సులకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్కాన్ చేసిన సర్టిఫికేట్ల అప్‌లోడింగ్ ప్రక్రియ జూలై 5, 2026 నుంచి జూలై 10, 2026 వరకు కొనసాగుతుంది. అలాగే టీజీ పీజీఎల్‌సెట్ కోర్సు అభ్యర్థులకు జూలై 27, 2026 నుంచి జూలై 31, 2026 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ప్రవేశాల డైరెక్టరేట్ వేదికగా భౌతిక ధృవీకరణ ప్రక్రియ జరుగుతుంది. లాసెట్ ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు జూలై 6 నుంచి జూలై 9 వరకు, పీజీఎల్‌సెట్ అభ్యర్థులకు జూలై 29 నుంచి జులై 31వరకు స్లాట్ బుకింగ్ ద్వారా ఈ సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

**మొదటి విడత వెబ్ఆప్షన్ల ప్రక్రియ విషయానికి వస్తే..**

లాసెట్ అభ్యర్థులు జూలై 16 నుంచి జూలై 19, 2026 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూలై 20న ఆప్షన్ల సవరణకు అవకాశం ఉంటుంది. అనంతరం జూలై 24, 2026న ప్రొవిజనల్ సీట్ల కేటాయింపు జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచుతారు. సీట్లు పొందిన అభ్యర్థులు జూలై 25 నుండి జూలై 28 వరకు సంబంధిత కాలేజీల్లో ఒరిజినల్ సర్టిఫికేట్ల వెరిఫికేషన్, ట్యూషన్ ఫీజు రశీదుతో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.మరోవైపు పీజీఎల్‌సెట్ అభ్యర్థులకు ఆగస్టు 1 నుండి ఆగస్టు 2, 2026 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, ఆగస్టు 5న సీట్ల కేటాయింపు జరుగుతుంది. వీరు ఆగస్టు 5 నుండి ఆగస్టు 8, 2026 లోపు కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అర్హులైన అభ్యర్థులు గడువులోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.


తెలంగాణ ప్రభుత్వం
ఫారం-6

జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ), నాగర్‌కర్నూల్ జిల్లా
**ప్రాథమిక ప్రకటన**

భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

నెం. G2/767/2026 తేది: 12.06.2026
గెజిట్ నెం. 90/2026

నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలములోని పెద్దూర్ గ్రామము వద్ద అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రాంపూర్ కెనాల్ నిర్మాణ నిమిత్తము పెద్దూర్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.4.21 గుంటలు/సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రాంపూర్ కెనాల్ నిర్మాణ నిమిత్తము సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి యూనిట్-1, నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కావున ఎ॥లు 4.21 గుం॥ భూమి అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రాంపూర్ కెనాల్ నిర్మాణ నిమిత్తము భూసేకరణ ద్వారా సేకరించుటకుగాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**షెడ్యూల్**

గ్రామము : పెద్దూర్ మండలం : తెల్కపల్లి జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్. డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట /ఆయకట్టు /తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేర్లు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 114 | పట్టా | మెట్ట | 4.04 | కొట్టె భగవంతు తండ్రి: లక్ష్మయ్య (0.28)<br>కొట్టెబాల్‌రాం తండ్రి: లక్ష్మయ్య (0.08)<br>కొట్టె విష్ణు తండ్రి: బాలస్వామి (0.08)<br>కొట్టె మండయ్య తండ్రి: లక్ష్మయ్య (0.28)<br>బాజు తండ్రి:ఎల్లయ్య(0.34)<br>కొట్టె వెంకటయ్య తండ్రి: లక్ష్మయ్య (0.34)<br>కొట్టె రాజు తండ్రి: రాఘవయ్య (0.18)<br>రోడ్ (0.06) | VB | 116 | VB | 113 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 116 | పట్టా | మెట్ట | 0.17 | కొట్టె బాల్‌రాజు తండ్రి:చంద్రయ్య<br>కొట్టె అంజనేయులు తండ్రి:చంద్రయ్య (0.17)<br>కొట్టె మండయ్య తండ్రి: లక్ష్మయ్య<br>కొట్టె ఎల్లయ్య తండ్రి: లక్ష్మయ్య<br>కొట్టె లక్ష్మమ్మ భర్త : వెంకటయ్య<br>కొట్ట నల్లమ్మ భర్త : భగవంతు<br>జాక్క బాలయ్య తండ్రి: రాములు<br>కొట్టె జ్యోతి భర్త:విష్ణు | 114 | 123 | VB | 117 | లేవు | లేవు | లేవు | లేవు |
| | మొత్తము | | | 4.21 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., యూనిట్-I, నాగర్‌కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సెక్షన్ 26(3) ననుసరించి నిర్దేశిత నష్టపరిహారము సంబంధిత భూ నిర్వాసితులు మరియు అధికారుల సంప్రదింపుల అనంతరం నిర్ణయం తీసుకోవడం జరిగినది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలుగాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., యూనిట్-I, నాగర్‌కర్నూల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము యూనిట్-I, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No.42 తేది: 11.11.2025 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013లోని అధ్యాయము-II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.


సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ. సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్
సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO.NO: 355/LA/PP/Advt/Pub/2026-27


# రామ్ మందిర ట్రస్ట్ ఆర్థిక వివరాలపై వివాదం

### సిట్ దర్యాప్తు పూర్తయ్యే వరకూ వివరాలివ్వలేం
### అయోధ్య విరాళాలపై ట్రస్ట్ వెల్లడి

**అయోధ్య, జూన్ 25:** అయోధ్యలోని రామ్ మందిర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై వివాదం కొనసాగుతోంది. ట్రస్ట్‌కు వచ్చిన విరాళాలు, భూముల కొనుగోలు వివరాలను బహిరంగ పరచాలని కోరుతూ సీనియర్ బీజేపీ నేత రజ్నీష్ సింగ్ ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో పీఎంఓ సంబంధిత అంశంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర,జిల్లాస్థాయి యంత్రాంగాన్ని ఆదేశించింది.జిల్లా యంత్రాంగం ట్రస్ట్ ప్రతినిధులను సంప్రదించి అవసరమైన ఆర్థిక వివరాలు అందించాలని కోరింది. అయితే ప్రస్తుతం ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతున్నందున ఆ వివరాలను వెల్లడించడం సాధ్యం కాదని ట్రస్ట్ స్పష్టం చేసింది. విచారణ పూర్తయ్యే వరకు సమాచారం బహిరంగపరచడం సరైంది కాదని ట్రస్ట్ అభిప్రాయపడింది.ఇదిలా ఉండగా, ట్రస్ట్‌లో నగదు లెక్కింపు పనుల్లో పాల్గొన్న కొందరు ఉద్యోగులు దర్యాప్తు సంస్థల నిఘాలో ఉన్నట్లు సమాచారం. కొందరి నివాసాల్లో నగదు స్వాధీనం చేసుకున్నట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. అదేవిధంగా, రామ్ మందిరానికి బంగారు ఆభరణాలు విరాళంగా ఇచ్చిన కొందరు భక్తులు తమకు ఇప్పటివరకు అధికారిక రసీదులు అందలేదని ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు, కొందరు మత గురువులు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ఆరోపణలపై తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆరోపిస్తున్నారు. రామ్ మందిర ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై జరుగుతున్న సిట్ విచారణ పూర్తయిన తర్వాతే పూర్తి



వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ, మత వర్గాలు భావిస్తున్నాయి.

**పిల్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు**

అయోధ్య రామాలయంలో నిధులను దుర్వినియోగం చేశారని, ఆ ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఓ పిటీషనర్ ఇవాళ ఆశ్రయించాడు. ఈనెల 29వ తేదీన సోమవారం కోర్టుకు వచ్చి పిల్‌ను దాఖలు చేసుకోవాలని ఆ పిటీషనర్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నిధుల దుర్వినియోగం అంశంపై దర్యాప్తునకు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయాలని, నిర్దేశిత సమయంలోగా నిధులపై దర్యాప్తును పూర్తి చేయాలని ఆ పిటీషన్‌లో కోరారు. సీబీఐ నేతృత్వంలోని సిట్ ప్రస్తుతం అయోధ్య నిధులపై దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే. అడ్వకేట్లు అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్‌లు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. కోట్లాది భక్తుల, దాతల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రజాప్రయోజనాల రక్షణ కోసం నిధుల నిర్వహణ అంశంలో ఓ రెగ్యులేటరీ వ్యవస్థను తయారు చేయాలని కోరుతూ కేంద్రం, యూపీ సర్కారు, రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు ఆదేశాలు ఇవ్వాలని ఆ పిటీషన్‌లో కోరారు. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ తో కూడిన ధర్మాసనం ఈ కేసులో వాదనలు విన్నది. లిస్టింగ్ కోసం సోమవారం పిల్ దాఖలు చేయాలని కోర్టు సూచించింది.

# నాగోల్ ఎస్‌టిపిని సందర్శించిన కేంద్ర సహాయమంత్రి టోకెన్ సాహు



నాగోల్ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శిస్తున్న కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయమంత్రి టోకెన్ సాహు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** కేంద్ర గృహనిర్మాణ పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోకెన్ సాహు హైదరాబాద్‌లోని 320 ఎంఎల్‌డీ నాగోల్ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (ఎస్‌టీపీ) సందర్శించారు. మంత్రితో పాటు జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, సీఎజీఎం పద్మజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాంట్ పనితీరు, మురుగునీటి శుద్ధి ప్రక్రియ, నిర్వహణ విధానాలు, ఎస్‌బీఆర్‌లు, స్కాడా వ్యవస్థ తదితర విభాగాలను పరిశీలించిన మంత్రి, పర్యావరణ ప్రమాణాల అమలు, వ్యర్థ జలాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.

అనంతరం నిర్వహణ సిబ్బందికి పీపీఈ కిట్లు పంపిణీ చేసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, సమర్థవంతమైన మురుగునీటి శుద్ధి, ఉద్యోగుల భద్రతకు జలమండలి ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా మంత్రి టోకెన్ సాహుకు అధికారులు తెలిపారు.

వార్త

మహనీయుడు మరణాసన్న దశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.

-లియో టాల్‌స్టాయ్

# అమలుకాని చట్టాలెందుకు?

మానవజాతిని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాలు, ధూమపానాలను పారద్రోలే విషయంలో పాలకుల ఆరాటమే కానీ పోరాటం త్రికరణశుద్ధిగా లేదని చెప్పాలి. ఈ రెండు వ్యసనాల వల్ల ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయని, రోగస్తులై, మంచానికే పరిమితమై కృంగి,కృశించి ప్రాణాలు వదులుతున్నారనే విషయం పాలకులకు తెలియంది కాదు.చట్టాలు చేస్తున్నారు. ఉపన్యాసాలు ఇస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ త్రికరణ శుద్ధిగా వీటిని నియంత్రించేందుకు మాత్రం ప్రయత్నాలు జరగడం లేదేమోననిపిస్తున్నది. కొందరిని కొంత కాలం మోసం చేయొచ్చు. అందరిని కొంతకాలంమోసం చేయొచ్చు. అందరినీ ఎల్లకాలం మోసం చేయాలంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను మోసం చేసిన వారు, వేధించిన వారు ఎందరో చక్రవర్తులు, రాజులు, మరెందరో నేతలు చరిత్రహీనులుగా కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, ప్రజావసరాలను గుర్తించి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని, ఆదరాభిమానాలు పొంది వారి హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న నాయకులు ఎందరోఉన్నారు. మాదకద్రవ్యాల విషయంలో ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు, అటు కేంద్ర ప్రభుత్వం నిరోధించేందుకు గట్టిప్రయత్నాలే చేస్తున్నట్లు చెబుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అలా కన్పించడం లేదు.రోజురోజుకు మాదకద్రవ్యాలు విస్తరించిపోతున్నాయి. ఒక వ్యూహం ప్రకారం ఎప్పటికప్పుడు దారులు మార్చుకుంటూ వినియోగదారులను పెంచుకుంటున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా ఇరవై యేళ్లలోపు ఉన్న యువతీయువకులు ఈ మత్తులోపడి వారు ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదు. నేరాలు, ప్రమాదాలు అంతులేకుండా పెరిగిపోతున్నాయి. ఇక మద్యం విషయంలో ఆదాయాన్ని పెంచుకునేందుకు పాలకులు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యవాదుల్లో ఆవేదన వ్యక్తమవుతున్నది. మద్యం సరే. సారాను నిషేధించారు. కానీ ఏమాత్రం అమలు అవుతున్నదో తెలుగు రాష్ట్రాల్లోనే కాదు అటు పొరుగునున్న మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. కొన్ని ప్రాంతాల్లో మంచినీరు దొరకని ప్రాంతాలు ఉన్నాయేమోకానీ సారా దొరకని గ్రామం లేదు. గుడుంబా, నాటుసారా ఒక కుటీర పరిశ్రమగా రూపుదిద్దుకున్నది. అయితే కొన్ని రాష్ట్రాలు సారాను నిషేధించేందుకు చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టి అమాయకులకు కిక్కెకిస్తున్నారు. ఎక్కువగా అమ్ముడుపోతున్నది చీప్ లిక్కరే. ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది కూడా ఈ చీప్ లిక్కరే అనేది అందరికి తెలిసిందే. కల్తీ చీప్ లిక్కర్ తాగి ఎందరో ప్రాణాలు వదిలిన సంఘటనలు కూడా తరుచుగా చోటుచేసుకుంటున్నాయి. మద్యపానం, ధూమపానం రెండూ మానవజాతిని పట్టిపీడిస్తున్న రెండు భూతాలు. ఒకటి బ్రహ్మరాక్షసి అయితే రెండోది పిశాచి. ఇందులో మరో వాదనకు తావులేదు.మద్యపానాన్ని ఆదాయం దృష్ట్యానియంత్రించలేకపోతున్నారు. ధూమపానం విషయంలో కూడా విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. ఊపిరితిత్తుల కేన్సర్, కిడ్నీ వ్యాధులు, మరెన్నో రోగాలకు ధూమపానం కేంద్ర బిందువుగా ఎందరో వైద్య నిపుణుల అధ్యయనంలో తేలింది.ప్రపంచవ్యాప్తంగా నూట ముప్ఫైకోట్లమందికి పైగా ధూమపానంలో మునిగితేలుతున్నారు. యేడాది యేడాదికి విస్తరిస్తూనే ఉన్నది. భారతదేశానికి సంబంధించి ఇరవై కోట్ల మందికిపైగా పొగాకుకు అలవాటు పడ్డట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇందులో బీడీ తాగేవారే ఎక్కువ శాతం ఉన్నారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆతర్వాత అలవాటుగా మారుతున్నది. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఇందువల్ల రోగాల బారిన పడుతుంటే లక్షలాది మంది అసువులు బాస్తున్నారు.సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిది వందలకు పైగా ప్రమాదకర విషవాయువులు ఉన్నాయి. అవిఅనేక రోగాలకు కారణమవుతున్నాయి. అయితే ఈ బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకుతెరువు ఇస్తున్నదనేది కాదనలేని సత్యం. అడువుల్లో ఉన్న లక్షలాది మంది గిరిజన కుటుంబాలకు బీడీఆకుల సేకరణ ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. కొన్ని శతాబ్దాలుగా అదొక కుటీర పరిశ్రమగా వర్థిల్లుతున్నది. ఈ వాస్తవాలు పట్టించుకోకుండా బీడీ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేయడం అవివేకం అనిపిస్తున్నది. దీంతో వారంతా ఏకమై ఎదురుతిరగడం, రాజకీయ ఒత్తిడి తోడువకావడంతో విరమించుకోవాల్సి వస్తున్నది. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. యేటా నలభై వేలకోట్ల రూపాయలకుపైగా పొగాకు వ్యాపారం జరుగుతున్నదని అంచనా. లక్షలాది మంది రైతులు పొగాకు సాగుపై ఆధారపడి ఉన్నారు. వారితోపాటు మరెంతో మంది కూలీలు దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆ కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలుచేసి చేతులు దులుపుకుంటే ప్రయోజనం ఉండదు.ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే జీవనోపాధికోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయంచూపి పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించాలి. అప్పుడే దీనికి పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ ఆచరణ సాధ్యం కానీ, అమలు చేయలేని చట్టాలు చేస్తే నవ్వుల పాలుకాక తప్పదు.



నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించటం ముఖ్యం.

ఆల్బర్ట్‌కామూ



మనం ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.

సెయింట్ థెరిస్సా

# మాదక ద్రవ్యాల అడ్డుకట్టకు గట్టి కృషి

**చట్టం ప్రకారం మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం,నిల్వ, వినియోగం వంటి చర్యలు కఠినశిక్షార్హమైన నేరాలు. అయినప్పటికీ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు మాదక ద్రవ్యాల ప్రమాదాలపై నిరంతర అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. సమాజంలోని ప్రతివర్గం ఈ సమస్యను కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ముఖ్యంగా వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణించి వారికి వైద్య చికిత్స, మానసిక సలహా, పునరావాస సేవలు అందించాలి.**



రామ కిష్టయ్య సంగన భట్ల

మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) నేడు ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజాన్ని, ముఖ్యంగా ఆధునిక నాగరికతను వేధిస్తున్న అత్యంత ప్రమాదకరమైన సామాజిక సంక్షోభం. ఒకప్పుడు కేవలం సంపన్న వర్గాలకో, విలాసవంతమైన నగరాలకో లేదా అంతర్జాతీయ స్మగ్లర్ల రహస్య స్థావరాలకో పరిమితమైన ఈ వ్యసన సంస్కృతి, నేడు నిశ్శబ్దంగా గ్రామీణ ప్రాంతాలకు, చివరకు పల్లెల్లోని సామాన్య కుటుంబాలకు సైతం విస్తరించడం అత్యంత ఆందోళనకరం. దేశ ప్రగతికి, భవిష్యత్తుకు వెన్నెముక లాంటి యువశక్తిని ఈ మహమ్మారి నీరుగారుస్తోంది. వ్యక్తిగత జీవితాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా కుటుంబ వ్యవస్థలను, సామాజిక సంబంధాలను, దేశాల ఆర్థిక వ్యవస్థలను సైతం దెబ్బతీస్తున్న ఈ దురాచారాన్ని అరికట్టేందుకు ప్రపంచ దేశాలు నిరంతరం పోరాడుతున్నాయి. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, వ్యాపారాన్ని నిరోధించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాలదుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1987 డిసెంబర్ 7న ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఆమోదించిన తీర్మానం 42/112 ప్రకారం ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల ముప్పు నుండి రక్షించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి మాదక ద్రవ్యాలు నేరాల కార్యాలయం అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. యువత మాదక ద్రవ్యాల బారిన పడటం అనేది కేవలం ఒక వ్యక్తిగత ఆరోగ్య సమస్య లేదా నైతిక పతనం మాత్రమే కాదు, అది ఒక కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నానికి, ఆర్థిక నష్టానికి, శాంతిభద్రతల క్షీణతకు, దేశ జాతీయ భద్రతకే పెనుసవాలుగా పరిణమించిన ఒక బహుముఖ సంక్షోభం. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి మాదక ద్రవ్యాలు, నేరాల నియంత్రణ సంస్థ విడుదలచేసిన అంతర్జాతీయ నివేదికలను పరిశీలిస్తే భయంకరమైన వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 కోట్లకు పైగా ప్రజలు వివిధ రకాల మాదకద్రవ్యాలను వినియోగిస్తుండగా, అందులో సింహభాగం 15నుంచి 35సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులే కావడం గమనార్హం. భారత దేశంలో కూడా గత దశాబ్దకాలంలో డ్రగ్స్ వినియోగం ఊహించని రీతిలో, గణనీయమైన శాతంలో పెరిగింది. కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ స్థాయిసర్వేల ప్రకారం, దేశంలో లక్షలాది మంది యువత సంప్రదాయ గంజాయి, అఫీముల తో పాటు హెరాయిన్, కొకైన్ వంటి ప్రాణాంతక డ్రగ్స్, ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ, మెథాంఫెటమైన్ వంటి సింథటిక్, రసాయన పదార్థాలకు తీవ్రంగా బానిసలవుతున్నారు. ముఖ్యంగా దేశఆర్థిక రాజధాని ముంబై,జాతీయ రాజధాని ఢిల్లీ తో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైవంటి ఐటీ హబ్‌లు, పంజాబ్,మణిపూర్ వంటి సరిహద్దు రాష్ట్రాలు ఈడ్రగ్స్ మాఫియాకు ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి.యువత ఇంతలా ఈ వ్యసనాల వైపు ఆకర్షితులు కావడానికి వెనుక అనేక సామాజిక, మానసిక, సాంస్కృతిక కారణాలు దాగి ఉన్నాయి. ఆధునిక విద్యావ్యవస్థలో విపరీతంగా పెరిగిపోయిన పోటీ, మార్కులకోసం తల్లిదండ్రుల ఒత్తిడి, పరీక్షల భయం, ఉన్నత ఉద్యోగాల సాధనలో ఎదురవుతున్న వైఫల్యాలు యువతలో తీవ్ర మానసిక ఆందోళనకు దారితీస్తున్నాయి. ఈ ఒత్తిడి నుంచి తాత్కాలిక ఉపశమనం కోసం, మానసిక ఒంటరితనాన్ని మరిచి పోవడం కోసం కొందరు



ఈ తప్పుడు మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీనికితోడు 'పీర్ ప్రెషర్' అనబడే స్నేహితుల ఒత్తిడి, సమ వయస్కుల మధ్య తాము తక్కువ అయిపోకూడదనే అహంకారం కూడా ఒక ముఖ్య కారణం. వీటన్నింటికీ మించి, ఆధునిక సమాజంలో వినోద మాధ్యమాల ప్రభావం విపరీతంగా పెరిగింది. చలనచిత్రాలు, పాశ్చాత్య వెబ్ సిరీస్‌లు, సామాజిక మాధ్యమాలలో డ్రగ్స్ తీసుకోవడాన్ని ఒక 'ఫ్యాషన్'గా, ఆధునికతకు ప్రతీకగా, గొప్ప సాహసంగా ఆకర్షణీయంగా చూపించడం వల్ల పసి మనస్సులు తప్పుదోవ పడుతున్నాయి. ప్రారంభంలో కేవలం కుతూహలంతోనో లేదా స్నేహితుల ముందు గొప్పలు చెప్పుకోవడానికో ఒకసారి ప్రయత్నించే సరదా,క్రమంగా మెదడును తన ఆధీనంలోకి తెచ్చుకొని జీవితాంతం వదిలించుకోలేని భయంకరమైన వ్యసనంగా మారిపోతోంది. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు మొదటగా వ్యక్తిగత ఆరోగ్యాన్ని పూర్తిగా ఛిన్నాభిన్నం చేస్తాయి. డ్రగ్స్ శరీరంలోకి ప్రవేశించగానే కేంద్ర నరాల వ్యవస్థపై, ముఖ్యంగా మెదడు పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీనివల్ల జ్ఞాపకశక్తి మందగించడం, ఆలోచనా సామర్థ్యం హరించుకుపోవడం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి నష్టాలు వాటిల్లుతాయి. కాలక్రమేణా ఇది తీవ్రమైన మానసిక అస్థిరతకు,లేనివి ఉన్నట్లు ఊహించుకునే భ్రాంతులకు, ఆందోళన, తీవ్ర నిరాశకు దారితీసి, చివరకు ఆత్మహత్యా ఆలోచనలను రేకెత్తిస్తుంది. శారీరకంగా గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు వంటి ముఖ్య అవయవాలు క్రమంగా క్షీణిస్తాయి. మోతాదు మించి తీసుకోవడం వల్ల శ్వాస వ్యవస్థ స్తంభించి ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా లక్ష లాది మంది నడివయస్సులోనే ఆకస్మిక మరణాల బారిన పడుతున్నారు. విద్యావ్యవస్థపై, విద్యార్థులపై ఈ ప్రభావం మరింత వినాశకరంగా ఉంటోంది. డ్రగ్స్‌కు బానిసైనవిద్యార్థి చదువుపై ఏకాగ్రతను పూర్తిగా కోల్పోతాడు. తరగతులకు హాజరు కాకపోవడం, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోవడం, చివరకు చదువును మధ్యలోనే విడిచిపెట్టడం వంటి పరిణామాలు సంభవిస్తాయి.ప్రవర్తనలో విపరీతమైనమార్పులు వచ్చి, హింసాత్మకంగా మారడం, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుంది. విద్యాసంస్థల్లో ఇటీవల కాలంలో తరచూ బయటపడుతున్న డ్రగ్స్ ముఠాల ఉదంతాలు, విద్యారంగాన్ని ఈ మహమ్మారి ఎంతలా కబ్జా చేసిందో స్పష్టం చేస్తున్నాయి. వ్యక్తిగత వినాశనంతో ఆగని ఈ వ్యసనం, ఆ వ్యక్తి ఉన్న కుటుంబ వ్యవస్థను కూడా అగాధంలోకి నెట్టేస్తుంది. డ్రగ్స్ కొనుగోలు చేయడానికి భారీగా డబ్బు అవసరం కావడంతో,విద్యార్థులు లేదాయువకులు ఇంట్లో డబ్బు దొంగిలించడం, అబద్ధాలు చెప్పడం మొదలు పెడతారు. అది చాలాసార్లు బయటమోసాలకు,చిన్న చిన్న నేరాలకు పాల్పడతారు. దీనివల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి దిగజారడమే కాకుండా, సమాజంలో తల్లిదండ్రులు తలదించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.తమ బిడ్డ భవిష్యత్తు నాశనమవడాన్ని చూస్తూ ఆ తల్లిదండ్రులు అనుభవించే మానసిక వేదన వర్ణనాతీతం.ఈ మాదక ద్రవ్యాల వ్యాపారానికి, నేర ప్రపంచానికి అవినాభావ సంబంధం ఉంది. ఇది అంతర్జాతీయ మాఫియా ముఠాలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. భౌగోళికంగా భారతదేశం అక్రమ రవాణాకు అత్యంత అనుకూలమైన,ప్రమాదకరమైన ప్రాంతంలోఉంది. పశ్చిమాన ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్‌లతో కూడిన 'గోల్డెన్ క్రెసెంట్' (బంగారు నెలవంక) ప్రాంతం, తూర్పున మయన్మార్, థాయిలాండ్, లావోస్‌లతో కూడిన 'గోల్డెన్ ట్రయాంగిల్' (బంగారు త్రిభుజం) ప్రాంతాల మధ్య భారత్ విస్తరించి ఉండటం వల్ల, అంతర్జాతీయ స్మగ్లర్లు దేశ సరిహద్దులను సులభంగా వాడుకుంటున్నారు. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టాన్ని అమలుచేస్తోంది.ఈ చట్టం ప్రకారం మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా,విక్రయం,నిల్వ, వినియోగం వంటి చర్యలు కఠినశిక్షార్హమైన నేరాలు. అయినప్పటికీ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు.పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు మాదక ద్రవ్యాల ప్రమాదాలపై నిరంతర అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి.సమాజంలోని ప్రతివర్గం ఈ సమస్యను కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ముఖ్యంగా వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణించి వారికి వైద్య చికిత్స, మానసిక సలహా, పునరావాస సేవలు అందించాలి. ●

# ఇజ్రాయెల్ మొండిపట్టుతో ఫలించని చర్చలు!

కనుమ ఎల్లారెడ్డి

అమెరికా, ఇరాన్ శాంతి చర్చలు ఫలించినట్లే ఫలించి మళ్ళీ మొదటికి వచ్చింది. కారణం ఇజ్రాయెల్ చేసిన నిర్వాకమే. ఒక ప్రక్క శాంతి చర్చలు జరుగుతుండగా ఇజ్రాయెల్ మాత్రం వాటితో మాకు సంబంధం లేదు అని లెబనాన్‌పై విరుచుకు పడింది. లెబనాన్, ఇరాన్‌కు మిత్ర దేశం. ఇజ్రాయెల్, లెబనాన్‌పై దాడులు ఆపితే సంధి ఫలిస్తుంది అని ఇరాన్ తేల్చిచెప్పింది. కానీ ఇజ్రాయెల్ మాత్రం హెజ్బుల్లాను అంతం చేయడమే మా లక్ష్యం అనే ధోరణిలో ఉంది. ఇదే పెద్ద చిక్కు వచ్చింది. ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే మేము అమెరికాతో చేసే సంతకాలతో ప్రయోజనం ఉంటుంది. ఇక్కడ ఇజ్రాయెల్‌కు అమెరికా నచ్చ జెప్పాలి. కానీ నెతన్యాహూ ఒక పట్టనా వినే రకం కాదు. అందుకే హార్ముజ్‌ను మూసి వేస్తున్నామని ఇరాన్ చెబుతోంది. ఇది ఇలా ఉండగా అమెరికా, ఇరాన్ హెచ్చరించింది. లెబనాన్, హెజ్బుల్‌ను ఆపకపోతే ఇరాన్ పై దాడికి సిద్ధంగా ఉన్నామని ఈసారి మా దాడి చాలా తీవ్రంగా ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ శాంతి చర్చల సారాంశం గ్రహించాలని కోరారు. కాని ఇరాన్ విదేశాంగ మంత్రి మాత్రం ఇజ్రాయెల్, లెబనాన్‌తో దాడులు ఆపితేనే అమెరికాతో ఒప్పందం అమలులోకి వస్తుందని చెప్పడం గమనార్హం. హెజ్బుల్లాతో మా సంబంధం కొనసాగుతుందని లెబనాన్ చెప్పడంతో, దాడులు మొదలు అవుతాయాని అమెరికా అంటోంది. ఇలా నాయకులలో చిత్తశుద్ధి కరువవుతుంది. ఇక్కడ అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్, లెబనాన్, హెజ్బుల్లా నాయకులు మాటలు శాంతి చర్చలకు ఆటంకంగా వున్నాయి. అయితే ఇరాన్‌తో సాగిన మా చర్చలలో ఒక అంగీకారానికి వచ్చామని, ఇక శాంతి మంత్రం రావడమే తరువాయి అని అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ చెప్పడం ఆలోచన రెక్కేతిస్తోంది. ఇరాన్‌తో యుద్ధం నివారించడానికి మేము సిద్ధంగా వున్నామని, అందుకు రెండు దేశాలు కలసి పని చేయవల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ దిశలో ఇరాన్ న్యూక్లియర్ సమస్యను పరిష్కరిస్తుందని, మధ్య ప్రాచ్యం పూర్తిగా మారిపోతుందని, చర్చలలో లెబనాన్ కూడా చేర్చాలని అభిప్రాయపడ్డారు. వాన్స్ చెప్పినట్లుగా హార్ముజ్ జలసంధి తాత్కాలికంగా తెరవడం అని చెబితే ఇరాన్ ఎట్టి పరిస్థితులలో హార్ముజ్‌ను తెరవడానికి తాము సిద్ధంగా లేమని స్పష్టం చేసింది. ఇలా నాయకుల మాటలలో చిత్త శుద్ధే కనిపించడం లేదు. అసలు అమెరికా, ఇరాన్ మధ్య సంధిపై స్పష్టమైన అవగాహన లేదు. ఒక్కో నాయకుని తీరు స్పష్టంగా లేక అస్పష్టంగా ఉంది. ఇక్కడ ప్రధాన అజెండాఏమిటంటే లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులను అదుపు చేయాలి. ఈఅంశం పై స్విట్జర్లాండ్‌లోని బర్గన్ స్టాక్‌లో ఓఅధునాతనమైన హోటల్‌లో చర్చలు మొదలయ్యాయి. ఈసమావేశంలో అమెరికా, ఇరాన్‌తో పాటు పాక్, ఖతర్ దేశ నాయకులు పాల్గొంటున్నారు. అయితే ఇక్కడ ఇజ్రాయెల్, లెబనాన్‌పై దాడి చేసి చర్చలకు విఘతం కలిగించింది. ఇజ్రాయెల్ దాడి వలన, ఇప్పటివరకు మృతులసంఖ్య దాదాపు నాలుగు వేలకు పైచిలుకు ఉంటుందని లెబనాన్ చెబుతోంది.అసలుఅమెరికా, ఇజ్రాయెల్‌ను నమ్మశక్యంగా ప్రవర్తించడం లేదు.వారినాయకుల మాటలలో చిత్తశుద్ధి లేదు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందానికి ఇజ్రాయెల్ తూట్లు పొడిచింది, తీవ్ర దాడులకు పాల్పడుతున్నది. ఇది ఇలాగే జరిగితే తగిన మూల్యం అనుభవించక తప్పదనిఇరాన్ హెచ్చరిక చేసింది. ఇదే విధమైన హెచ్చరిక ఇరాన్‌లోని ఐఆర్‌జిసి, లెబనాన్‌లోని హెజ్బుల్లా చేసినట్లు భోగట్ట. నాయకుల మాటలలో చిత్తశుద్ధి ఉంటే ఈ యుద్ధం ఆగిపో వటానికి అవకాశం ఉంది. యుద్ధం ఆగిపోతుందని మనం కోరుకుందాం. ●

# సవాళ్ల మధ్య సాగుతున్న వ్యవ'సాయం'

నిలేష్

భారత్ వ్యవసాయ ప్రధాన దేశంగా పేరుగాంచినప్పటికీ నేడు వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరుగుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి.ప్రకృతి రైతుకు వరంగా ఉండాల్సింది శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు అకాల వర్షాలు,వరదలు,వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగామారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. వ్యవసాయంలో పెట్టుబడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్తనాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతినడంతో రైతు కుదేలవుతున్నాడు. మరోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరువుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. కొందరు దళారులు ఈ కొరతను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు ఎరువులు విక్రయించడం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది.ఇప్పుడు కొత్తగా వచ్చిన యాప్ మరింత చిక్కులు తెచ్చి పెడుతోంది. స్మార్ట్‌ఫోన్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని చెప్పడం, రైతులకు దానిపై సరైన అవగాహన లేకపోవడం, నెట్వర్క్ సమస్యలు వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. వీటన్నిటి కారణంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. పంట నష్టాలు, ఆదాయం లేకపోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను కష్టాల సుడిగుండంలోకి నెట్టివేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించాలంటే ప్రభుత్వాలు రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి. నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో



ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి.పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవసాయ రంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 'జై జవాన్ – జై కిసాన్' అనే నినాదంతో దేశాన్ని నడిపించే శక్తులలో రైతు ప్రథమ స్థానంలో ఉంటాడు. కోట్ల మందికి అన్నం పెట్టే అన్నదాత నేడు కన్నీళ్ల పర్యంతమవుతున్నాడు. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమైన వ్యవసాయ రంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టుమిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరవు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తుఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడంతో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది.పంట బీమా పథకాలు ఉన్నప్పటికీ అవి సకాలంలో అందకపోవడం రైతులకు పెను శాపంగా మారుతోంది. వ్యవసాయానికి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు ప్రాణాధారం. కానీ మార్కెట్లో స్వార్థపరుల లాభాల కోసం నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు రాజ్యమేలుతున్నాయి.రాత్రింబవళ్లు కష్టపడి, అప్పులు తెచ్చి విత్తనాలు విత్తుకుంటే అవి మొలకెత్తకపోవడంతో పంట దిగుబడి రాక రైతు ఘోరంగా నష్టపోతున్నాడు. దీనికితోడు సాగు సమయానికి ఎరువుల కొరత ఏర్పడటం, వాటిని బ్లాక్‌మార్కెట్లో ఎక్కువ ధరలకుకొనాల్సి రావడం రైతుపై అదనపు భారాన్ని మోపుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. కూలీలఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు,విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టుగా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్లలో దళారుల వ్యవస్థ, సిండికేట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు.ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు.బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్నకారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమా జంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఒక అన్నదాత ఆత్మహత్య కుటుంబాలనే కాకుండా దేశాన్నే కుదిపేసే పెను విషాదమని ఈ సమాజం గుర్తించలేకపో తుంది. రైతు లేకపోతే దేశానికి ఆహార భద్రతలేదు. అన్నదాత సుఖీభవ అనేది కేవలం నినాదంగా మిగిలిపోకూడదు. ప్రభుత్వం, సమాజం కలిసి కట్టుగా రైతుకు అండగా నిలవాలి. వ్యవసాయాన్ని కేవలం జీవనాధారంగానే కాకుండా ఒక లాభసాటి రంగంగా మార్చినప్పుడే దేశానికి నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. ●

# ప్రజావాక్కు

### బ్రిటన్‌లో పూటకొక్క ప్రధాని చందం

ఈపదేళ్లలో బ్రిటన్ ఆరుగురు ప్రధానమంత్రుల్ని చూసింది. ఇప్పుడు ఏడో ప్రధానిగా బర్న్ హామ్ రాబోతున్నారు. రెండేళ్ల క్రితం ఎన్నికల్లో లేబర్ పార్టీని ఘనంగా గెలిపించి, అప్పటికి 15ఏళ్లుగా అధికారంలో కొనసాగుతున్న కన్సర్వేటివ్‌పార్టీని సాగనంపి,సగౌరవంగా ప్రధాని పదవి చేపట్టిన కీర్ స్టార్మర్ తక్కువ సమయంలోనే రాజీనామా చెయ్యవలసి వచ్చింది.యూరోపియన్‌యూనియన్ నుండి వైదొలగి బ్రెక్సిట్ అమల్లోకి వచ్చిపదేళ్ల నిండకుండానే వరసగా ఆరుగురు ప్రధాన మంత్రులు తమ పదవీకాలం పూర్తిచేసుకోలేకపోయారు. సంవత్సరంలోపే దిగిపోయిన ఉదంతాలు కూడా ఉన్నాయి. రాజీనామాలకు ఒక్కొక్కరిదీఒక్కోకారణమైన నేపథ్యంలోఉన్న అసలైన కారణాలు.. ఒకదానికొకటి పెనవేసుకున్న రాజకీయ,ఆర్థిక, సామాజిక అస్థిరతలు. స్పష్టమైన విధానాలతో నాయకత్వ పటిమ చూపిస్తేనే పదవీకాలం పూర్తి చేయగలడు. లేదంటే ఈ క్యూ లైన్ ఇలాగే కొనసాగుతుంది.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### జర భద్రం

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో కొందరు మోసగాళ్లు అమాయక ప్రజలను వలలో వేసుకుంటున్నారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించి లక్షల రూపాయలు కాజేస్తున్నారు. ఆశ్చర్యకరంగా విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు సైతం ఈ మోసాలకు బలవుతున్నారు.సోషల్‌మీడియా ప్రకటనలు,నకిలీ యాప్‌లు,తప్పుడు వెబ్‌సైట్లద్వారా ప్రజలను ఆకర్షించడం జరుగుతోంది.అపరిచితుల సూచనలపై డబ్బులు పెట్టుబడిగా పెట్టకుండా, ఆర్థిక విషయాల్లో అప్రమత్తత అవగాహనతో ఉంటెప్రజలుమోసాల బారినపడకుండాఉండగలుగుతారు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి

కరీంనగర్లోని చింతకుంట పరిధిలో బిఆర్అంబేద్కర్ లైబ్రరీకొరకు గతంలో ప్రభుత్వ భవనం ఆవిష్కరణ చేసినారు కానీ నేటివరకు కూడా గ్రంథాలయంఏర్పడక విద్యార్థులు సెంట్రల్ లైబ్రరీకి టూటౌన్ వద్దకు పోయి చదువుకోవటం జరుగుతుంది.ఇప్పటికైనా దాన్నిప్రారంభించాలి. నిరుద్యోగులు గ్రూప్ 1,2,3,4, ఇతర ఉద్యోగ పోలీస్ వాటికి కొరకు ప్రిపేర్ అయ్యేవారికి అనుగుణంగా లైబ్రరీని అతి త్వరగా ఏర్పాటు చేయాలి.

- సింగు.లక్ష్మీనారాయణ,కరీంనగర్

### నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టవద్దు

ఇప్పటికే దేశంలో నిరుద్యోగం తాండవిస్తుంటే, మూలిగే నక్కపై తాటికాయపడినట్లు మన రాష్ట్రప్రభుత్వాలు తరచు ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచుతూ పోతున్నాయి. అందుకు కారణంనిరుద్యోగులు అసంఘటితంగా వుండటమే. కనుక నిరుద్యోగులంతా సంఘటితమై ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీచేయాలనీ, పెరిగిపోతున్న జనాభాకు తగిన నిష్పత్తిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాలపై ఒత్తిడితేవాలి. ప్రజల మద్దతుకూడా తప్పక లభిస్తుంది. అత్యధిక పేదల జనాభాగల మన దేశంలో అల్పజనాభా గల అమెరికా వలె ఎక్కువ జీతాలూ తక్కువ వుద్యోగుల వ్యవస్థ కుదరదు. దీనివలన అమెరికావలె ఆర్థిక అసమానతలు పెరుగుతూ సామాజిక న్యాయం దెబ్బ తింటుంది.నిధుల కొరత పేరుతో వుద్యోగుల పదవీ విరమణ వయస్సులు పెంచుతూ పోతుంటే పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లు మారింది నిరుద్యోగుల పరిస్థితి.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### కలుషితమవుతున్న నదులు

భారతీయసంస్కృతిలో నదులకు ప్రత్యేకస్థానం ఉంది. గోదావరి, కృష్ణానదులు దక్షిణ భారతదేశ జీవనాడులుగా, కోట్లాది ప్రజలకుతాగునీరు, సాగునీరు,జీవనోపాధిని అందిస్తున్నాయి. అయితే పారిశ్రామికవ్యర్థాలు,మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పూజా సామగ్రి, రసాయనాల కలుషితంతో ఈ నదులు తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయి. ఇది పర్యావరణంతో పాటు ప్రజారోగ్యానికి కూడాముప్పుగా మారుతోంది. ఉత్తర భారత దేశంలో గంగానదిని పరిశుభ్రపరిచేందుకు చేపట్టిన "నమామి గంగే" కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. అదే తరహాలో గోదావరి, కృష్ణా నదుల సంరక్షణకు సమగ్ర కార్యాచరణ అవసరం. నదుల్లోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి.ప్రతిపట్టణంలో ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి.పారిశ్రామిక సంస్థలు పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షణ చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సమయానికి రాని బస్సులు

నగర పరిసర ప్రాంతాల్లో ప్రజలు నిరంతరం రాకపోకలు కొనసాగిస్తారు. కానీ సమయానికి బస్సులు రాకపోవడంతో బస్టాండ్లలో వేచి ఉండాల్సి వస్తుంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కావున అధికారులు సమయానికి బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా


గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 9వ తరగతి పాఠ్యాంశంగా 'ఎమర్జెన్సీ'




## ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయాన్ని స్వాగతించిన బిజెపి

## సరైన నిర్ణయం తీసుకుంది: కేంద్ర మంత్రి ప్రధాన్

## ఎన్‌సిఇఆర్‌టిపై మండిపడిన కాంగ్రెస్, ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ, జూన్ 25:** స్వాతంత్ర్యానంతర భారత చరిత్రలో అత్యంత సంక్షోభ భరితమైన ఘట్టాలలో ఒకటైన 1975-77 నాటి అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) గురించి, తొలిసారిగా 9వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో ప్రస్తావించారు. భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొన్న, అధిగమించిన ప్రధాన సవాళ్లలో ఒకటిగా ఎన్‌సిఇఆర్‌టి దీనిని ఇందులో పొందుపరిచింది. 'అండర్‌స్టాండింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్' అనే కొత్త సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకం ద్వారా, మాధ్యమిక పాఠశాల పాఠ్యప్రణాళికలో అత్యవసర పరిస్థితికి సంబంధించిన అంశాన్ని తొలిసారిగా చేర్చింది. గతంలో 9వ తరగతి పాఠ్యపుస్తకంలో దీని ప్రస్తావన లేదని, అయితే సవరించిన పాఠ్య ప్రణాళికలో భాగంగా దీనికోసం ఒక ప్రత్యేక విభాగాన్ని జోడించామని ఎన్‌సిఇఆర్‌టి అధికారి పేర్కొన్నారు. 1975లో అత్యవసర పరిస్థితి విధించి ఇటీవల 50 యేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం. ఈ అధ్యాయం అత్యవసర పరిస్థితిని కేవలం ఒక వివిక్త చారిత్రక ఘటనగా కాకుండా, భారత రాజ్యాంగ వ్యవస్థకు ఎదురైన ఒక పరీక్షగా పరిగణిస్తూ, ప్రజాస్వామ్య బలాలు, బలహీనతల విస్తృత పరిశీలనలో భాగంగా దీనిని విశ్లేషిస్తుంది. 1970ల ప్రారంభంలో నెలకొన్న రాజకీయ అసంతృప్తి (ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగం, ఇందిరా గాంధీ నేతృత్వంలోని ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత వంటివి) నుండి తదనంతర పరిణామాల వరకు ఉన్న సంబంధాన్ని ఈ పుస్తకం స్పష్టంగా వివరిస్తుంది.

**ఎన్‌సిఇఆర్‌టిది సరైన నిర్ణయమే**

"ఎన్‌సిఇఆర్‌టి సరైన పని చేసింది. భవిష్యత్ తరాలు అత్యవసర పరిస్థితి నాటి చీకటి కోణాలను తెలుసుకోవాలి. అర్థం చేసుకోవాలి, తద్వారా అటువంటి పరిస్థితి మళ్లీ తలెత్తకుండా ఉంటుంది. అందుకే ఎన్‌సిఇఆర్‌టి దీనిని ప్రధానాంశంగా తీసుకు వచ్చింది. ఎన్‌సిఇఆర్ మంచిపనిచేసింద్ని అని కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయ పడ్డారు. "భారత రాజ్యాంగ చరిత్రలోని ఆ "చీకటి అధ్యాయం" మళ్లీ పునరావృతం కాకుండా చూసేందుకు దానిని గుర్తుంచుకోవాలని పేర్కొంటూ బిజెపి కూడా ఈ నిర్ణయానికి మద్దతు తెలిపింది. అయితే, ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాబోయే తరాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతికూలతను, విద్వేషాన్ని పెంచేందుకే కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో పాఠ్యపుస్తకాల్లో ఇలా మార్పులు చేశారని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మండిపడ్డారు. విద్యావ్యవస్థను సైతం రాజకీయాలకు వాడుకుంటు న్నారంటూ విమర్శలు గుప్పించారు.

**ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలపై నదుల పేర్లు**

ఎన్‌సిఇఆర్‌టి తమ నూతన పాఠ్యపుస్తకాల రూపకల్పనలో భారతదేశ సాంస్కృతిక, భౌగోళిక వారసత్వానికి పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా వివిధ భాషల పాఠ్యపుస్తకాలకు భారతదేశంలోని ప్రముఖ జీవనదుల పేర్లను పెట్టింది. హిందీ పాఠ్యపుస్తకానికి 'గంగ', ఇంగ్లీష్ పుస్తకానికి 'కావేరి', ఉర్దూ పాఠ్యపుస్తకానికి 'జమున' (యమున) అని నామకరణం చేశారు. కర్ణాటకలో ప్రవహించే ముఖ్య నదులలో ఒకటైన కృష్ణా నది గుర్తుగా కన్న పాఠ్యపుస్తకానికి 'కృష్ణ' అని పేరు పెట్టింది. అలాగే తెలుగు భాషకు 'గోదావరి' అనే పెట్టే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తుండగా, అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# 27న సీషెల్స్‌కు ప్రధాని

## మూడ్రోజులు పర్యటించనున్న మోడీ

## ఆ దేశ స్వర్ణోత్సవ వేడుకలకు హాజరు

**న్యూఢిల్లీ, జూన్ 25:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 27 నుంచి 29 వరకు సీషెల్స్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ప్రధాని మోడీ గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ సీషెల్స్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా, ద్వైపాక్షిక సహకారం పూర్తి స్థాయిని సమీక్షించడానికి, పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకోవడానికి ప్రధాని మోడీ, అధ్యక్షుడు హెర్మినితో చర్చలు జరుపుతారని విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రధాని మోడీ సీషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించడంతో పాటు, ప్రవాస భారతీయులతో కూడా సమావేశం కానున్నారు. "భారత్, సీషెల్స్ దేశాలు ఉమ్మడి చారిత్రక, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాల ఆధారంగా సుదీర్ఘకాల భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఒక కీలకమైన సముద్ర సరిహద్దు పొరుగు దేశంగా, భారతదేశపు 'మహాసాగర్ విజన్' (వివిధ ప్రాంతాలలో భద్రత, వృద్ధి కోసం పరస్పర, సంపూర్ణ పురోగతి)లో 'గ్లోబల్ సౌత్' పట్ల మా నిబద్ధతలో సీషెల్స్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది," అని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రధాని మోడీ సీషెల్స్ పర్యటన, రెండు దేశాల మధ్య ఉన్న బలమైన, శాశ్వతమైన స్నేహాన్ని పునరుద్ఘాటిస్తుందని, అలాగే అన్ని రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవడానికి ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను బలోపేతం చేస్తుందని వివరించింది.



## నా ప్రతిష్టను దిగజార్చేందుకు

# రాజకీయ కుట్రలు

## పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ ధ్వజం

**చండీఘడ్,జూన్ 25:** తన ప్రతిష్టను దిగజార్చేందుకు ఫేక్ వీడియోలను వినియోగిస్తున్నారని పంజాబ్ సింఎ భగవంత్ సింగ్ మాన్‌అన్నారు. రాజకీయ లబ్ధికోసం తనపై మతపరమైన ఆదేశాలను జారీ చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. మద్యం సేవిస్తూ సిక్కు మతగురువుల ఫోటోలపై సిఎం భగవంత్ మద్యం చల్లుతున్నట్లుగా ఉన్న ఓ వీడియో ఇటీవల వైరల్ అయ్యింది. ఆ వీడియో నేపథ్యంలో విపక్ష పార్టీలన్నీ పంజాబ్ సిఎంపై తీవ్ర విమర్శలు చేశాయి. తక్షణమే ఆయన రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో ఇవాళ మీడియాను ఉద్దేశించి సిఎం భగవంత్ మాన్ మాట్లాడారు. ప్రజల మెదళ్లలో తన పట్ల ద్వేషం కలిగేలా విపక్షలు ప్రయత్నిస్తున్నాయని, కానీ వాళ్లు ఆ ప్రయత్నంలో సఫలం కాలేరని ఆయన అన్నారు. మతపరంగా తనను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నట్లు చెప్పారు. గురుద్వారాల ముందు తనకు వ్యతిరేకంగా శిరోమణి గురుద్వారా ప్రబందక్ కమిటీలు బోర్డులు ఏర్పాటు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. మద్యం తాగుతున్న వైరల్ క్లిప్‌లో ఉన్నది తాను కాదని, కెనడాకు చెందిన ఓవ్యక్తి ఆ క్లిప్‌ను తయారు చేసినట్లు సిఎం ఆరోపించారు.

# ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం : ప్రధాని



**న్యూఢిల్లీ,జూన్ 25:** దేశంలో ఎమర్జెన్సీ విధించి 51 యేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఇది అత్యంత చీకటి అధ్యాయమని, కాంగ్రెస్‌చేసిన ఘోరమైన పాపమని అభివర్ణించారు. ఎమర్జెన్సీని విధించిన వారిని దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు అని ఆయన పిలుపునిచ్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోడీ ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎమర్జెన్సీ 51వ వార్షికోత్సవం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎంతటి చీకటి అధ్యాయమో తెలుసుకోండి అనేశీర్షికతో ఆనాటి పరిస్థితులను వివరించారు. ఎమర్జెన్సీకాలంలో పౌరుల హక్కులను, మీడియా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారు. ప్రతిపక్ష నాయకులందరినీ అరెస్టు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన వారిని, రాజకీయ అసమ్మతి తెలిపిన వారిని తీవ్రంగా అణచివేశారు. రచయితలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులతో పాటు సామాన్య పౌరులను కూడా జైళ్లలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు" అని మోడీ ఆరోపించారు. ఆనాడు రాజ్యాంగాన్ని కాలరాశారని, న్యాయ వ్యవస్థను రాజకీయ నియంత్రణలోకి తెచ్చేందుకు నీచమైన ప్రయత్నాలు జరిగాయని మోడీవిమర్శించారు. మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని వారిని బెదిరించారు లేదా పత్రికలను మూసివేశారు. ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేశారు. పౌరులను రక్షించాల్సిన ప్రతి వ్యవస్థ వారికే వ్యతిరేకంగా మారింది. పార్లమెంటును కేవలం ఒక రబ్బరు స్టాంపుగా మార్చేశారని ఆయన పేర్కొన్నారు. అంతటి నిర్బంధం మధ్య కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందరో పోరాడారని మోడీగుర్తుచేశారు. వివిధ నేపథ్యాలు, సిద్ధాంతాలకు చెందిన ప్రజలందరూ ఏకమై ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ముందుకువచ్చారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన ఆ ఉద్యమంలో పాలుపంచుకునే గౌరవం నాకు కూడా దక్కిందని ఆయన తెలిపారు. ప్రజల పోరాట స్ఫూర్తి ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పలేదని, చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించగా, దానిని విధించిన వారు ఘోరంగా ఓడిపోయారని వివరించారు.

# జూలై 1 నుంచి పాస్‌పోర్ట్ దరఖాస్తు ఫీజులు పెంపు

## ఇక రూ.2500 ఫీజు, తత్కాల్ రూ.5వేలు




**న్యూఢిల్లీ,జూన్ 25:** కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ దరఖాస్తు ఫీజులను పెంచింది. పెంచిన కొత్త ఫీజులు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నట్లు విదేశాంగ మంత్రిత్వశాఖ గురువారం నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్ 24 ప్రకారం, పాస్‌పోర్ట్ నిబంధనలు-1980లో సవరణలు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ సవరణలతో పాస్‌పోర్ట్ జారీ, పునరుద్ధరణ, పోయిన లేదా దెబ్బతిన్న పాస్‌పోర్ట్‌లకు సంబంధించి ఫీజులను పెంచారు. కొత్త ఫీజుల ప్రకారం, 18 యేళ్లు పైబడిన వారు అలాగే ఈ కేటగిరీలో దరఖాస్తు చేసే 15-18 యేళ్ల మైనర్లు 36 పేజీల పాస్‌పోర్ట్‌ను కొత్తగా పొందడానికి లేదా పునరుద్ధరించుకోవడానికి సాధారణ (నార్మల్) విభాగంలో రూ.2,500 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 36 పేజీల పాస్‌పోర్ట్ బుక్‌లెట్‌కు పెద్దలు రూ.1,500, 60 పేజీల బుక్‌లెట్‌కు రూ.2,000 చెల్లించేవారు. 18 యేళ్లలోపువారికి రూ.1,000 ఫీజుఉండేది. అలాగే 8 యేళ్ల లోపు పిల్లలకు కొత్త పాస్‌పోర్ట్ దరఖాస్తులపై 10 శాతం రాయితీ లభించేది. తత్కాల్ సేవలకు కేంద్రం భారీగా ఫీజులు పెంచింది. తత్కాల్ కేటగిరీలో 36 పేజీల పాస్‌పోర్ట్‌కు ఫీజును రూ.3,500 నుంచి రూ.5,000కు పెంచారు. 60 పేజీల పాస్‌పోర్ట్ కోసం సాధారణ దరఖాస్తుకు రూ.3,500, తత్కాల్ దరఖాస్తుకు రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది. పాస్‌పోర్ట్ పోయిన లేదా దెబ్బతిన్న సందర్భాల్లో కొత్తగా జారీ చేయించుకోవడానికి మరింత అధిక ఫీజులు వసూలు చేయనున్నారు. 36 పేజీల పాస్‌పోర్ట్ రీప్లేస్‌మెంట్‌కు సాధారణ కేటగిరీలో రూ.5,000, తత్కాల్‌లో రూ.7,500 చెల్లించాలి. 60 పేజీల పాస్‌పోర్ట్ రీప్లేస్‌మెంట్‌కు సాధారణ కేటగిరీలో రూ.6,000, తత్కాల్‌లో రూ.8,500 ఫీజు నిర్ణయించారు.మైనర్లకు కూడా కొత్త ఫీజులు18 యేళ్లలోపు మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్ట్‌ను కొత్తగా పొందడానికి లేదా పునరుద్ధరించుకోవడానికి సాధారణ కేటగిరీలో రూ.1,750, తత్కాల్‌కేటగిరీలో రూ.4,250 చెల్లించాల్సి ఉంటుంది. మైనర్లకు చెందిన 36 పేజీల పాస్‌పోర్ట్ పోయినా లేదా దెబ్బతిన్నా, రీప్లేస్‌మెంట్‌కోసం సాధారణకేటగిరీలో రూ.4,250, తత్కాల్ కేటగిరీలో రూ.6,750 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని కేంద్రవిదేశాంగశాఖ స్పష్టం చేసింది.

## 12 యేళ్లుగా పాకిస్థానీ

# గృహనిర్బంధంలో ఫ్రాన్స్ మహిళ

**క్వెట్టా,జూన్ 25:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో ఒక భయంకరమైన గృహ నిర్బంధం ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని బారా అనే మారుమూల పట్టణంలో తన భర్త చేతిలో 12 యేళ్లుగా బందీగా ఉంటూ, తీవ్రమైన గృహ హింసను ఎదుర్కొంటున్న 54 ఏళ్ల ఫ్రెంచ్ మహిళ సిల్వీ యాస్మినాను, ఆమె ఐదుగురు పిల్లలను పాకిస్థాన్ పోలీసులు రక్షించారు. ఈ నెల 18న అందిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. యాస్మినా కుమారుల్లో ఒకరు ఎలాగోలా ఇల్లు దాటి బయటకు వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో ఈ దారుణం బయటపడింది. వెంటనే స్పందించిన జిల్లా పోలీసు చీఫ్ వకార్ అహ్మద్ నేతృత్వంలోని బృందం బారాలోని ఒక మట్టి ఇటుకల ఇంటిపై దాడి చేసి ఆ కుటుంబాన్ని రక్షించింది. ఆ బాధితురాలు యాస్మినా తెలిపిన వివరాల ప్రకారం 2000వ దశకం ప్రారంభంలో ఆమెకు ఆస్ట్రేలియాలో ఒక పాకిస్థాన్ జాతీయుడితో పరిచయమైంది. ఆ తర్వాత వారు వివాహం చేసుకున్నారు. 2014 నుండి వారు పాకిస్థాన్‌లోని ఈ మారుమూల ప్రాంతంలో నివసిస్తున్నారు. 12 ఏళ్లుగా భర్త తనను, పిల్లలను బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా గృహ నిర్బంధం చేశాడని, రోజూ శారీరక, మానసిక హింసకు గురిచేస్తున్నాడని ఆమె పోలీసులకు వివరించింది. పాకిస్థాన్‌లోనే జన్మించిన ఆమె పిల్లలను కనీసం స్కూళ్లకు కూడా పంపించలేదని తేలింది. యాస్మినా ఇచ్చిన ఫిర్యాదు మేరకు గృహ హింస, అక్రమ నిర్బంధం కేసుల కింద ఆమె భర్త అహ్మద్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధిత మహిళ, పిల్లలను ప్రస్తుతం పెషావర్‌లోని మహిళా పోలీస్ స్టేషన్‌కు తరలించి రక్షణ కల్పించారు. సుదీర్ఘ కాలం పాటు బందీలుగా ఉన్న కారణంగా పిల్లలు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారని పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం యాస్మినా తన పిల్లలతో కలిసి తిరిగి ఫ్రాన్స్ వెళ్లిపోవాలని కోరుకుంటోంది.

# హార్ముజ్‌ను దాటి వచ్చిన 30 భారతీయ నౌకలు

## అనుమతుల కోసం వేచి ఉన్న మరో 26 నౌకలు




**న్యూఢిల్లీ,జూన్ 25:** ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతలు ఎట్టకేలకు తగ్గుముఖం పట్టడంతో నౌకల రాకపోకలు పెరిగాయి. భారత్‌కు వస్తున్న 30 నౌకలు ఇప్పటికే సురక్షితంగా ఈ జలసంధిని దాటాయని, మరో 26 నౌకలు ప్రయాణ అనుమతి కోసం వేచి ఉన్నాయని భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతం నుండి వచ్చే ముడిచమురు, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ), వ్యవసాయానికి అవసరమైన ఎరువుల సరఫరా కోసం భారతదేశం ప్రధానంగా ఈ మార్గంపైనే ఆధారపడుతుంది. తాజా పరిణామాలతో దేశంలో ఇంధన భద్రతకు ఉన్న ముప్పు తప్పినట్లయింది. ఇటీవలి ప్రాంతీయ ఘర్షణల కారణంగా ఇరాన్ ఈ జలసంధిపై పట్టు బిగించి, నౌకల రాకపోకలను అడ్డుకోవడంతో వందలాది నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోనే నిలిచిపోయాయి. అమెరికా-ఇరాన్ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం రాకపోకలను క్రమంగా పునరుద్ధరిస్తున్నారు. ఇంకా వేచి ఉన్న 26 భారతీయ నౌకల్లో 3 నౌకలు ఇంధన లోడుతో, 10 నౌకలు ఎరువులతో, మిగిలిన 13 నౌకలు ఇతర నిత్యావసర వస్తువులతో ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఏడీఎన్‌వోసీ)కి చెందిన రెండు భారీ ఎల్ఎన్‌జీ ట్యాంకర్లు సురక్షితంగా ప్రయాణించి తమిళనాడులోని ఎన్నూర్, కేరళలోని కొచ్చి టెర్మినల్స్‌కు గ్యాస్ చేరవేశాయి. హార్ముజ్ జలసంధి ద్వారా రవాణా సాఫీగా సాగితే దేశంలో ఇంధన ధరలు స్థిరపడతాయని, ఎరువుల కొరత తీరి వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. అయితే, యుద్ధం ముగిసినప్పటికీ బీమా ఖర్చులు పెరగడం, సముద్రంలో మైన్ల తొలగింపు వంటి సవాళ్లు ఉన్నందున రవాణా పూర్వస్థితికి రావడానికి మరికొన్ని వారాల సమయం పట్టే అవకాశం ఉంది.

# మీ నాన్న ఎక్కడ?.. ఆయన వస్తారు!

## సిఎం విజయ్ వ్యాఖ్యలపై డిఎంకె శ్రేణుల ఆగ్రహం

## విజయ్ అలా మాట్లాడకూడదన్న విపక్షాలు

**చెన్నై,జూన్ 25:** తమిళనాడు సిఎం జోసెఫ్ విజయ్ అసెంబ్లీలో చేసిన మీ తండ్రి ఎక్కడ అనే పదునైన వ్యాఖ్య రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఒక్క వ్యాఖ్యతో డిఎంకే శ్రేణుల్లో కొత్త ఆవేశం పెల్లుబుకింది. మాజీ సిఎం, డిఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను తిరిగి శాసనసభకు తీసుకు రావాలనే డిమాండ్లు బహిరంగంగా వినిపిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకేను నడిపించిన ఎంకే స్టాలిన్, తన సొంత నియోజకవర్గం కొలత్తూరులో టివికె అభ్యర్థి చేతిలో అనూహ్యంగా ఓటమిపాలయ్యారు. అప్పటినుంచి ఆయన అసెంబ్లీకి దూరంగా ఉంటుండగా, ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో సిఎం విజయ్ మాట్లాడుతూ ఒక కథ చెబుతూ మీనాన్న ఎక్కడ?అని ప్రశ్నించారు. ఇది ఉదయనిధిని, సభలో లేని ఆయన తండ్రి స్టాలిన్‌ను ఉద్దేశించి చేసిన పరోక్ష విమర్శగా అందరూ భావించారు. అయితే, డిఎంకె సీనియర్ నేత కేఎన్ నెహ్రూ మరింత ఘాటుగా స్పందించారు. మా నాయకుడిని, మీ నాన్న ఎక్కడ అని అడిగారు కదా? ఆయన వస్తారు. తిరిగి బాధ్యతలు స్వీకరిస్తారు. కానీ ఈ వ్యాఖ్య తర్వాత తమిళనాడు వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు ఆయన రావాలని కోరుకుంటున్నారని అన్నారు. మరోవైపు సిఎం విజయ్ వ్యాఖ్యలపై ఆయన కూటమిలోని భాగస్వామ్య పక్షాల నుంచి కూడా విమర్శలు వచ్చాయి. వీసీకే అధినేత థోల్ తిరుమావళవన్ మాట్లాడుతూ, సిఎం హోదాకు ఇటువంటి వ్యాఖ్యలు తగవని, సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సిఎంపై ఉందని హితవు పలికారు. ఈ రాజకీయ మాటల యుద్ధం కాస్తా వ్యక్తిగత దూషణల స్థాయికి చేరింది.

# జమ్మూ కాశ్మీర్‌లో పోలీసు స్టేషన్‌పై దాడి..

## కల్నల్, మేజర్ సహా 40 మంది సైనికులపై కేసు



**శ్రీనగర్, జూన్ 25:** కమాండింగ్ ఆఫీసర్, మేజర్ సహా 40 మంది సైనిక సిబ్బందిపై జమ్మూ కాశ్మీర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కిష్టావర్ జిల్లాలోని ఓ పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయడమే కాకుండా, అక్కడ ఉన్న ప్రభుత్వ అధికారులు, పోలీసులను కొట్టారనేది ప్రధాన ఆరోపణ. అథోలి పోలీస్‌స్టేషన్‌పై 17 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్ అరుణ్‌గాంధీ, మేజర్ వికాస్ శర్మ, నయిబ్ సుబేదార్ శంకర్ గుర్ఖేతోపాటు 30 నుంచి 40 మంది జవాన్లు దాడికి పాల్పడినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. హత్యాయత్నం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం తదితర సెక్షన్లు నమోదయ్యాయి. దీనిపై స్పందించిన ఆర్మీ.. విచారణకు సహకరిస్తామని తెలిపింది. 'ఈ వివాదం కిష్టావర్ అథోలిలో స్థానిక పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌కు సంబంధించింది.. ఈ అంశం సంబంధిత సంస్థాగతయంత్రాంగాల ద్వారా పరిశీలనలోఉంది.

న్యాయప్రక్రియలోభారత సైన్యం పూర్తి సహకారం అందిస్తుంది. సంయుక్త దర్యాప్తు ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటాం. దర్యాప్తు కొనసాగుతున్నందున, ఈ దశలో దీనిపై మరింత వ్యాఖ్యానించడం తొందరపాటు అవుతుంది' అని ఒక రక్షణ శాఖ ప్రతినిధి తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## పదిలక్షల ఓట్లా!: ఇటలీ ప్రధాని మెలోనీ



**రోమ్, జూన్ 25:** ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి భారత్‌పై ప్రత్యేక అభిమానం. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలే అందుకు నిదర్శనం. ఇటీవల ఆ దేశ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీ ఆమెకు 'మెలోడీ' చాకెట్లు కానుకగా ఇచ్చిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. తాజాగా తన పుస్తకంలో భారత్ పర్యటన గురించి ప్రస్తావించి మన దేశంపై తన అభిమానాన్ని చాటుకున్నారు. మెలోనీ తన కొత్త పుస్తకంలో 'జార్జియా విజన్'లో భారత్ పర్యటన గురించి రాసుకొచ్చారు. పర్యటన సందర్భంగా ఆమెకు స్వాగతం పలుకుతూ రోడ్డుకు ఇరువైపులా భారీగా పోస్టర్లు ఏర్పాట్లు చేశారు. ఢిల్లీలో ప్రయాణిస్తుండగా పక్కనే ఉన్న ఉప ప్రధాని ఆంటోనియో తజని ఓ సరదా వ్యాఖ్య చేశారట. ఈ పోస్టర్లు చూస్తుంటే.. ఢిల్లీ నియోజకవర్గం నుంచి మీరు పోటీ చేస్తే కనీసం 10 లక్షల ఓట్లు వచ్చేలా ఉన్నాయని ఆయన చమత్కరించారట. ఈ విషయాన్ని మెలోని పుస్తకంలో ప్రస్తావించారు.

## ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం: కేంద్రం

**న్యూఢిల్లీ, జూన్ 25:** దేశవ్యాప్తంగా 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఇ20) విక్రయాల నేపథ్యంలో, వినియోగదారుల్లో నెలకొన్న ఆందోళనలను కేంద్రం తొలగించే ప్రయత్నం చేసింది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వినియోగం వాహన బీమా క్లెయిమ్‌పై ప్రభావం చూపుతుందన్న ప్రచారంలో నిజం లేదని, ఇది ఆర్థికంగా ప్రయోజనకరమని స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా ఆమోదం పొందిన ఈవిధానం యూఎస్, జపాన్ వంటి దేశాల్లో విజయవంతంగా అమలవుతోందని, దీనివల్ల ఇంధన భద్రతతో పాటు కర్బన ఉద్గారాల విడుదలను తగ్గి పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపింది.

## బలోచ్ హక్కుల కార్యకర్తకు జీవిత ఖైదు



**ఇస్లామాబాద్, జూన్ 25:** పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ బలోచ్ హక్కుల కార్యకర్త మహ్రాంగ్ బలోచ్‌కు స్థానిక కోర్టు జీవిత ఖైదు విధించింది. బలోచిస్తాన్ ప్రాంతంలో మానవ హక్కుల ఉల్లంఘనలు, బలవంతపు అదృశ్యాల అంశాలపై మహ్రాంగ్ బలోచ్ ఉద్యమం కొనసాగిస్తున్నారు. ఈ తీర్పుపై మానవ హక్కుల సంస్థలు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే చట్టపరమైన ప్రక్రియలో భాగంగానే చర్యలు తీసుకున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం తెలిపింది. ఈ పరిణామం బలోచిస్తాన్ సమస్యపై అంతర్జాతీయ దృష్టిని మరింత ఆకర్షించే అవకాశముందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## లెగో ట్రోఫీకి వజ్రాలు.. ధర రూ.70 లక్షలు

**షార్జా, జూన్ 25:** దుబాయ్‌కు చెందిన ప్రముఖ ఆభరణాల వ్యాపారి హేమంత్ కరమ్‌చందానీ తన కుమారుడు లెగో బ్లాక్‌లతో రూపొందించిన ఫిఫా వరల్డ్ కప్ ట్రోఫీని అరుదైన కళాఖండంగా మార్చారు. ఆ ట్రోఫీపై వజ్రాలు, విలువైన రత్నాలను పొదిగి అలంకరించడంతో దాని విలువ దాదాపు రూ.70 లక్షలకు చేరింది. సాధారణ లెగో మోడల్‌ను అత్యంత విలాసవంతమైన జ్యువెలరీ కళాఖండంగా తీర్చిదిద్దిన ఈ వినూత్న ప్రయత్నం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ తండ్రీకొడుకుల సృజనాత్మక నైపుణ్యానికి నెటిజన్లు ఫిదా అవుతూ ప్రశంసిస్తున్నారు.

## ఆ శిలల వయసు 302 కోట్ల సంవత్సరాలు



**సిడ్నీ, జూన్ 25:** వెస్టర్న్ ఆస్ట్రేలియాలోని 'నార్త్ పోల్‌డోమ్' ప్రాంతంలో భూగర్భ శాస్త్రవేత్తలు అత్యంత పురాతనమైన శిలలను గుర్తించారు. కర్టిన్ యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం వీటి వయసు దాదాపు 302.4 కోట్ల సంవత్సరాలుగా నిర్ధారించారు. భూమిపై మొట్టమొదటి ఖండాలు, ప్రాథమిక జీవం ఏర్పడుతున్న అత్యంత పురాతన కాలమైన ఆర్కియన్ యుగానికి చెందిన ఏకైక ఉల్కాపాత గుంత ఇదేనని తమ పరిశోధనలో తేలిందని చెప్పారు. రాళ్లపైన ఉన్న జర్కాన్, అపటైట్ అనే సూక్ష్మ ఖనిజాలను సేకరించి వయసును నిర్ధారించామని వెల్లడించారు.



ఈసారి పంచముఖ రూపంలో ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహ నమూనా–2026

## ఘనంగా ఖైరతాబాద్ గణపతి కర్రపూజ

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ గణేశ ఉత్సవ సమితి, శ్రీగణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కర్రపూజ వేడుక కనులపండువగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పసుపు, కుంకుమలతో, మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ వేదపండితులు ఈ కర్ర పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ మహ ఘట్టంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, స్థానిక మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి, ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్రపూజ అనంతరం ఈ యేడాది భక్తు లకు దర్శనమివ్వబోయే ఖైరతాబాద్ మహాగణపతి నమూనా పోస్టర్‌ను ప్రముఖ శిల్పి రాజేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ విడుదల చేశారు. ఈసారి ఖైరతాబాద్ బడా గణేశుడు 'శ్రీ పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సెప్టెంబరు 14న వినాయక చవితి పర్వదినం కాగా.. ఈ కర్రపూజ నాటి నుంచి సరిగ్గా 80 రోజుల వ్యవధి ఉంది. ఈసారి కూడా శిల్పి రాజేందర్ బృందం మహాగణపతి రూపాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వివేక్‌వెంకటస్వామి. చిత్రంలో జి.చెన్నయ్య, వెంకటేశ్వర్లు తదితరులు

## మాలల హక్కుల కోసం పోరాడేందుకు ముందుంటా: మంత్రి వివేక్‌వెంకటస్వామి

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 25, ప్రభాతవార్త:** మాలల హక్కుల కోసం తాను పోరాడేందుకు ముందుంటానని, తనకు పదవులు ముఖ్యం కాదని రాష్ట్ర కార్మిక మంత్రి జి.వివేక్ వెంకటస్వామి చెప్పారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణతో మలాలు తీవ్రంగా నష్టపోయారని, రోస్టర్ పాయింట్లలో మాలలకు, మాల ఉపకులాలు విద్య, ఉద్యోగ తదితర రంగాలలో తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సైఫాబాద్‌లోని సామ్రాట్ కాంప్లెక్స్‌లో జరిగిన మాల మహానాడు రాష్ట్ర ముఖ్య నాయకులు సమావేశంలో మంత్రి ప్రసంగించారు. రోస్టర్ పాయింట్లును సరిదిద్దేందుకు స్పెషల్ కమిటీని వేయాలని రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తాను ప్రతిపాదించానని ఆయన గుర్తు చేశారు. రోస్టర్ పాయింట్ల విషయంపై తాను కోర్టులో లీగల్‌గా కొట్లాడుతున్నాయని, ఇందుకోసం మాల ఎమ్మెల్యేలు, అధికా రులు ముందుకు రావాలని వివేక్ వెంకటస్వామి పిలుపు నిచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాలలకు జరిగిన అన్యాయాలపై పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## త్యాగానికి ప్రతీక మొహర్రం: కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** ధర్మం, సత్యం, త్యాగానికి ప్రతీకగా మొహర్రం నిలుస్తుందని బిఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. త్యాగాలను స్మరించుకుంటూ ముస్లిం సహోదరులు మొహర్రం ను జరుపుకుంటారని అన్నారు. పీర్ల పండుగ పేరుతో తెలంగాణ ప్రజలు సహోదర భావంతో, కుల మతాలకు అతీతంగా పాల్గొంటారని కేసీఆర్ అన్నారు. ఉత్సాహం విషాదం కలెగలిపి దూలలాడుతూ, నిప్పుల గుండం మీద నడుస్తూ., మత సామరస్యాన్ని చాటుతూ పల్లె నుండి పట్నం దాకా సాగే పీరీల వేడుక, గంగా జమున సంస్కృతికి అద్దం పడుతుందని కేసీఆర్ అన్నారు.

రాష్ట్రంలో లౌకిక వాదానికి గత పదేండ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేసిందని కేసీఆర్ వివరించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని కేసీఆర్ ప్రార్థించారు. మైనారిటీల సంక్షేమం కోసం బి ఆర్ ఎస్ పార్టీ కట్టుబడి ఉన్నదని ఈ సందర్భంగా కేసీఆర్ పునరుద్ఘాటించారు.



చేవెళ్లలో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

## రేవంత్‌రెడ్డి హయాంలో భ్రష్టుపట్టిన రాష్ట్రం

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ధ్వజం

**చేవెళ్ల, జూన్ 25, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇచ్చిన హామిలను అమలు చేయడంలో సిఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారనిని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ధ్వజమెత్తారు. గురువారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో చేవెళ్ల నియోజకవర్గ ఎస్‌ఐఆర్ శిక్షణ కార్యక్రమం, బిఆర్‌ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశంను మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఏమ్మేల్యే పట్నం నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, చేవెళ్ల సభ్యత్వ ఇంచార్జి రాంబాబు, దేశమోళ్ల అంజనేయులుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ రంగంను కుప్పకుల్చిందని, లక్షలాది మందికి ఉపాధిని పోగోట్టిండన్నారు. కెసిఆర్ మళ్లీ సిఎం కాగానే రియల్ ఎస్టేట్ రంగంను ముందుకు తీసుకు వెల్తామన్నారు. రేవంత్‌రెడి పాలన హిట్లర్‌ను తలపిస్తుందన్నారు. హిట్లర్ లాగా వ్యవహరిస్తున్న రెవంత్‌రెడ్డిపాలనకు చరరగీతం పాడాల్సిన సమయం అసన్నమైందన్నారు. రైతు బందు అపేసిన రెవంత్‌రెడ్డి ఎన్నికల ముందు మాత్రమే రైతు బందు వెస్తున్నాడన్నారు. రైతు బందు నిధులన్ని రాహుల్‌గాంధీ ఖాతాలోకి సిఎం రెవంత్‌రెడ్డి మళ్లీస్తున్నాడన్నారు. రైతులకు యూనియా సంచులివ్వడం చేతకాదు కాని డబ్బుల సంచులను మాత్రం ఢిల్లీకి తీసుకుపోతున్నాడన్నారు.

# ఫెర్టిలైజర్స్ యాప్‌కు విశేష ఆదరణ

### దేశం మొత్తం దీనిపైనే దృష్టి

### 38.62 లక్షల యూరియా బ్యాగ్‌ల బుక్

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫెర్టిలైజర్స్ యాప్‌కు విశేష ఆదరణ లభిస్తోందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణల్లో యూరియా బుకింగ్ యాప్ అత్యంత కీలకమైనదిగా పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో ఈ విధానం ఈ వానాకాలం సీజన్‌లోనూ అత్యంత విజయవంతంగా అమలవుతోందన్నారు. రైతులు స్వచ్ఛందంగా ఈ వ్యవస్థను స్వీకరించ చారని గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. గత యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 21.81 లక్షల మంది రైతులు 97.95 లక్షల యూరియా బస్తాలు ఈ యాప్ ద్వారా కొనుగోలు చేశారన్నారు. ఈ వానాకాలంలో ఇప్పటివరకు 11.71 లక్షల మంది రైతులు యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్నారని వివరించారు. యాసంగి, ఈ వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు మొత్తం 38.62 లక్షల యూరియా సంచులు బుక్ కాగా, ఇప్పటికే 34 లక్షల సంచులు రైతులకు పంపిణీ అయ్యాయన్నారు. అంటే 88 శాతం బుక్ చేసిన యూరియా రైతుల చేతికి చేరింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 85.84 లక్షల యూరియా బస్తాలు నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఖరీఫ్ అవసరాలు దృష్టిలో ఉంచుకొని, రాష్ట్రానికి కేటాయించిన యూరియా 60 శాతం ఏప్రిల్, మే జూన్ నెలల్లోనే పంపిణీ చేయించాల్సిందిగా కేంద్రం పై ఒత్తిడి తెచ్చి ఇప్పటికే 5.74 టన్నుల రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. గత ఏడాది ఇదే తేదీ నాటికి 30 లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగయ్యాయని చెప్పారు. ఈ ఏడాది ఆశించిన మేరకు వర్షాలు లేకపోవడంతో ఈ ఖరీఫ్ లో 14.78 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు అయినట్లు పేర్కొన్నారు. గత ఏడాది జూన్ చివరి తేదీ నాటికి 1.80 లక్షల టన్నుల యూరియాను కొనుగోలు చేయగా, పంటల సాగుతో సంబంధంలేకుండానే ఈ నెల 24 నాటికి 1.91 లక్షల టన్నుల పంపిణీ జరిగిందని వివరించారు. సాధారణంగా యూరియా వినియోగం ఈ నెల మూడవ వారం నుండి ప్రారంభం కావాల్సి ఉండగా రైతులు ఇప్పటికే 34 లక్షల బస్తాలు కొనుగోలు చేసి ముందస్తు నిల్వ చేసుకున్నారన్నారు. గతంలో సబ్సిడీ యూరియా పెద్దఎత్తున దుర్వినియోగానికి గురయ్యేదని, ఈ పరిస్థితిని మార్చేందుకే ప్రభుత్వం యూరియా బుకింగ్‌ను వాస్తవ భూ యజమానులు, సాగుదారులతో అనుసంధానం చేసిందని వెల్లడించారు. ఇక తెలంగాణ అమలు చేస్తున్న నమూనాను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేస్తున్నాయన్నారు.

## రేపు భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం

### ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు

### యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి:

### అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. భద్రాచలం ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికా రులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.351 కోట్లను మంజూరు చేశారని తెలిపారు. వచ్చే శ్రీరామనవమి నాటికి నిర్దేశించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.

## బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ1,500 మెగావాట్లకు అనుమతి

### మహేశ్వరం, చౌటుప్పల్‌లో ఏర్పాటు

### విద్యుత్ నియంత్రణ కమిషన్ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 1,500 మెగావాట్ల భారీ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్రాజెక్టుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు దీనికి సంబంధించి విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవరాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ డిమాండ్ ఉన్న సమయాల్లో అదనపు సౌర విద్యుత్‌ను నిల్వ చేసి, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని స్థిరీకరించేందుకు గరిష్ఠ వినియోగ సమయాల్లో గ్రిడ్‌కు సరఫరా చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రెండుచోట్ల 1,500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బెస్)ను ఏర్పాటు చేయనున్నారు. మహేశ్వరం, చౌటుప్పల్‌లో 750 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు ఏర్పాటు కోసం తెలంగాణ జెన్‌కో టెండర్లు పిలవగా, సారస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కోల్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. టెండర్లలో ఈ రెండు సంస్థలు అతి తక్కువగా కోట్ చేయడంతో, వాటికి జెన్‌కో అనుమతినిచ్చింది. కాగా ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా డిమాండ్ లేని సమయంలో రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు కరెంట్‌ను నిల్వ చేసుకుని, డిమాండ్ అత్యధికంగా ఉన్న సమయంలో వినియోగించుకుంటాయి. ఆ సమయంలో టెండర్లు దక్కించుకున్న సంస్థలు 750 మెగావాట్ల విద్యుత్‌ను 4 దఫాలుగా అందించాల్సి ఉంటుంది. దీనికి సారస్ ఇన్‌ఫ్రా సంస్థకు రూ.2.98 లక్షలు, కోల్ ఇండియాకు రూ.3.14 లక్షలను మెగావాట్ చొప్పున డిస్కమ్‌లు చెల్లించాల్సి ఉంటుంది. మధ్యవర్తిగా తెలంగాణ జెన్ కో ఉండనుంది. దీనికి ట్రేడింగ్ మార్జిన్ కింద 0.5 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌కు అనుమతినివ్వాలని తెలంగాణ జెన్‌కో, డిస్కమ్‌లు పెట్టుకున్న విజ్ఞప్తిని తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ సమ్మతించింది. తక్షణమే ఒప్పందం చేసుకోవాలని డిస్కమ్‌లు, తెలంగాణ జెన్‌కోను ఆదేశించింది.

## బిజెపి సభ్యత్వం ఉంటేనే పౌరసత్వమా?: ఒవైసి విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** పౌరసత్వం అంశంపై కేంద్ర ప్రభుత్వ విధానాలను ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా తప్పుబట్టారు. పాస్‌పోర్టు ఉన్నా అది పౌరసత్వానికి పూర్తి ఆధారం కాదన్న వాదనలపై మండిపడ్డారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల్లో మరింత గందరగోళానికి దారితీస్తాయని అన్నారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందించిన ఓవైసీ, కేంద్ర ప్రభుత్వ తీరుపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ పరిస్థితి చూస్తుంటే భవిష్యత్తులో బీజేపీ సభ్యత్వ కార్డు ఉన్నవారికే పౌరసత్వం ఇస్తారేమోనని ఎద్దేవా చేశారు. దీనికి సంబంధించిన బీజేపీ సభ్యత్వ కార్డుల చిత్రాలను కూడా తన పోస్టులో పంచుకున్నారు. భారత పౌరుడిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే ప్రధాన పత్రాల్లో పాస్‌పోర్టు ఒకటని, అలాంటి పత్రాన్నే పౌరసత్వానికి ఆధారం కాదని చెప్పడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు తరచూ నిబంధనలు మార్చడం వల్ల సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అన్నారు. తమ సొంత దేశంలోనే పౌరసత్వాన్ని నిరూపిం చుకోవాల్సిన పరిస్థితులు రావడం బాధాకరమని ఓవైసీ పేర్కొన్నారు. గుర్తింపు కార్డులు, పౌరసత్వ అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని సూచించారు. ప్రజల ఆందోళనలను కేంద్రం గమనించాలని ఆయన కోరారు.

### డీప్‌ఫేక్‌లు, పంప్ అండ్ డంప్, డబ్బా ట్రేడింగ్

## మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

### తెలంగాణ పోలీస్ అకాడమీలో సెబీ - ఎన్‌ఎస్‌ఇ ఆధ్వర్యంలో రీజినల్ ఇన్వెస్టర్ సెమినార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** తెలంగాణ పోలీస్ అకాడమీలో ట్రైనీ అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ సిబ్బందికి , స్టాక్ మార్కెట్‌పై అవగాహన, పెట్టుబడి మోసాల నివారణపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా 'రీజినల్ ఇన్వెస్టర్ సెమినార్'ను నిర్వహించారు. గురువారం సాయంత్రం తెలంగాణ పోలీస్ అకాడమీలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీలు, ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆదేశాల మేరకు ట్రైనీ అధికారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ సెమినార్‌కు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) కె.ఆర్.కె. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరైన్నారు. ఈ సందర్భంగా సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్ మోహన్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి జీవితంలో ఆర్థిక ప్రణాళికకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడులు పెట్టడం, రిస్క్‌లను అంచనా వేసుకోవడం, చట్టబద్ధమైన మార్గాల్లోనే పెట్టుబడులు పెట్టడం ఎంతో అవసరమని సూచించారు. ప్రస్తుతం గూగుల్, మెటా వంటి డిజిటల్ వేదికలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి అనేక నకిలీ పెట్టుబడి పథకాలు, మోసపూరిత ప్రకటనలు ప్రచారంలోకి వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలను అరికట్టడంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని ఆయన పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఈ రీజినల్ మేనేజర్ శ్రీ రవి ఉప్పే మాట్లాడుతూ, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ముందు డీమ్యాట్ ఖాతా, ట్రేడింగ్ ఖాతా అవసరం, వాటి నిర్వహణ, పెట్టుబడి ప్రక్రియపై సవివరంగా వివరించారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, పంప్ అండ్ డంప్ స్కామ్‌లు, డబ్బా ట్రేడింగ్, నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, అనధికారిక పెట్టుబడి సలహాల వల్ల పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న మోసాల గురించి ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ తరహా మోసాల నుంచి ప్రజలను రక్షించేందుకు విలీని చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, నివారణ చర్యలను వివరించారు. సెమినార్ సందర్భంగా పెట్టుబడిదారుల కోసం రూపొందించిన అతి సాయి సాథి యాప్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారం, పెట్టుబడి సంబంధిత సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలపై ట్రైనీలకు సమగ్ర అవగాహన కల్పించారు. సెమినార్ ముగింపు సందర్భంగా లైజన్ ఆఫీసర్ డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనీ డీఎస్పీలు, అకాడమీ సిబ్బంది, సెబీ, ఎన్‌ఎస్‌ఈ ప్రతినిధులు, కార్యక్రమం విజయవంతానికి సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఈ బెంగళూరు రీజినల్ మేనేజర్ రవి ఉప్పే, కోఆర్డినేటర్, కంపెనీ సెక్రటరీ శ్రీమతి అభిలాష్ దరాక్, అకాడమీ ఔట్‌డోర్ ఏడీ శ్రీ రాంబాబు, డీఎస్పీలు సతీష్ కుమార్, తిరుపతి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శ్రీను, ప్రవీణ్, శ్రీ నహేర్, ట్రైనీ డీఎస్పీలు, ఫ్యాకల్టీ సభ్యులు, కార్యాలయ సూపరింటెండెంట్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నాడు బంగ్లాదేశ్ ఇందిర సృష్టి.. నేడు తెలంగాణ ఏర్పాటు చేసిన సోనియా




### ఆదివాసీ బస్సుయాత్ర ప్రారంభించిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** ఇందిరాగాంధీ బంగ్లాదేశ్‌ను ఆనాడు సృష్టిస్తే నేడు ఆమె కోడలు సోనియాగాంధీ తెలంగాణను ఏర్పాటు చేశారని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బంజారాలకు ఇందిరాగాంధీ రిజర్వేషన్ కల్పించి 50 యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న బస్సు యాత్రను గురువారం గాంధీభవన్‌లో జెండా ఊపి పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ లాంఛనంగా పారంభిం చారు. ఎస్‌టి సెల్ జాతీయ అధ్యక్షుడు వికాస్ బూనియా, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావు, ఎంపిలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , పెద్ద ఎత్తున ఆదివాసీలు హాజరైనారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఇందిరాగాంధీ శక్తి కాబట్టే ఎస్‌టి రిజర్వేషన్లు అమలు చేశారనీ అన్నారు. ఇందిరాగాంధీ రిజర్వేషన్లు ఇవ్వకుంటే బంజారాలు ఎక్కడ ఉండేవాళ్లో ఆలోచించండి అని ప్రశ్నించారు. ఎస్టీ రిజర్వేషన్లు లేకపోతే ఎంతో మంది ప్రజా ప్రతినిధులు,వివిధ విభాగాల్లో హోదాల్లో ఉండేవారా? అని సందేహం వ్యక్తంచేశారు. రాహుల్ గాంధీ ఆకాంక్షను నెరవేర్చి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కుల సర్వే నిర్వహించామనీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం అందరికి లభించాలని ఎస్‌సి ఎస్‌టి,బిసి మైనారిటీలను కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకుందనీ అన్నారు. కెటిఆర్,హరీష్ రఘు గంగిరెద్దులు ఊరేగుతున్నారనీ బిఆర్‌ఎస్ శకం ముగిసిందనీ జోస్యం చెప్పారు. పేదల గుండెల్లో ఇందిర గాంధీ చిరస్మరణీయమనీ కోన్ కిస్కా హరీష్ కెటిఆర్‌తో మనకేం పని అని ఆయన అన్నారు.

## డిజిటల్ అరెస్టు బూచాళ్లు ఇద్దరికి కటకటాలు

### సిబిఐ 16 రాష్ట్రాల్లో మెరుపుదాడులు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** బుల్లిపెట్టలో వున్న డిజిటల్ అరెస్టు బూచాళ్ళ బి.నరేష్, సంజీవ్‌సాహులు ఇద్దరిని సిబిఐ అరెస్టుచేయడంతో పాటు దేశవ్యాప్తంగా 16రాష్ట్రాలలో 80 ప్రాంతాల్లో గురువారం ఏకకాలంలో దాడులు చేసి కీలక ఆధారాలను స్వాధీనం చేసుకొంది. సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌ను పోలీన ఒక నకిలీ వెబ్‌సైట్‌ను సిబిఐ గుర్తించి ఈ సోదాలు నిర్వహించడంతో బల్లిపెట్టబూచాళ్ళు బయటపడ్డారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్టులపేరుతో బెదిరించే నేరస్తుల నెట్వర్క్ ఛేదించడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేసిన ఆపరేషన్‌పై ప్రజల నుంచి హర్షం వ్యక్తమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, గుజరాత్, ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మణిపూర్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. రూ.2 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమికంగా సిబిఐ అంచనాకొచ్చింది. ఇద్దరి అరెస్ట్ చేయడంతోపాటు 200కు పైగా డిజిటల్ అరెస్ట్ కేసులతో సంబంధం ఉన్న ఒక పెద్ద నేరపూరిత నెట్‌వర్క్ నిర్మూలించడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు సిబిఐ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ షెల్ కంపెనీలు, సృష్టించి, సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ, మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా దాదాపు రూ. 2 కోట్ల అక్రమ సొమ్మును దారి మళ్లించినట్లు సిబిఐ గుర్తించింది.

## ముఖ్యమంత్రి ఎప్పుడూ హీరోనే

### మిమ్మల్నే తెలంగాణ ప్రజలు విలన్లు అంటున్నారు

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** సిఎం ఎప్పుడు హీరోనే, తెలంగాణ ప్రజలకు ఆయన హీరోనే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని విలన్లు అని అంటున్నారనీ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సిఎల్‌పిలో విలేఖరులతో గురువారం మాట్లాడుతూ కెటిఆర్ మా సిఎం ని రజనీ కాంత్ తోని, భట్టి విక్రమార్క ను కమలాసన్ తో పోల్చినందుకు సంతోషంగా ఉందని చెప్పారు. కెటిఆర్ అండ్ టీం తెలంగాణ , హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బతీయడానికి ప్రయత్నం చేస్తున్నారనీ ఆరోపించారు. జీవితంలో అధికారంలోకి రాలేమన్న అసహనంలో ఆయన మాటల్లో కనిపిస్తోందనీ వివరించారు. వందల ఏళ్లుగా గత పాలకులు హైదరాబాద్ ను విశ్వనగరంగా తీర్చిదిద్దారే కాని హైదరాబాద్ ను ఆర్థికంగా విధ్వంసం చేయాలన్న ఆలోచన కెటిఆర్ లో కనిపిస్తోందనీ ఆరోపించారు. కెటిఆర్ ఏం చేసినా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ,తెలంగాణ గుర్తింపు తగ్గదనీ ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడనీ చెప్పారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కెటిఆర్ పెడబొబ్బలు పెడుతున్నాడు కాని రాయదుర్గంలో ఆరు ఎకరాలను వేలం వేస్తే ఎకరం 237 కోట్ల రూపాయలు పలికిందనీ ఉదహరించారు. ఇటీవల వేలం వేసిన భూములు అన్ని కూడా ఎకరం వంద కోట్లకు తక్కువ పలకలేదనీ గుర్తుచేశారు. పచ్చ కామెర్ల వచ్చిన వాళ్లకి లోకమంతా పచ్చగా కనిపించినట్లుగా కెటిఆర్ కు బిఆర్‌ఎస్ చితికిపోయినట్లుగానే రియల్ ఎస్టేట్ కుదేలైనట్లు కనిపిస్తోందనీ ఎద్దేవా చేశారు. హైదరాబాద్ కు కెటిఆర్ చేసింది ఏమీ లేదు..కృత్రిమంగా రియల్ ఎస్టేట్ బూమ్ పెంచి ప్రజలను మోసం చేసింది కెటిఆర్ అని ఆయన విమర్శించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ కోసం మా సిఎం నిరంతరం పనిచేస్తున్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కెటిఆర్ భావిస్తే గచ్చిబౌలిలోని ఆయన విల్లాను బేరం పెడితే కెటిఆర్ కొన్నదాని కంటే యాభై శాతం ఎక్కువ ఇచ్చి కొనుక్కోవడానికి సిద్ధంగా ఉన్నామనీ అన్నా రు. ప్లాట్లు, హైదరాబాద్‌లో అపార్ట్మెంట్ల ధరలు ఎలా ఉన్నాయో అందరికి తెలుసనీ సిఎం పైన వ్యక్తిగత దాడులు చేయడం కెటిఆర్ ఓర్వలేని తనంగా ఆయన అభివర్ణించారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ బొట్ల

## ఉపసర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

### ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ బొట్ల

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 25, ప్రభాతవార్త:** ఉప సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని ఉపసర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ బొట్ల విజ్ఞప్తి చేశారు. గురువారం ఉప సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి కార్తీక్ బొట్ల మాట్లాడుతూ చెక్ పవర్ విషయంలో ఉపసర్పంచులపై వస్తున్న వార్తలను ప్రభుత్వం ఖండించాలని డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్‌లకు ఐదు వేల రూపాయలు, వార్డు సభ్యులకు మూడు వేల రూపాయలు గౌరవ వేతనం ప్రకటించాలని, గ్రామాల్లో ఏర్పాటుచేసే శిలా ఫలకాలపై సర్పంచుల పేర్లతోపాటు ఉపసర్పంచ్‌ల పేర్లను కూడా పొందుపరచాలని, ఏ వార్డులో అభివృద్ధి పనులు జరిగితే ఆ వార్డు సభ్యుల పేర్లను కూడా శిలాఫలకాలపై నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ కటకం స్వప్న, ఉపాధ్యక్షులు మామిడి కవిత, డి.కుమార్, జి.శ్రీనివాస్‌రెడ్డి, వికార్ పాషా వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మైనారిటీ గురుకుల సంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన మైనారిటీ సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ మేరకు ఒక ప్రకటనలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టి ట్యూషన్స్ సొసైటీ (టెంరీస్) పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో పోస్టులు భర్తీ చేయనున్నది. టీజీటీలు (ట్రైన్డ్‌గ్రాడ్యుయేట్ టీచర్స్), పీజీటీలు (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్), జూనియర్ లెక్చరర్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డిప్యూటీ వార్డెన్ తదితర పోస్టుల్లో దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్టు తెలిపింది. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణపత్రాలతో నాంపల్లిలోని హజ్ హౌస్‌లో ఈ నెల 29లోపు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

## ఇంటెలిజెన్స్ బ్యూరో కొత్త చీఫ్‌గా మహేశ్‌దీక్షిత్

### తెలంగాణ కేడర్ ఐపిఎస్ అధికారి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్25:**దేశ అత్యున్నత అంతర్గత గూఢచారి సంస్థ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) కొత్త డైరెక్టర్‌గా మహేశ్ దీక్షిత్ నియమితులయ్యారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో భద్రతా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఈ సీనియర్ ఐపీఎస్ అధికారి కీలక బాధ్యతలు నిర్వర్తించారు.1993 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన మహేశ్ దీక్షిత్ తన కెరీర్‌లో ఎక్కువ కాలం ఐబీలోనే సేవలందించారు. జాయింట్ డైరెక్టర్, అదనపు డైరెక్టర్, స్పెషల్ డైరెక్టర్ హోదాల్లో పనిచేస్తూ సంస్థలో కీలక స్థానాలకు ఎదిగారు.శ్రీనగర్‌లోని ఐబీ అనుబంధ విభాగం (ఎస్ఐబీ) చీఫ్‌గా పనిచేసిన సమయంలో జమ్మూ, కశ్మీర్, లేహ్ ప్రాంతాల భద్రతా కార్యకలాపాలను పర్యవేక్షించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, సరిహద్దు చొరబాట్ల నిరోధం, అంతర్గత భద్రతా నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఇస్లామిక్ తీవ్రవాద నెట్‌వర్క్‌లపై నిఘా కార్యకలాపాల్లో కూడా మహేశ్ దీక్షిత్‌కు విస్తృత అనుభవం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్గత భద్రత, ఉగ్రవాద నిరోధక వ్యవస్థల్లో ఆయనకు ఉన్న అనుభవం నియామకానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు.




తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర మహాసభలలో పాల్గొన్న సిరికొండ మంధుసూదనాచారి, కలకోట రామన్న, పల్లెల వీరాస్వామి, వశపాక నరసింహ తదితరులు

## ఇళ్లు లేని కార్మికులకు 100 గజాల స్థలం, రూ.10 లక్షల సాయం అందించాలి

### రాష్ట్ర కార్మిక సమాఖ్య రాష్ట్ర మహాసభలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జూన్ 25, ప్రభాతవార్త :** తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర మహాసభలు గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వశపాక నరసింహ అధ్యక్షతన అత్యంతన జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోట రామన్న, ప్రముఖ కార్మిక నాయకులు బొజ్జ భిక్షమయ్య, టిపిసిసి అధికార ప్రతినిధి ఆరెపల్లి రాజేందర్, ప్రొఫెసర్ కొండ నాగేశ్వర, కొలా జనార్ధన్, పల్లెల వీరాస్వామి, డాక్టర్ అప్పికట్ల భరత్ భూషన్ పాల్గొన్నారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్రంలో ప్రతి ఇండ్లు లేని కార్మికులందరికి ఇందిరమ్మ స్కీంలో 100 గజాల ఇంటి స్థలాలు ఇస్తూ ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని, కార్మిక రంగాలలో పని చేస్తున్న కార్మికులందరికి ఉచిత భీమా సౌకర్యం వారి గుర్తింపు కార్డుల ద్వారా గుర్తింపు అమలు చేయాలని, సంచార జీవనం గడుపుతున్న కార్మిక రంగాలలో పని చేస్తున్న పిల్లలకు రిసిడెన్షియల్ స్కూల్స్ అడ్మిషన్లలో మొదటి ప్రాధాన్యత ఇచ్చి, ఇట్టి వారికి విద్యా అవకాశాలు కల్పించాలి, ఆరోగ్య శ్రీ పథకాన్ని కార్మిక కుటుంబాలందరికి అందజేయాలి, గతంలో ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలు అధిక అభివృద్ధి కొరకు బడుగు, బలహీన వర్గాలను ఇచ్చిన అసైన్డ్ భూములకు మరియు సీలింగ్, బంజార, కందిస్తులు మరియు భూదానంలో పంచినటువంటి భూములకు చట్టబద్ధత కల్పించాలి, ఇప్పటి వరకు రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరు మీద రైతు వేదికలు, వైకుంఠదామాలు, ఉ ద్యాన వనాలు, క్రీడ ప్రాంగణాలు, వివిధ ఆఫీసుల కోసం తీసుకున్న భూములకు నష్టపరిహారం కల్పించాలి. భూములు కోల్పోయిన కుటుంబాలకు కనీసం ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ యాతాకుల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి బందెల యాదగిరి, ఉపాధ్యక్షులు మహ్మద్ రజాక్, మహిళా అధ్యక్ష, కార్యదర్శురాలు చిలుముల్ల సుజాత, కొండపల్లి లక్ష్మీ, ఎపి మహిళా అధ్యక్షురాలు నెమలిపురి నాగమణి, ప్రధాన కార్యదర్శి సాంటి రత్నకుమారి, ఉపాధ్యక్షులు అల్వాల వెంకన్న, బండా నర్సింహ్మా , అధికార ప్రతినిధి దువ్వలగట్టు శేఖర్ . గ్రేటర్ హైదారబాద్ అధ్యక్షురాలు ముంతాజ్ బేగం , ఫైమా బేగం , మచ్చ చంద్రయ్య , కొమ్ములక్ష్మీ ్మ , సుజాత గారు తదితరులు పాల్గొన్నారు.

## మితిమీరుతోన్న పంట వ్యర్థాల దగ్ధం

### రాష్ట్రంలో 17 లక్షల ఎకరాల కాల్చివేత

### వ్యవసాయ్య వర్సిటీ విసి జానయ్య

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:**రాష్ట్రంలో పంట వ్యర్థాల కాల్చివేత మితిమీరుతోందని, మూడేళ్ల క్రితం మొదలైన ఈ ధోరణి నానాటికీ శ్రుతిమించుతోందని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క 202526 యాసంగిలోనే రాష్ట్రవ్యాప్తంగా 17 లక్షల ఎకరాల్లో పంటవ్యర్థాలను తగులబెట్టినట్టు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల నెలకొల్పిన అధునాతన ఆర్ఎస్, జీఐఎస్ (రిమోట్ సెన్సింగ్, జియో ఇన్ఫర్మేటిక్ సిస్టం) ప్రయోగశాలలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉపగ్రహ ఛాయాచిత్రాలని విశ్లేషించి ఆయన ఈ గణాంకాలను విడుదల చేశారు. దీనివల్ల నేల ఆరోగ్యం, గాలి నాణ్యత తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఇలాంటి పనులు వెంటనే ఆపాలని ఆయన రైతులని కోరారు. మొత్తం 17 లక్షల ఎకరాల్లో పంట వ్యర్థాలను కాల్చగా, అందులో 9 లక్షల ఎకరాల్లో వరికి సంబంధించినవి, మిగతా 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న తదితరాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా పంటవ్యర్థాలను తగులబెట్టిన జిల్లాల్లో నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, కామారెడ్డి, పెద్దపల్లి మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయని తెలిపారు. అతి తక్కువగా పంట వ్యర్థాలను కాల్చిన జిల్లాల్లో రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్ ఉన్నాయని పేర్కొన్నారు. ఒక టన్ను వరి గడ్డి, కొయ్యలని కాల్చివేయడం వల్ల ఐదున్నర కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాష్ గాలిలో కలసిపోతాయని వివరించారు. ఒక ఎకరానికి సుమారు రెండున్నర టన్నుల వరిగడ్డి, వ్యర్థాలు వస్తాయని, అంటే ఒక ఎకరం వరి విస్తీర్ణంలో వీటిని కాల్చినట్లయితే 13.5 కిలోల భాస్వరం, 6.75 కిలోల పొటాష్ గాలిలో కలసిపోయి తద్వారా వాయు కాలుష్యం తీవ్రంగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లెక్కల ప్రకారం 23.63 లక్షల కిలోల నత్రజని, 11.90 లక్షల కిలోల భాస్వరం, 1062 లక్షల కిలోల పొటాష్ ఈ మూడు మాసాల్లోనే గాలిలో కలసిపోయాయని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చకుండా తిరిగి నేలలోనే కలియదున్ని కొంత కాలం కుళ్ళనిచ్చినట్లయితే నేల సారం పెరగటంతో పాటు కాలుష్యం తగ్గించగలిగే వాళ్ళమని అభిప్రాయపడ్డారు.

# సంక్షేమమే ప్రజాప్రభుత్వ అజెండా

### ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులు

### హాస్టల్ మరమ్మతులు నెలలో పూర్తి చేయాలి

### హాస్టళ్లు, స్టడీ సర్కిళ్లు, ఓవర్సీస్ విద్యానిధిపై ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా చెప్పారు. గురువారం నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ సెక్రటేరియట్ లో బీసీ, ఎస్సీ, ఎస్సీ డిపార్ట్ మెంట్స్ సమీక్షా సమావేశం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రైవేట్ భవనాల్లో వసతి పొందుతున్న విద్యార్థులను సాధ్యమైనంత మేరకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు మార్చే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలు హాస్టల్లో గురుకులాలలో మరమ్మతు పనులు ఒక నెలలోపు పూర్తి చేయాలని అధికారులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

అలాగే 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.7.5 కోట్ల మరమ్మతు బిల్లు లను ప్రాధాన్యతతో క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. సంక్షేమ గురుకులాలు, హాస్టళ్ల రెంట్ ఛార్జీలు, డైట్, కాస్మోటిక్ ఛార్జీలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపాలని ఆయా శాఖ కార్యదర్శులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి, యూపీఎస్సీ, గ్రూప్ సర్వీసులు, ఇతర పోటీ పరీక్షల్లో విజయశాతాన్ని పెంచాలన్నారు.

సంక్షేమ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను సమర్పించాలని ఆదేశించారు. మెరుగైన ఆర్థిక ప్రణాళిక కోసం వార్షిక, త్రైమాసిక నిధుల అవసరాలను సమర్పించాలని తెలిపారు.

అన్ని జిల్లాల్లో డా. బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల స్థాపనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ బిల్లులను క్రమం తప్పకుండా సమర్పించి క్లియరెన్స్ పొందాలని ఆయా శాఖల కార్యదర్శులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఉమెన్ చైల్డ్ డెవలప్మెంట్ కార్యదర్శి అనిత రామచంద్రన్, ఎస్సీ డెవలప్మెంట్ కార్యదర్శి విజయేంద్ర బొయి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ ఎంజెపి విద్యాసంస్థల సొసైటీగా మార్పు

### బిసి గురుకులాల బలోపేతానికి పలు సంస్కరణలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమోదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన సచివాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్ఈఐఎస్) 6వ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం గురువారం జరిగింది. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పరిపాలనా బలోపేతానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ప్రాంతీయ సమన్వయ కార్యాలయాల వివిధ విభాగాలకు బడ్జెట్ పరిమితులను బోర్డు ఆమోదించింది. ఎంజేపీ బీసీ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు మరణించిన సందర్భాల్లో వారి తల్లిదండ్రులకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడానికి బోర్డు ఆమోదం తెలిపింది.



ప్రిన్సిపాల్ (పాఠశాల) నియామకాలకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న 70 శాతం పదోన్నతులు, 30 శాతం ప్రత్యక్ష నియామకాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి కేవలం ఎంజేపీ గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. విద్యా పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాళ్ల సేవలను అకడమిక్ కన్సల్టెంట్లుగా వినియో గించుకునే అంశంపై నియామక నిబంధనలను రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేసి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఇతర విద్యాసంస్థల సంఘాల తరహాలోనే సంస్థ పేరును తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (టిజిడబ్ల్యుసిడబ్ల్యుఎంజెపిఆర్ఈఐఎస్)గా మార్చాలని బోర్డు నిర్ణయించింది.

## క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లు

### 28లోగా లొకేషన్ల ఖరారు

### జులై మొదటి వారంలో బ్రోచర్ విడుదల

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 25:**పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా ఈనెల 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్‌లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన మేఘాలయ సిఎం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్25:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజారక్షణలో వినియోగిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. ఇందులో భాగంగా మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మా బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు.ఆయనతో పాటు మేఘాలయ పరిశ్రమల శాఖ కమిషనర్, సెక్రటరీ సిరిల్ వి. డార్లాంగ్ డియంగ్డో, ముఖ్యమంత్రి సచివాలయ జాయింట్ సెక్రటరీ శివాంష్ అవస్థి, ఉన్నతాధికారుల బృందం ఈ పర్యటనలో పాల్గొన్నారు.

సెంటర్‌లో అత్యంత ఆధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలు, కార్యాచరణ సామర్థ్యాలను ముఖ్యమంత్రికి క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా నగర భద్రతను పర్యవేక్షించే టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్, వీడియో వాల్, అత్యవసర సేవల సమన్వయ వ్యవస్థ , విపత్తు నిర్వహణ పనితీరును తెలుసుకుని ప్రశంసించారు. ప్రజా భద్రత, సుపరిపాలన కోసం తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న సాంకేతిక విధానా లను మేఘాలయ ముఖ్యమంత్రి సంగ్మా అభినందించారు. ఇక్కడి టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్, భారీ వీడియో వాల్ పనితీరు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని కొనియాడారు. తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును మరింత లోతుగా అధ్యయనం చేయడా నికి త్వరలోనే మేఘాలయ నుంచి ఒక ప్రత్యేక అధికారుల బృందాన్ని ఇక్కడికి పంపిస్తామని స్పష్టం చేశారు. దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచిన టీజీఐసీసీసీ పనితీరుపై ఆయన ప్రశంసలు కురిపించారు.

## పెళ్లి ఇష్టం లేదని చెప్పినా బలవంతంగా నిర్ణయించారు

### పుణే కేఫ్‌లోనే కేతన్ హత్యకు పన్నాగం

### సియాగోయల్ నోట దర్యాప్తులో వెలువడుతున్న నిజాలు

**పుణే, జూన్ 25:** పుణే యువకుడు కేతన్ అగర్వాల్ (26)తో పెళ్లి ఇష్టం లేదని సియా గోయల్ తన కుటుంబ సభ్యులకు చెప్పిన విషయందర్యాప్తులో బయటపడింది. అయినప్పటికీ ఆమె కుటుంబం సియాను పెళ్లికి ఒప్పించినట్లు సమాచారం. మహారాష్ట్ర, పూణెకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కేతన్ అగర్వాల్‌ను కాబోయే భార్య సియా గోయల్ ఈ నెల 18న హత్య చేసిన సంగతి తెలిసిందే.

కేతన్‌ను లోహగడ్ కోటకు తీసుకెళ్లిన సియా అతడిని లోయలోకి తోసి చంపేసింది. ఈ ఘటనలో నిందితులు సియా, ఆమె ప్రియుడు చేతన్ చౌదరిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. 20 ఏళ్ల సియా తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని ఆమె కుటుంబ సభ్యులకు చెప్పింది. పెళ్లికి తాను మానసికంగా సిద్ధంగా లేనని, పైగా కేతన్ అగర్వాల్‌ను పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదని ఆమె తన కుటుంబ సభ్యులకు అనేకసార్లు చెప్పింది. అయిన ప్పటికీ, పట్టించుకోకుండా ఆ కుటుంబం కేతన్ అగర్వాల్‌తో పెళ్లి నిర్ణయించారు.

నిశ్చితార్థం కూడా జరిపించారు. నవంబర్‌లో పెళ్లికి ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు. కొంతకాలంగా సియా చేతన్ చౌదరితో ప్రేమలో ఉంది. ఈ నేపథ్యంలో కేతన్‌తో పెళ్లి ఇష్టం లేని సియా దీన్నుంచి బయటపడేందుకు అతడిని ప్లాన్ చేసి చంపడం ఒక్కటే మార్గమని భావించింది. తన ప్రియుడు చేతన్‌తో కలిసి కుట్ర పన్నింది. సియా గోయల్, చేతన్ చౌదరి మధ్య చాలాకాలంగా ప్రేమ ఉన్న సంగతి తెలిసిందే. ఇద్దరూ గత ఆరు నెలల కాలంలో 2,004 సార్లు ఫోన్ చేసుకున్నారు.



ఈ ఆరు నెలల సమయంలో మొత్తం 238 గంటలు కాల్స్ మాట్లాడారు. అందులో కొన్ని కాల్స్ 2 నుంచి 3 గంటల వరకు సాగినట్లు పోలీసులు గుర్తించారు. కేతన్ హత్యకు ముందు రోజు సియా, చేతన్.. ఇద్దరూ సాయంత్రం ఒక కేఫ్‌లో కలుసుకున్నారు.

దాదాపు గంటసేపు మాట్లాడుకున్నారు. ఈ సమయంలోనే కేతన్ హత్యకు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. అతడిని పర్వతంపై నుంచి తోసేయాలని ప్లాన్ చేశారు. ఇందుకు అనువైన ప్రదేశాన్ని కూడా ఇద్దరూ కలిసే లోహాగడ్‌కోటను నిర్ణయించారు. ఈ కేసుకు సంబంధించి ప్రస్తుతం మరింత లోతుగా విచారణ కొనసాగుతోంది.



## వెజ్ బిర్యానీలో ఈగ

### కేటరింగ్ సంస్థకు ఐఆర్సీటిసి రూ. లక్ష జరిమానా

**అహ్మదాబాద్, జూన్ 25:** రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ ప్రయాణికుడికి అందించిన భోజనంలో ఈగ వచ్చిన ఘటనను ఐఆర్‌సీటీసీ సీరియస్‌గా తీసుకుంది. సదరు క్యాటరింగ్ సంస్థకు రూ.లక్ష జరిమానా విధించింది. అలాగే లైసెన్స్ రద్దు చేస్తామని షోకాజు నోటీసులు జారీ చేసింది. అహ్మదాబాద్ నుంచి ముంబైకి తేజస్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఇటీవల ప్రయాణించిన ఓ వ్యక్తి ఆన్‌బోర్డు భోజనంగా వెజ్ బిర్యానీతో కూడిన కాంబో లంచ్‌ను ఆర్డర్ చేశాడు. దానిని తినే సమయంలో బిర్యానీలో ఈగ కనిపించింది. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన ప్రయాణికుడు వెంటనే రైలు సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. భోజనం నాణ్యత కూడా బాగోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే రైలు కెప్టెన్, ఆన్‌బోర్డ్ క్యాటరింగ్ మేనేజర్ ప్రయాణికుడి వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. జరిగిన తప్పుకు క్షమాపణలు చెప్పి కొత్త భోజనం అందిస్తామని ప్రయాణికుడికి చెప్పారు. కానీ అందుకు ప్రయాణికుడు తిరస్కరించాడు. దీనిపై ఐఆర్‌సీటీసీకి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేయగా అరాహ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న సూరత్‌లోని లైసెన్స్ పొందిన బేస్ కిచెన్ నుంచి ఆ ఫుడ్ సరఫరా అయినట్లుగా అధికా రులు గుర్తించారు. అందులో భోజనం తయారీతో పాటు, ప్యాకేజింగ్ ప్రక్రియ లో పలు లోపాలు ఉన్నట్లు గమనించారు. ఈ నేపథ్యంలో సదరు క్యాటరింగ్ సంస్థకు ఐఆర్‌సీటీసీ గట్టి వార్నింగ్ ఇచ్చింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

## ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### ఖైరతాబాద్ నియోజకవర్గంలో 'సర్' పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 25, ప్రభాతవార్త:** ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కావడంతో ఖైరతాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.7 వెంకటేశ్వర కాలనీలో స్థానిక ప్రజలకు ఈ సందర్భంగా సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి బీఎల్ఏలు, బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఓటరు సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే అర్హులైన వారి ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందన్నారు. బీఎల్‌వోలు అందజేసే ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా నింపి సమర్పించాలని, అలా చేస్తే ఓటు జాబితాలో పేరు కొనసాగుతుందని వివరించారు. ఎన్నికల కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి ప్రక్రియను ప్రారంభించిందని, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారన్నారు. రాష్ట్రంలోని సుమారు 35 వేల పోలింగ్ కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను నియమించిందని, వారు బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుని అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ప్రక్రియ కొనసాగుతుందని, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల కానుందని తెలిపారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న చార్మినార్ జోన్ డిసిపి కిరణ్‌ఖరే ప్రభాకర్

## ఎటిఎం డబ్బును దొంగతనం చేసిన తండ్రి, ఇద్దరు కొడుకుల అరెస్ట్

### రూ.14.55 లక్షలను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**హైదరాబాద్ (చార్మినార్), జూన్ 25, ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు కన్న కొడుకులతో కలిసి ఓ క్యాష్ వ్యాన్‌డ్రైవర్ వేసిన ఘరానా దొంగతనం పథకాన్ని హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (చార్మినార్ జోన్),ఐఎస్ఐ సదన్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు.ఎస్‌బిఐ ఏటిఎంలో నింపవలసిన 17లక్షల నగదుతో పాటు పరారైన డ్రైవర్, అతని ఇద్దరు కొడుకులను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ముగ్గురు వద్ద నుంచి 14,55,000 రూపాయల నగదు,ద్విచక్రవాహనం,నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించి వివరాలను చార్మినార్ జోన్ డిసిపి ఖరే కిరణ్ ప్రభాకర్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.జగిత్యాల జిల్లా,మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్ (42) నగరంలోని ఫిరోజ్‌గూడలో నివాసం ఉంటూ క్లియర్డ్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో క్యాష్ వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.శ్రీనివాస్ ఇద్దరు కొడుకులు చింతల అనీష్ అలియాస్ జాన్ (22) చింతల జశ్వంత్ (20)లు ఉప్పల్ ఫిర్జాదిగూడలో ఉంటూ స్విగ్గీలో డెలివరీ బాయ్స్‌గా పని చేస్తున్నారు.ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న క్యాష్ వ్యాన్ డ్రైవర్ శ్రీనివాస్ దొంగతనం చేయాలని భావించాడు.ఈ విషయాన్ని తండ్రి ఇద్దరు కొడుకులకు వివరించాడు.పథకం ప్రకారం జూన్ 23న మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదిబజార్ ఎస్‌బిఐ ఎంటిఎం వద్దకు నగదు నింపే వాహనం చేరుకుంది.మిగిలిన సిబ్బంది ఏటిఎంలో నగదు నింపే పనిలో ఉండగా డ్రైవర్ శ్రీనివాస్ క్యాష్ వ్యాన్ నుంచి 17 లక్షల రూపాయలు ఉన్న నగదు బ్యాగ్ తీసుకుని పక్క సందులోకి పారిపోయాడు.అక్కడ ఉన్న పెద్ద కొడుకు అనీస్ తండ్రిని ద్విచక్ర వాహనం మీద ఎక్కించుకుని పరారీ అయ్యారు.

ఫిర్జాదిగూడలో ఉంటున్న చిన్న కొడుకు వద్దకు ఇద్దరు వెళ్లారు.దొంగతనం చేసిన డబ్బులో పది లక్షల రూపాయలు భద్ర పరచమని చిన్న కొడుకు జశ్వంత్‌కు ఇచ్చారు. మిగతా ఏడు లక్షల రూపాయలు డ్రైవర్ శ్రీనివాస్,పెద్ద కొడుకు అనీస్‌లు తమ వద్ద ఉంచుకుని విచ్చలు విడిగా ఖర్చు చేశారు. క్యాష్ కస్టోడియన్ బంటుపల్లి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐఎస్‌సదన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. సిసిటివి ఫుటేజ్‌లు ఆధారంగా పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి14,55,000 రూపాయల నగదు, ద్విచక్ర వాహనం.నాలుగు మొబైల్ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ విలేకర్ల సమావేశంలో టాస్క్ ఫోర్సు అదనపు డిసిపి అందె శ్రీనివాస్‌రావు, సంతోష్ నగర్ ఏసిపి టి.సుఖ్‌దేవ్ సింగ్,చార్మినార్ టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టరన ఎస్.సైదాబాబు,ఐఎస్ సదన్ ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు,డిఐ సాయి ప్రకాష్ గౌడ్,ఎస్ఐలు కె. రామారావు, ఎం.మహేష్,ఎం,మధుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం



### అన్నప్రసాదం ట్రస్టుకు రూ.11 లక్షల విరాళం

**తిరుమల, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వస్తున్న శ్రీవారి భక్తులకు నిత్యం రుచిగా శుచిగా ఉచితంగా అన్నప్రసాద సేవలను అందిస్తున్న టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు గురువారం రూ.11 లక్షలు విరాళం అందాయి. బెంగుళూరుకు చెందిన హైషాని ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ విరాళాన్ని అందించింది. డిడిని శ్రీవారి ఆలయంలో రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



### కృష్ణస్వామిగా పద్మావతి.. తెప్పపై జలవిహారం

**తిరుమల, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతిఅమ్మవారి పద్మసరోవరంలో కృష్ణస్వామి దివ్య తెప్ప విహరించింది. పద్మావతి అమ్మవారి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు గురువారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామి పద్మసరోవరంలోని సుందరంగా అలంకరించిన తెప్పపై మూడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించారు.

**పద్మసరోవరంలో దివ్య తెప్ప విహారం:** సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అనంతరం సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు జరిగిన తెప్పోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మసరోవరంలో విద్యుద్దీపాల వెలుగుల్లో సాగిన ఈ దివ్య విహారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. తెప్పోత్సవాలలో భాగంగా ఆలయ నాలుగు మాడవీధుల్లో నిర్వహించిన భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, డిప్యూటీ ఇఒ పి.హరింద్రనాథ్, సూపరింటెండెంట్లు సురేష్, రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చలపతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### నేటి నుండి శ్రీవారి జ్యేష్టాభిషేకాలు

- ఉత్సవమూర్తుల పరిరక్షణకు జాగ్రత్తలు



**తిరుమల, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న కలియుగ వైకుంఠం తిరుమలలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షణకు మూడురోజులపాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహిస్తారు. ప్రతి ఏడాది జూన్‌మాసంలో జ్యేష్టానక్షత్రానికి ముగిసేలా జరిపించే ఈ జ్యేష్టాభిషేకాల్లో ఉత్సవమూర్తులకు సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ క్రతువులో ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బంగారుకవచంలోనే ఉత్సవమూర్తులను అలంకరింపజేసి ఏడాది పూర్తిగా అలాగే ఉంచుతారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వర స్వామికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు,కైంకర్యాలు నిర్వహిస్తారు. వీటివల్ల ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. సంపంగి ప్రాకారంలోని కల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు నేడు శుక్రవారం రుత్వికులు శాంతి హోమం నిర్వహిస్తారు. హోమాలు, అభిషేకాలు, శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులకు వజ్రకవచం అలంకరిస్తారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు యధావిధిగా కైంకర్యాలు నిర్వహించి ఉత్సవమూర్తులకు ముత్యాలకవచం ధరింపజేస్తారు. చివరగా మూడవరోజు 28వతేదీ ఆదివారం విశేష పూజలు,అభిషేకాలు జరిపించి మళ్ళీ బంగారుకవచం ధరింపజేస్తారు. బంగారుకవచంలోనే ఏడాదంతా విశేష పూజలు, ఉత్సవాలు జరిపించుకుంటారు. ఇప్పటికే జూన్‌నెలలో జరిగే ఈ మూడురోజుల జ్యేష్టాభిషేకాలకు ఆన్‌లైన్‌లో సేవా టిక్కెట్లు విడుదల చేశారు. జ్యేష్టాభిషేకాన్ని పురస్కరించుకుని 28వ తేదీ కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలను టిటిడి రద్దు చేసింది.

### హర్యానా కురుక్షేత్రలో శ్రీవారి బ్రహ్మోత్సవం



**తిరుమల, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** హర్యానా రాష్ట్రంలోని పుణ్యక్షేత్రం కురుక్షేత్రలో వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణ మహోత్సవంతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదఘోషలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు పాంచరాత్ర ఆగమోక్త విధానంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు అధికారిక శ్రీకారం చుట్టగా, భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.రాత్రి పెద్దశేష వాహనం వేడుకగా నిర్వహించారు. నేటి ఉదయం చిన్నశేష వాహనం,రాత్రి హంస వాహనం,27న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం,28న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 29న ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనసేవ, 30న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, జులై 1న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 2న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వ వాహనం, 3న చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగుస్తాయి. జూన్ 29న ఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనుండగా, సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. అనంతరం గరుడ వాహనసేవ జరగనుంది. బ్రహ్మోత్సవాల అనంతరం 4న సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు శ్రీవారికి పుష్పయాగం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎఇఒ బాలరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టిటిడి ఛైర్మన్ కోసం అన్వేషణ?

- సిఎం సొంత జిల్లా వారికి అవకాశముంటుందన్న ఊహాగానాలు



**తిరుమల, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానమ్ ఆలయ పాలనా వ్యవహారాలు పర్యవేక్షించేందుకు కీలకమైన బోర్డు ఛైర్మన్ పదవికోసం ప్రభుత్వం అన్వేషణ మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. దేశంలోనే అత్యంత ప్రాధాన్యత ఉన్న టిటిడి ఛైర్మన్ పదవికి సిఎం చంద్రబాబు సొంత జిల్లా వాసుల్లో ఆధ్యాత్మిక, భక్తిభావం సేవానిరతి కలిగిన వారికి అవకాశం కల్పించాలని సిఎం ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. ఈ దఫా టిటిడి ఛైర్మన్ పోస్టు నియామకంలో ఆచితూచి అడుగేయ నుండటం వల్ల 2029లో జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అంతేగాక ఇప్పటికే తన సొంత జిల్లాలో నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న నాయకులకు తగిన ప్రాధాన్యత లేదనేది సీనియర్ నేతలు అసహనం వ్యక్తం చేసిన సందర్భాలు లేకపోలేదు.

రానున్న నవంబర్‌కు బిఆర్‌నాయుడు పదవీకాలం ముగియనుండటంతో 2029 ఎన్నికలే ప్రామాణికంగా టిటిడి బోర్డు నూతన ఛైర్మన్ కోసం చంద్రబాబు అన్వేషణ మొదలుపెట్టినట్లు పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఛైర్మన్ పదవీకాలం గడువు లోపుగా మంచి సమర్థుడైన వ్యక్తిని ఎంపిక చేయడానికి ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించారని తెలుస్తోంది. ఛైర్మన్ పదవికి తగిన ముగ్గురి పేర్లు సూచించమని పార్టీ సర్వే విభాగం వారిని కోరినట్లు తెలిసింది. ఇక బోర్డు సభ్యుల పేర్లు కూడా పరిశీలిస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. టిటిడి పవిత్రత కాపాడుతూ భక్తుల సేవలో తరించగల వ్యక్తిని ఛైర్మన్‌గా నియమించాలన్న లక్ష్యంతో ఉన్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం చూసే వ్యక్తికి బాధ్యత అప్పగించాలని చూస్తున్నారు. దీని కోసం, దైవభక్తి, నిబద్ధత, పరిపాలనా దక్షత కల వ్యక్తి అయితే మంచిదని భావిస్తున్నారు.

#### 'బాబు' మదిలో అదృష్టం ఎవరికో!?

ఈ నేపద్యంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన విద్యావంతుడు, టిటిడి పట్ల అవగాహన, అనుభవం ఉన్న వారి కోసం పరిశీలన ప్రారంభించారు. అయితే సామాజిక న్యాయం, రాజకీయ ప్రయోజనం కూడా కాపాడుకోవాలని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా టిటిడిలో గత వైసిపి హాయాంలో జరిగిన అనేక అక్రమాలు, పొరబాట్లపై తాజా బోర్డు చర్యలకు ఉపక్రమించడంతో వైసిపి నేత ,మాజీ టిటిడి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి బి ఆర్ నాయుడుపై అనేక ఆరోపణలు చేసి ఇబ్బంది పెట్టారు. ఇప్పటికీ అడుగడుగునా వైసిపి నేతలు టిటిడిని లక్ష్యం చేసుకుని ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. దీనికి తోడు రెండేళ్లుగా టిటిడికి చెందిన ఎస్వీబీసీ చానల్ సిఇఒ, ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి, శ్వేత డైరెక్టర్ నియామకాలు జరగలేదు. ఈ నేపద్యంలో సమర్థుడైన వ్యక్తి కోసం అన్వేషిస్తున్నారు. దీని కోసం చంద్రబాబుకు నమ్మిన వ్యక్తిగా ఉన్న ఒక ఎమ్మెల్యే పేరు పరిశీలనలోకి వచ్చిందని తెలిసింది. అయితే ఆయన అందుకు సుముఖంగా లేరని సమాచారం. టిడిపి అధికారంలో ఉండగా బలిజ, బిసి, కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించారు. కాబట్టి ఇతర సామాజిక వర్గానికి చెందిన వారి పేర్లు పరిశీలనలోకి వస్తాయని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. విషయం తెలిసి ఇప్పటికే ఒకరిద్దరు ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారనేది గుప్పుమంటోంది.

# ఏపిలో ఆర్థిక వ్యవస్థ ఛిద్రం!

- ప్రభుత్వ అసమర్ధ విధానాలను కప్పి పుచ్చుకునేందుకు వాస్తవాలను పక్కద్రోవ పట్టిస్తున్న సిఎం చంద్రబాబు: ఎక్స్ వేదికగా జగన్ ఆరోపణలు



**విజయవాడ, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఛిద్రమైందని వైసిపి నాయకుడు,మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వ అసమర్థ విధానాలను కప్పి పుచ్చుకునేందుకు వాస్తవాలను పక్కద్రోవ పట్టించే దిశలో సీఎం చంద్రబాబు వైఖరి ఉందన్నారు. ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన కీలక హామీలను చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. వడ్డీ రాయితీ పథకాన్ని నిలిపివేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని జగన్ ఆరోపించారు. 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు, మళ్లీ ఇప్పుడు 2026-27 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ ఆ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, గ్రౌండ్ లెవెల్లో ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఈ వడ్డీ రాయితీ అమలు చేయకపోవడం వల్ల గత రెండేళ్లలో డ్వాక్రా మహిళలకు సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం జరిగిందని విమర్శించారు. 2023-24లో రూ.49,696 కోట్లుగా ఉన్న డ్వాక్రా రుణ వృద్ధి, కూటమి పాలనలో 2024-25 నాటికి రూ.41,623 కోట్లకు, 2025-26లో మరింత తగ్గి రూ.41,105 కోట్లకు పడిపోయిందని అన్నారు. అంతేకాదు, 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి 3.22 శాతంగా నమోదైందని, ఇది ఏపీలో స్పష్టమైన ఆర్థిక మాంద్యానికి సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం మరింత సంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తూ, బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏపీలో పన్ను ఆదాయ వృద్ధి పడిపోయిందని, రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళ్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని సూపర్ సిక్స్ తరహాలో హామీ ఇచ్చిందని జగన్ అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని మండిపడ్డారు. తమ వైసీపీ ప్రభుత్వ హాయాంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4,969 కోట్ల మేర వడ్డీ రాయితీతో పాటు ఆసరా, చేయూత వంటి స్కీమ్స్‌తో ఆర్థిక భరోసా ఇచ్చామని జగన్ తెలిపారు.

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**ఎఐసిసి నేత రాగిణి నాయక్**

**విజయవాడ, జూన్ 25 ప్రభాతవార్త:** దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు ఉదంతాలపై ఏఐసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ రాగిణి నాయక్ మండిపడ్డారు. భవిషత్ డాక్టర్లను నిర్ణయించే నీట్ పేపర్ లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. జూన్ 30నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యే ఛాత్రోం కీ గూంజ్ ఉద్యమంలో భాగంగా గురువారం విజయవాడకు వచ్చిన డాక్టర్ రాగిణి నాయక్ స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఛాత్రోం కీ గూంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించి మీడియాతో మాట్లాడారు. ఎన్‌టీఏను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పేపర్ లీకేజీల వల్ల కోట్లాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థుల బాధలను, భయాలను అర్థం చేసుకోవాలంటే స్పందించే గుండె కావాలని, అది ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేదని ఏఐసీసీ అధికార ప్రతినిధి రాగిణి విమర్శించారు.

### భక్తుల ఆరోగ్య రక్షణకు అత్యాధునిక ఆహార పరిశోధనాశాల

**- తొలి అనాలిసిస్ నివేదిక పరిశీలించిన అదనపు ఇఒ**



**తిరుమల, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఆహార నీటి అనాలిసిస్ పరిశోధనశాల పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఈ పరిశోధనశాలను గురువారం సాయంత్రం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పరిశీలించారు. తొలి అనాలిసిస్ రిపోర్ట్‌ను తనిఖీ చేశారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల ఆరోగ్య భద్రతకు టిటిడిఅత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది మార్చి 21న ప్రారంభించిన ఈ అనాలిసిస్ ల్యాబ్‌లో కేవలం రెండున్నర నెలల్లోనే అన్ని ప్రమాణాలను పూర్తి చేసి, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ) మేరకు పరీక్షలు నిర్వహించి తొలి రిపోర్ట్ సిద్ధం చేయడం విశేషమన్నారు.

ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో 50కి పైగా అత్యాధునిక పరికరాలు ఉన్నాయని తెలిపారు. 30 మంది శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, ల్యాబ్ టెక్నీషియన్లు సేవలందిస్తున్నారని చెప్పారు. త్వరలో ప్రభుత్వ అనుమతి మేరకు 20 మంది శాశ్వత ఉద్యోగులను నియమించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విభాగం డిప్యూటీ ఇఒసోమన్నారాయణ, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథం, ల్యాబ్ క్వాలిటీ మేనేజర్ లక్ష్మీనారాయణ,



### మళ్లీ ఆడపిల్లే పుడుతుందని 6 నెలల గర్భవతి ఆత్మహత్య

- ఇంటి పైకప్పుకు చీరతో ఉరి వేసుకొని మృతి చెందిన వైనం
- అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం షేక్షానుపల్లిలో విషాదం



మృతురాలి కుమార్తెలు వైష్ణవి, యసశ్విని



విలపిస్తున్న మృతురాలి తల్లి

**ఉరవకొండ, జూన్ 25 ప్రభాతవార్త:** ఇప్పటికీ ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మళ్లీ ఆడపిల్లే పుడుతుందని మనోవేదనకు గురైన 6 నెలల గర్భవతి సుంకమ్మ (26) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక ఘటన ఉరవకొండ మండల పరిధిలోని షేక్షానుపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ బి.మహానంది, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే లత్తవరం తండాకు చెందిన సుంకమ్మకు దాదాపు 8 సంవత్సరాల క్రితం షేక్షానుపల్లికు చెందిన రమేష్‌నాయక్‌తో వివాహం జరిగింది. వారికి 6 సంవత్సరాల వయసుగల వైష్ణవి, 4 సంవత్సరాల వయసుగల యసశ్విని సంతానం. ఈ క్రమంలోనే మరొకమారు గర్భం దాల్చగా ప్రస్తుతం ఆమె 6 నెలల గర్భవతని సమాచారం. అయితే ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మళ్లీ ఆడపిల్లే పుడుతుందేమోనని ఆమె నిత్యం మదన పడేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈక్రమంలో ఆబార్షన్‌కు కూడా సిద్ధం కాగా భర్త, కుటుంబ సభ్యులు ఎవరైతే ఏముందిలే బాధపడవద్దని సర్దిచెబుతూ వస్తున్నట్లు సమాచారం. మనోవేదనకు గురైన సుంకమ్మ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటిలో చీరతో ఉరి వేసుకొంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు, అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. నిండు గర్భిణీ మృతితో షేక్షానుపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి తండ్రి తులసీనాయక్ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1975 జూన్ 25 చీకటి రోజు

**- బిజెపి రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు**

**విజయవాడ, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1975 జూన్ 25 అర్ధరాత్రి ఒక చీకటి రోజుగా నిలిచిపోయిందని, అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్రమైన దెబ్బగా మారిందని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు, బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు పేర్కొన్నారు.ఎమర్జెన్సీ విధించి 51 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ఇందిరా గాంధీ దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారని విమర్శించారు. 1971 ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, ఎన్నికల అవకతవకలకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు ఆమె ఎన్నికను చెల్లదని ప్రకటించిన నేపథ్యంలో, ప్రజాస్వామ్య విలువలను పక్కనబెట్టి ఎమర్జెన్సీని విధించారని అన్నారు. ఎమర్జెన్సీ ప్రకటించిన వెంటనే దేశవ్యాప్తంగా వేలాది మంది రాజకీయ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారని గుర్తు చేశారు. జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ దేశాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వానీ, చంద్రశేఖర్ వంటి జాతీయ నాయకులను 21 నెలల పాటు జైళ్లలో నిర్బంధించారని శ్రీనివాస్ రాజు తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడిన కాలంగా ఎమర్జెన్సీని దేశ ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, దేశ చరిత్రలో జరిగిన ఈ ఘటనల నుంచి పాఠాలు నేర్చుకుని ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు పిలుపునిచ్చారు

**ఆంక్షలు విధించి, మీడియా గొంతు నొక్కారు:** కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలు ఎలా దెబ్బతిన్నాయో ఎమర్జెన్సీ ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని బిజెపి రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్ విమర్శించారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ తన అధికారాన్ని కాపాడుకోవడం కోసం దేశంపై ఎమర్జెన్సీని రుద్ది, ప్రజాస్వామ్య విలువలను కాలరాశారని ఆయన విమర్శించారు. పత్రికా స్వేచ్ఛపై తీవ్ర ఆంక్షలు విధించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రచురించకుండా సెన్సార్ విధానాలను అమలు చేశారని దిలీప్ పేర్కొన్నారు. మీడియా గొంతును నొక్కివేసి, ప్రజలకు నిజాలు తెలియకుండా చేయడం ఎమర్జెన్సీ కాలంలోని అత్యంత దురదృష్టకర పరిణామమని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ప్రజలు ఎప్పటికీ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.



### నిజాయితీకి నిదర్శనం

- రూ.45 లక్షల విలువైన బంగారు ఆభరణాల అప్పగింత

**తిరుపతి, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో కుటుంబ వివాహ కార్యక్రమం ముగించుకుని బెంగళూరుకు తిరుగు ప్రయాణం అవుతున్న ఓ కుటుంబం మార్గమధ్యలో అలిపిరి సమీపంలోని గరుడాద్రి హోటల్‌లో భోజనం చేశారు. అక్కడే సుమారు రూ.45 లక్షలు విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను మరిచిపోయి వెళ్లిపోయారు. బెంగళూరుకు చేరుకున్న తర్వాత బ్యాగ్ కనిపించక పోవడంతో బాధితుడు భరత్ కుమార్ డయల్112కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే తిరుపతి పోలీసులు స్పందించి హోటల్ వద్ద విచారణ చేపట్టారు. గరుడాద్రి హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న శశి కస్టమర్లు మరిచిపోయిన బ్యాగ్‌ను గమనించి అందులో విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయని తెలుసుకుని, ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా అత్యంత భద్రంగా దాచిపెట్టి సంరక్షించినట్లు గుర్తించారు. పోలీసుల సమక్షంలో బ్యాగ్‌ను తెరిచి పరిశీలించగా అందులో ఉన్న సుమారు 300 గ్రాముల బంగారు ఆభరణాలు సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం ఆ బ్యాగ్‌ను బాధితుడు భరత్ కుమార్ కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం బాధితుడు భరత్ కుమార్ మాట్లాడుతూ తమ కుటుంబంలో జరిగిన వివాహానికి సంబంధించిన విలువైన బంగారు ఆభరణాలన్నీ ఆ బ్యాగ్‌లోనే ఉన్నాయని, బ్యాగ్ తిరిగి దొరకకపోతే కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని తెలిపారు. హోటల్ క్యాషియర్ శశి చూపిన నిజాయితీ, డయల్112కు సమాచారం అందిన వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న పోలీసుల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విలువైన ఆభరణాలు దొరికినా వాటిని యథావిధిగా యజమానికి అప్పగించడం గొప్ప మానవీయ విలువలకు నిదర్శనమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పేర్కొన్నారు. శశి చూపిన బాధ్యత, నిబద్ధత, నిజాయితీ సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో శశిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాసులు, చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, రూరల్ సిఐ మద్దయ్యాచారి పాల్గొన్నారు.

### తిరుమలలో దుకాణంలో నెమలి



**తిరుమల, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అడవిలో ఉన్న జంతువులు, పక్షులు, వన్యమృగాలు తరచూ జనావాసంలోకి వచ్చేస్తున్నాయి. గురువారం ఎస్ఎన్‌సి షెడ్‌పరిధిలోని 36వ నంబర్ దుకాణంలో నెమలి కనిపించింది దీంతో భక్తులు, స్థానికులు నెమలిని ఆసక్తిగా చూశారు. దుకాణంలోపలకు నెమలి రావడంతో గమనించిన యజమాని వెంటనే అటవీ శాఖకు, విజిలెన్స్‌కు తెలిపారు. అటవీశాఖ సిబ్బంది గమనించి ఆరోగ్యంగా ఉండటంతో నెమలిని అడవిలో వదలిపెట్టారు.

### నేటి నుండి తిరుపతిలో జాతీయ స్థాయి జానపద నృత్య మహోత్సవం




**తిరుపతి, జూన్ 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక సాంస్కృతిక నగరమైన తిరుపతిలో కళా వైభవానికి ప్రతీకగా నిలిచే రాయలసీమ రంగస్థలి శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ 36వ జాతీయ శాస్త్రీయ-జానపద నృత్య పోటీలు నేటి నుండి 28వ తేదీ వరకు మూడు రోజులపాటు మహతి కళాక్షేత్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కేఎన్ రాజా మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో శాస్త్రీయ, జానపద సంగీత-నృత్య పోటీలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ ఏడాది కూడా తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి సైతం కళాబృందాలు పాల్గొనడం ఈ ఉత్సవాల ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిరంతరాయంగా వివిధ కళారూపాల ప్రదర్శనలు, పోటీలు కొనసాగుతాయని తెలిపారు. శాస్త్రీయ నృత్యాల సౌందర్యం, జానపద కళల ఉత్సాహం, దేశం నలుమూలల నుంచి వచ్చే కళాకారుల ప్రతిభతో ఈ ఉత్సవాలు తిరుపతిలో సాంస్కృతిక పండుగ వాతావరణాన్ని సృష్టించనున్నాయని చెప్పారు. పోటీల చివరి రోజు ఆదివారం విజేతలకు ప్రతిభా పురస్కారాలు, మెమెంటోలు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళలను ప్రేమించే నగర ప్రజలు, యువత, విద్యార్థులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ జాతీయ స్థాయి శాస్త్రీయ-జానపద నృత్య పోటీలను ఆస్వాదించి కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కే ఎన్ రాజా, ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, గౌరవ కార్యదర్శి డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభన్, సభ్యులు పొన్నాల జేజిరెడ్డి, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, కుప్పిరెడ్డి రామకృష్ణారెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# అన్నీ తానైతే !



పిల్లలే లోకంగా బతికేస్తారు కొందరు అమ్మలు. వారికోసం ఇష్టాలు, కెరియర్ వదిలిపెడతారు. అలాంటివారికి పిల్లలకు దూరంగా బతకడం ఎంత కష్టం? దీన్నే 'ఎమ్టీ నెస్ట్ సింగ్రోమ్'గా చెబుతున్నారు నిపుణులు.

పిల్లలకు టిఫిన్, పుస్తకాలు గుర్తు చేయడం, సమయానికి స్కూలు, కాలేజీకి పంపడం.. వాళ్లలా అడుగు బయటపెట్టగానే వారి తాలూకా పుస్తకాలు, దుస్తులు సర్దడం..తిరిగి సాయంత్రానికి స్నాక్స్, భోజనం సిద్ధం చేయడం.. క్షణం తీరిక లేదన్నట్టుగా సాగుతుంది అమ్మల జీవితం. ఒక్కసారిగా పిల్లలు భవిష్యత్తు నిర్మించుకోవడానికని ఆమెకు దూరమయ్యాక బోలెడు ప్రశ్నలు వేధించడం మొదలు పెడతాయి. ఉరుకులు పరుగు లుండవు. ఇల్లంతా బోసిగా కనిపిస్తుంది. సరిగా తిన్నారో లేదో! ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో! సురక్షితంగా చేరుకున్నారో లేదో.. ఇలా అనుకుంటూ భయపడటమే కాదు.. ఏడ్చేస్తుంటారు కూడా. ఇవన్నీ ఎమ్టీనెస్ట్ సింగ్రోమ్ లక్షణాలేనట. ఒంటరి తల్లులు, ఏకైక సంతానం ఉన్నవారు దీని బారిన పడుతున్నారట. అలాగని పిల్లలను భవిష్యత్తును నిర్మించుకోకుండా ఆపలేం కదా! ఈ ఆలోచనలతో నిండిపోతే మానసిక సమస్యలు ఎదురవుతాయి. దాన్నుంచి బయటపడ టానికి.. కొత్త వ్యాపకాలు, అలవాట్లను ఏర్పరచుకోమంటున్నారు నిపుణులు. వాటిలో పడి, ఈ బాధనుంచి బయట పడతారట. ఇంకా పిల్లలతో ఫోన్, వీడియో కాల్స్ మాట్లాడటం, వీలున్నప్పుడల్లా సర్‌ప్రైజ్‌లిస్తూ కలిసొచ్చినా మంచిదే. ఇంకా చేయాలనుకుని పక్కన పడేసిన పనులపై దృష్టి పెట్టినా.. ఈ ఖాళీ భావన దూరమవుతుంది. మిమ్మల్ని మీరు కొత్తగా పరిచయం చేసుకునే వీలుంటుంది.

## కసరత్తులు చేస్తున్నారా?



క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారికి ఎక్కువ శక్తి నిచ్చే కొన్ని పోషకాలు అవసరమవుతాయి. అవేంటంటారా?

- కసరత్తులు చేసేవారు తప్పనిసరిగా రోజూ గుప్పెడు బాదం నానబెట్టి తీసుకోవాలి. ఇవి కండరాలకి శక్తినిస్తాయి. చెడుకొవ్వుల్ని కరిగించి.. రక్తంలో చక్కెర స్థాయులను అదుపు చేస్తాయి.
- ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయి. పీచు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే యాపిల్, జామ, బొప్పాయి వంటివి తీసుకోవాలి. ఇవి హృదయ సంబధిత రోగాలను రానివ్వవు. వ్యాయామానికి ముందు కొన్ని నట్స్ తీసుకోవడం వల్ల మెదడు, శరీరం మరింత ఉత్సాహంగా పనిచేస్తాయి. కండరాల పనితీరుకీ ఎముకల ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లూ, మెగ్నీషియం, ఫైబర్ మెండుగా ఉండి రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.

# త్యాగానికి, సత్య నిరతికి ప్రతీక ముహర్రం




ఇస్లామిక్ క్యాలెండర్‌లో మొదటి నెల పేరు ముహర్రం. సాధారణంగా దీనిని ఒక పండుగగా భావిస్తారు, కానీ వాస్తవానికి ఇది పండుగ కాదు; ఇదొక శోకదినం. సత్యం కోసం, మానవీయ విలువల రక్షణ కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన ఒక గొప్ప త్యాగనిరతికి, వీరత్వానికి ఇది స్మరణ దినం. కర్బలా యుద్ధం చారిత్రక నేపథ్యం క్రీస్తుశకం 680 (హిజ్రీ 61) లో ఇరాక్‌లోని కర్బలా మైదానంలో జరిగిన చారిత్రాత్మక పోరాటమే ముహర్రం వెనుక ఉన్న అసలు నేపథ్యం. మహమ్మద్ ప్రవక్త మనవడైన హజ్రత్ ఇమామ్ హుస్సేన్, అప్పటి క్రూర, నిరంకుశ పాలకుడైన యజీద్ విధించిన అన్యాయమైన ఆధిపత్యాన్ని అంగీకరించడానికి నిరాకరించారు. యజీద్ లొంగిపోవాలని ఎంత ఒత్తిడి చేసినా, హుస్సేన్ ధర్మాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికే మొగ్గు చూపారు. కేవలం 72 మంది ఉన్న హుస్సేన్ సైన్యంపై యాజిద్‌కు చెందిన వేలాది మంది సైనికులు దాడి చేశారు. మొహర్రం నెల 10వ రోజును 'ఆషూరా' అంటారు. ఇమామ్ హుస్సేన్, ఆయన కుటుంబ సభ్యులు, పసిపిల్లలు దాహంతో అల్లాడిపోతూ కూడా శత్రువుకు లొంగిపోకుండా వీరమరణం పొందారు. ముహర్రం ఇచ్చే అంతిమ సందేశంకర్బలా యుద్ధం కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య లేదా రెండు సైన్యాల మధ్య జరిగిన ఒక సాధారణ పోరాటం కాదు. అది 'అధర్మంపై ధర్మం' సాధించిన ఆత్మీయ విజయం. ఈ నిరంతర స్మరణ సమాజానికి కొన్ని అమూల్యమైన సందేశాలను ఇస్తుంది: 1.సంఖ్యాబలం, ఆయుధబలం కంటే ఆశయబలమే గొప్పదని కర్బలా నిరూపించింది. 2. అన్యాయం, అక్రమాల ముందు మోకరిల్లడం కంటే, ధర్మం కోసం ప్రాణాలు అర్పించడం మిన్న అనే సత్యాన్ని ఇది చాటింది. అందుకే మహాత్మాగాంధీ సైతం మామ్ హుస్సేన్ త్యాగం నుండి నేను శత్రువుకు లొంగిపోకుండా పోరాడే నైతిక శక్తిని పొందాను!" అని కొనియాడారు. అందరికీ స్ఫూర్తిదాయకం! ప్రతి మనిషి ముందూ ధర్మంఅధర్మం, సత్యంఅసత్యం, న్యాయంఅన్యాయం అనే రెండు ఆప్షన్స్ వచ్చి నిలుస్తూ ఉంటాయి. వాటిలో ఎంపిక చేసుకునే సందర్భంగా ఆంతర్యంలో జరిగే సంఘర్షణే కర్బాలా యుద్ధం. కాబట్టి ముహర్రం కేవలం ఒక్క ముస్లిములకే కాక, ప్రతి మనిషికీ స్ఫూర్తి, మార్గదర్శకం అవుతుంది. తెలుగునాట మొహర్రం పీర్ల పండుభారత దేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో మొహర్రానికి ఒక అద్భుతమైన సాంస్కృతిక రూపం ఉంది. ఇక్కడ దీనిని 'పీర్ల పండుగ' అని పిలుస్తారు. ఈ వేడుకల ప్రత్యేకత ఏమిటంటే, ఇవి కులమతాలకు అతీతంగా సాగుతాయి. గ్రామాలలోని చావడిలలో 'పీర్లు' (ఇమామ్ హుస్సేన్ మరియు ఆయన అనుచరుల గుర్తుగా చేసే ప్రతిమలు) ప్రతిష్ఠిస్తారు. హిందూముస్లింలు కలిసి భక్తిశ్రద్ధలతో పీర్ల సాఖిలు (శోక గీతాలు) పాడటం, అలాయ్ బూడిద చల్లుకోవడం, అగ్నిగుండాలు తొక్కడం వంటి ఆచారాలను నిర్వహిస్తారు. ఇది భారతదేశపు గంగాజమునా తెహజీబ్ (మత సామరస్య సంస్కృతి)కి అత్యున్నత ప్రతీకగా నిలుస్తుంది. ముహర్రం సంఘటన కేవలం ఒక నిర్దిష్ట వర్గానికి పరిమితమైన శోకం కాదు. అది యావత్ మానవాళికి నైతిక స్థైర్యాన్ని ఇచ్చే ఒక సార్వజనీన ధర్మ పాఠం. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా దానిని నిలదీయాలనే బాధ్యతను, మానవత్వం కోసం త్యాగానికి సిద్ధపడాలనే సందేశాన్ని ముహర్రం ప్రతి ఏటా ప్రపంచానికి గుర్తు చేస్తూనే ఉంటుంది. ఇక దాని నుండి స్ఫూర్తిని పొంది, అధర్మం నుండి ధర్మం వైపునకు మరలేవారే ధన్యజీవులు!


**- ముష్తాఖ్ అహ్మద్ అభిలాష్**

# మట్టిలో ఆడనిద్దాం !



పిల్లలు మట్టిలో ఆడుతుంటే.. వద్దని చెప్పే స్తాం. చేతులు మురికి చేసుకుంటున్నారని కానీ, ఇది వారిలో వ్యాధినిరోధక శక్తిని పెంచ డమే కాదు... మరెన్నో ఆరోగ్యకర ప్రయోగం అందిస్తుందని తెలుసా? 2024లో ఓ అమె రికన్ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయ నం.. మట్టిలో ఉండే 'మైకోబ్యాక్టీరియం వాక్సీ' అనే సూక్ష్మజీవులు.. చిన్నారుల శరీరంలోకి ప్రవేశించి రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తాయని వెల్లడిస్తోంది. అంతేకాదు, ఇవి సెరటోనిన్ ఉత్పత్తిని పెంచి మానసిక ఆనందాన్నీ పెంచుతా యట. అలర్జీలు, ఆస్తమా వంటి వ్యాధుల ప్రమా దాన్నీ తగ్గస్తాయి. ఇక, మట్టి టెక్స్చర్, చల్లదనం, వాసన.. వంటివి ఇంద్రియ జ్ఞానాన్ని ఉత్తేజపరుస్తాయి. ఫలితంగా వారి నాడీ వ్యవస్థ బలోపేతం అవుతుంది. సులువుగా దేన్నైనా గ్రహించ గల శక్తీ ఏర్పడుతుందట. అలానే, మట్టి తో ఆటలాడుతూ తయార ుచేసే ఇళ్లు, జంతువులు.. వంటి బొమ్మ రూపాలు వారిలో సృజనాత్మకతను పెంచు తాయి. దీంతో స్క్రీన్ టైమ్ కూడా తగ్గి శారీరకంగానూ చురుగ్గా ఉంటారట. మరి ఇప్పుడైనా వారిని మట్టిలో ఆడనిస్తారా?

# నప్పకపోతే.. అంతే !



**ఈ దుస్తుల మీదకు నప్పుతాయి. ఇది కొత్త ట్రెండ్ అంటూ కోరి కోరి షూ, చెప్పులను ఎంచుకుంటాం. తీరా వేసుకున్నాక ఇబ్బందిపడే సందర్భాలెన్నో. ఒక్కోసారి పాదాల నొప్పులూ మొదలవుతాయి. అలాగని పట్టించుకోకపోతే ఆర్థరైటిస్ సహా ఎన్నో సమస్యలు ఇబ్బంది పెడతాయి కాబట్టి...**

చెప్పుల విషయంలో ఆకర్షణీయంగా ఉండటం ఒక్కటే ప్రామాణికం కాకూడదు. డిజైన్ బాగుంటే చాలని ఎప్పుడూ తీసుకోకూడదు. వాటి నాణ్యత కూడా గమనించు కోవాలి. కాలికి సరిపోయిందా లేదా అనేకాదు. నడిచేప్పుడు సౌకర్యంగా ఉన్నాయా అన్నదీ గమనించు కోవాలి. ఏమాత్రం అసౌకర్యం కలిగించినా, ఇబ్బంది పెట్టినా 'తర్వాత సర్దుకుంటాయి' అని కూర్చోక దూరం పెట్టడమే మేలు. ఎక్కువసేపు నిలబడడం, వాకింగ్, షాపింగ్.. ఇలా బోలెడు అవసరాలు ఉంటాయి. వాటికీ సౌకర్యంగా ఉండాలి. కాబట్టి, ఫ్యాషన్‌ని మాత్రమే కాకుండా సౌకర్యంగా ఉందా అనేదీ చూసుకోండి. నాలుగు అడుగులు అలా వేసి కాక, కొద్దిసేపు గమనించి చూడండి. అప్పుడే అవెంతవరకూ మీకు సరిపోతాయో తెలుస్తుంది. ఒక్కో డ్రెస్ మీదకి ఒక్కో పాదరక్షలు కొంటూ పోతే ఎలా? మ్యాచింగ్ కావాలి కానీ ఇలా అన్నీ కొను క్కుంటూ పోయినా వృథానే. కాబట్టి కాస్త క్లాస్‌గా ఉండే రంగులను ఎంచుకునే ప్రయత్నం చేయండి. ఇవి ఎటువంటి డ్రెస్సులు, చీరలు, కుర్తీల మీదకు అయినా ఇట్టే నప్పుతాయి. ఇక వెస్ట్రన్ మేర‌కు షూస్ అయితే మేలు. ఈ రోజుల్లో చీరల మీదకీ షూ వాడుతున్న వారూ ఉన్నారు. మీదీ అదే కోవ అయితే వైట్, బ్లాక్, క్రీమ్ వంటి రంగు తీసుకుంటేకొంచెం టెండీగా ఉంటాయి.

# గులాబ్ ఫిర్నీ



**కావలసినవి :** పాలు: లీటరు, యాలకుపొడి : అరటీస్పూను, బాస్మతి బియనయం: పావు కప్పు, పంచదార: కప్పు, రోజ్ సిరప్:2 టేబుల్‌స్పూన్లు, బాదం : టేబుల్‌స్పూన్లు, ఎండిన గులాబీ రేకులు : కొద్దిగా .

**తయారుచేసే విధానం :** బియ్యం కడిగి అరగంటసేపు నాననివ్వాలి. తరవాతమెత్తగా రుబ్బాలి. మధ్యలో నాలుగైదు టేబుల్‌స్పూన్ల పాలు కూడా పోయాలి. మందపాటి బాణలిలో పాలు పోసి కాగనివ్వాలి. అవి మరిగిన తరవాత రుబ్బిన బియ్యం ముద్ద వేసి సిమ్‌లో ఉడికించాలి. ఉండలు కట్టకుండా మధ్యమధ్యలో తిప్పుతూ మిశ్రమం చికనకబడేవరకూ సుమారు అరగంటసేపు ఉడికించాలి. తరవాత పంచదార, రోజ్‌సిరప్ వేసి కలపాలి. ఇష్టానినబట్టి పంచదార, రోజ్‌సిరప్ మరికాస్త వేసుకోవచ్చు. తరవాత స్టవ్ ఆఫ్ చేసి కాసేపు అలాగే ఉంచి చిన్న చిన్న బౌల్స్‌లో చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టి తీయాలి. ఇప్పుడు ఒక్కోదాంట్లో సన్నగా తరిగిన డ్రైనట్స్ గులాబీ రేకులు చల్లి అందించాలి.



## సుస్వర తరంగ్ హీరోగా సురవి విజన్స్
# 'ప్రొడక్షన్ నం1' ప్రారంభం


ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ కుమారుడు సుస్వర తరంగ్ హీరోగా పరిచయం అవుతున్నారు. వీరేష్ కోకా దర్శకత్వంలో సురవి విజన్స్ బ్యానర్‌పై పి చక్రధర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహుర్తపు సన్నివేశానికి డైరెక్టర్ డాలీ క్లాప్ కొట్టి గౌరవ దర్శకత్వం వహించారు. గంటా రవితేజ కెమరా స్విచ్ ఆన్ చేశారు. నల్లమలుపు బుజ్జి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించారు. ఈ చిత్రంలో దివ్యాని మొండల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్. చంద్రశేఖరన్ డీవోపీగా, బిబిన్ అశోక్ సంగీత దర్శకుడిగా, నిరంజన్ దేవరమానే ఎడిటర్ గా పని చేస్తున్నారు. జూన్ 29 నుంచి షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో వందేమాతరం శ్రీనివాస్ మాట్లాడుతూ..'నేను 275కు పైగా సినిమాలకు పని చేశాను. ప్రేక్షకులు నాకు ఎంతో ప్రేమ, అభిమానాన్ని అందించారు. ఇప్పుడు ఈ సినిమాతో మా అబ్బాయి హీరోగా పరిచయం అవుతున్నాడు. అదే ప్రేమ, అభిమానాన్ని తనపై కూడా చూపిస్తారని కోరుకుంటున్నాను' అన్నారు. హీరో సుస్వర తరంగ్ మాట్లాడుతూ.. 'నాకు ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన మా దర్శకుడు, నిర్మాతతో పాటు మా టీమ్ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. నా తొలి సినిమాకే ఇంత మంచి అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. దర్శకుడు వీరేష్ కోకా మాట్లాడుతూ.. 'నన్ను, నా టీమ్‌ను నమ్మి వందేమాతరం శ్రీనివాస్ వారి అబ్బాయిని హీరోగా పరిచయం చేసే బాధ్యత మాకు ఇచ్చారు. వారు పెట్టుకున్న నమ్మకాన్ని కచ్చితంగా నిలబెట్టుకుంటాను' అన్నారు. హీరోయిన్ దివ్యాని మాట్లాడుతూ.. 'తెలుగులో ఇది నా తొలి సినిమా. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మా దర్శకుడు, నిర్మాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు' అన్నారు..

## హీరో ప్రియదర్శి కాంబో మూవీ
# 'ఇడుపు కాయితం'



ప్రముఖ యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా "ఇడుపు కాయితం". ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా 'ఇడుపు కాయితం' సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. అల్లు అరవింద్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా నటుడు బిత్తిరి సత్తి మాట్లాడుతూ 'ఇడుపు కాయితం' సినిమా ప్రారంభోత్సవం చూస్తుంటే ఒక పండుగ వాతావరణం కనిపిస్తోంది' అన్నారు. నటి సావిత్రి మాట్లాడుతూ 'నటిగా నా మొదటి సినిమా ఇది. ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన డైరెక్టర్ వంశీ అన్నకు థ్యాంక్స్' అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ 'ఈ కథ విన్న తర్వాత, ఇంతమంది టీమ్ మెంబర్స్ ప్రాజెక్ట్‌లోకి వచ్చాక, నాకు ఒక్కటే అనిపిస్తోంది. ఈ 'ఇడుపు కాయితం' పంచాయితీకి మూవీ రిలీజైన ఫస్ట్ డే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు తండోపతండాలుగా వచ్చి చూస్తారు' అన్నారు. డైరెక్టర్ వంశీకృష్ణ దొండపాటి మాట్లాడుతూ 'ఈ కథ చెప్పగానే నమ్మి సినిమా చేస్తున్నామని గట్టిగా చెప్పిన మా ఆడబిడ్డ తబిత గారికి థ్యాంక్స్. నమ్మితేనే ఎవరైనా పైకి వస్తారు' అన్నారు. ప్రొడ్యూసర్ తబిత సుకుమార్ మాట్లాడుతూ 'నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. పక్కా తెలంగాణ అమ్మాయిని. డైరెక్టర్ వంశీ ఈ కథ చెబుతున్నప్పుడు మేము చిన్నప్పుడు విన్న విషయాలు, పెద్ద వాళ్లు ఎలా హ్యాండిల్ చేసేవాళ్లు.. అవన్నీ గుర్తొచ్చాయి. నేను ఈ కథ విన్నప్పుడు సుకుమార్‌తో చెప్పాను. మీరు ఈ కథకు కనెక్ట్ అవుతున్నారో లేదోగానీ నేను తెలంగాణ అమ్మాయిని కాబట్టి చాలా కనెక్ట్ అయ్యాను. మనం ఎలాగైనా సుకుమార్ రైటింగ్స్‌లో ఈ సినిమా చేయాలని' అన్నారు. ప్రొడ్యూసర్ బన్నీ వాస్ మాట్లాడుతూ 'చాలా మంచి కథతో ఈ సినిమా చేస్తున్నాం. సబ్ టైటిల్స్‌తో బిహార్‌లో వేసినా అక్కడ ప్రేక్షకులు కూడా చూసే చిత్రమిది. మన అందరి ఇళ్లలో ఒక కామన్ ప్రాబ్లమ్ ఉంటుంది. ఈ సినిమా రిలీజ్ అయ్యాక అమ్మాయి అయితే వాళ్ల అత్తామామను తీసుకుని థియేటర్‌కు వెళ్లండి' అన్నారు, హీరోయిన్ నాగదుర్గ మాట్లాడుతూ 'యూట్యూబ్‌లో నా పాటలు చూసి విని ఉంటారు. ఇప్పుడు "ఇడుపు కాయితం" అనే అద్భుతమైన మూవీతో మీ ముందుకు హీరోయిన్‌గా వస్తున్నాను' అన్నారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ 'ఈ రోజు "ఇడుపు కాయితం" లాంఛింగ్ ఈవెంట్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. మీరు నాపై చూపించిన ప్రేమను ఈ సినిమా ద్వారా తిరిగి మీకు అందించబోతున్నా. ఈ సందర్భంగా సుకుమార్‌కి, బన్నీ వాస్‌కి, తబితకి థ్యాంక్స్ చెబుతున్నా' అన్నారు.

# ఘనంగా NBK 112 ప్రారంభం




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ కలయికలో రాబోతున్న చిత్రంపై ప్రకటన వచ్చినప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. SLV సినిమాస్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై నిర్మాతలు సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం, అమరావతిలో జరిగిన పూజా కార్యక్రమంతో ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎపి మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సినీ ప్రముఖులు సురేష్ బాబు, గోపీచంద్ మలినేని, వెంకట సతీష్ కిలారు, సాహు గారపాటి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. కందుల దుర్గేష్ కెమెరాను స్విచ్ ఆన్ చేయగా, నారా లోకేష్ క్లాప్ కొట్టారు. బాలకృష్ణ కుమార్తె నందమూరి తేజస్విని ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రారంభోత్సవానికి సంబంధించిన మొదటి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగమయ్యే అవకాశాన్ని కల్పించినందుకు మా మామగారు బాలకృష్ణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు. డైరెక్టర్ కొరటాల శివ మాట్లాడుతూ.. 'బాలకృష్ణ గారి కోసం ఒక సినిమాను రాసి, దర్శకత్వం వహించే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అన్నారు. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. 'కోట్లాది మంది అభిమానుల ప్రేమను, ఆప్యాయతను పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్‌కి, అలాగే ప్రారంభ షాట్‌కు దర్శకత్వం వహించిన తేజస్వినికి నా హృదయపూర్వక ధన్యవాదాలు'అన్నారు.

# 'వెంకట్రామయ్య గారి తాలూకా' టీజర్ ఆవిష్కరణ



దినేష్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా'. సతీష్ ఆవాల దర్శకత్వంలో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాలో మురళీధర్ గౌడ్, సుధ కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుత సమాజంలో డబ్బు చుట్టూ తిరుగుతున్న మానవ సంబంధాలు, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను హృద్యంగా ఆవిష్కరించిన కుటుంబ కథా చిత్రమిది. ఈటీవీ ప్రభాకర్ మాట్లాడుతూ... "ఈ సినిమా టీజర్, పాటల ఆవిష్కరణ వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ముత్యాల సుబ్బయ్య చిత్రాలను గుర్తు చేసే గొప్ప కథ ఇది. చాలా కాలం తర్వాత ఇలాంటి కథ వినడంతో మా అమ్మాయి దివిజను ఈ సినిమా చేయమని ప్రోత్సహించాను' అన్నారు. నటుడు మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ... "ప్రతి ఒక్కరి కళ్లలో నీళ్లు తెప్పించే సినిమా ఇది. చాలా కాలంగా చేయాలనుకున్న తరహా పాత్ర ఈ సినిమాలో దక్కింది' అన్నారు. దర్శకుడు సతీష్ ఆవాల మాట్లాడుతూ..."మన దేశ సంస్కృతిలో పెద్దలకు గౌరవం ఇవ్వడం గొప్ప సంప్రదాయం. కుటుంబాల్లో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ఈ సినిమా చూపిస్తుంది' అన్నారు. నిర్మాతలు కోమలి, మహేందర్ తొట్టె మాట్లాడుతూ... "హనుమాన్ సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో, మా సినిమా కూడా అంతటి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటు న్నానము' అన్నారు. హీరో దినేష్ కుమార్ మాట్లాడుతూ... 'జయమ్మ పంచాయితీ' తర్వాత చేసిన మంచిసినిమా ఇది. అన్ని వర్గాల ప్రేక్షకు లను ఆకట్టుకునే అంశాలు ఇందులో ఉన్నాయి" అన్నారు. హీరోయిన్ దివిజ ప్రభాకర్ మాట్లాడుతూ..."అందరికీ నచ్చే కథ ఇది. ప్రతి ఒక్కరూ ఎంతో మనసుపెట్టి పని చేశారు' అన్నారు. నిర్మాత కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారు. జూలై 18న ప్రేక్షకులంతా థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.

# 'సూపర్ సుబ్బు' ట్రైలర్ లాంచ్



ప్రముఖ ఒటిటి నెట్‌ఫ్లిక్స్ తన తొలి తెలుగు ఒరిజినల్ కామెడీ సిరీస్ 'సూపర్ సుబ్బు' ట్రైలర్‌ను విడుదల చేసింది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో సందీప్ కిషన్, మిథిలా పాల్కర్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు చిల్లుకూరి రావు అనే టీచర్ పాత్రలో సందీప్ కిషన్ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ..'సూపర్ సుబ్బు సాధారణంగా ప్రజలు మాట్లాడ టానికి సంకోచించే అంశాన్ని హాస్యం, హృదయానికి హత్తుకునే భావోద్వేగా లతో చెప్పే ప్రయత్నం. సుబ్బు ఒక సమస్యను పరిష్కరించాలనుకుని చివరికి మరిన్ని సమస్యల్లో చిక్కుకుంటాడు'అన్నారు. మిథిలాపాల్కర్ మాట్లాడుతూ.. 'హాస్యంతో పాటు మానవ సంబంధాలు, అంగీకారం, పరస్పర అవగాహన వంటి అంశాలను ఎంతో అందంగా చెప్పిన కథ ఇది. మల్లిక్ రామ్ క్రియేట్ చేసిన మాకిపూర్ ప్రపంచం జీవంతో నిండిపోయి ఉంటుంది' అన్నారు. సుబ్బు తండ్రి కుకటేశ్వరరావుపాత్రలో నటించిన మురళీ శర్మ మాట్లాడుతూ.. ప్రేక్షకులను నవ్విస్తూనే సాధారణంగా దూరంగాపెట్టే కొన్ని అంశాలపై చర్చకు దారి తీసే కథ ఇది' అన్నారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ రచించిన ఈసిరీస్‌ను చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్‌చిలక, భరత్ లక్ష్మీ పతి నిర్మించారు. సూపర్‌సుబ్బు జూలై2నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

# నేడు ఐర్లాండ్‌తో టి20 పోరు

## టీమిండియా ఓపెనింగ్ రేసులో నలుగురు



**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 చారిత్రాత్మక విజయానంతరం సరికొత్త రోడ్‌మ్యాప్‌తో బరిలోకి దిగుతున్న టీమిండియా, ఐర్లాండ్ పర్యటనలో తొలి సమరానికి సిద్ధమైంది. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తుది జట్టు ఎంపిక ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ముఖ్యంగా ఓపెనింగ్ స్థానం కోసం నలుగురు స్టార్ ఆటగాళ్లు పోటీ పడుతుండటంతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఐర్లాండ్‌తో జరిగే ఈ తొలి టీ20లో వైభవ్ సూర్యవంశీ బరిలోకి దిగడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. అయితే, వైభవ్ కేవలం ఓపెనర్‌గా మాత్రమే ఆడగలడు. దీంతో తుది జట్టులో అతనికి చోటు కల్పించాలంటే ఓపెనింగ్ స్థానాల్లో భారీ మార్పులు తప్పవని సెలక్టర్లు భావిస్తున్నారు.

ప్రస్తుతం అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఐసీసీ నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్న అభిషేక్ శర్మను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించే అవకాశాలు లేవు. ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో కొన్ని మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినా, అతనికున్న హిట్టింగ్ సామర్థ్యంపై యాజమాన్యానికి పూర్తి నమ్మకం ఉంది. పైగా అభిషేక్ కూడా లోయర్ ఆర్డర్‌లో ఆడటం కష్టం. ఈ నేపథ్యంలో, లెఫ్ట్ అండ్ రైట్ కాంబినేషన్ కోసం కాకుండా, ఇద్దరు విధ్వంసకర లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లయిన అభిషేక్ శర్మ, వైభవ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే వీలుంది. ఇక వైభవ్ ఓపెనర్‌గా బరిలోకి దించేందుకు సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఓపెనింగ్ స్థానం నుండి తప్పుకోక తప్పడం లేదు. మొన్నటి ప్రపంచకప్‌లో అభిషేక్‌తో కలిసి ఓపెనర్‌గా అదరగొట్టి భారత్‌ను విశ్వవిజేతగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించిన సంజూ మారిన సమీకరణాలతో ఐదో స్థానంలో మిడిలార్డర్ బ్యాటర్‌గా రావాల్సి ఉంటుంది.

ఈ సిరీస్‌లో మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ ఇప్పటికే తన స్థానాన్ని కోల్పోయి మూడో ప్లేస్‌తో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. సంజూ శాంసన్‌ను ఐదో స్థానానికి పంపడం అనివార్యంగా మారింది. కాగా గాయంతో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ పర్యటనకు దూరం కావడంతో ఐదో స్థానంలో సంజూకు ప్లేస్ రానుంది. దీనివల్ల యువ ఆటగాడు తిలక్ వర్మకు తుది జట్టులో చోటు దక్కడం కష్టమే అవుతోంది. ఒకవేళ తిలక్‌ను తీసుకోవాలనుకుంటే సంజూను బెంచ్‌కే పరిమితం చేయాల్సి ఉంటుంది. ఇక నాలుగో స్థానంలో సూర్యకుమార్ యాదవ్ స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతలు చేపట్టనున్నాడు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో బ్రెజిల్ జైత్రయాత్ర

**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో బ్రెజిల్ తమ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. గ్రూప్‌సీలో అగ్రస్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మయామిలో గురువారం తెల్లవారుజామున జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ 3-0 తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తు చేసింది. స్టార్ స్ట్రైకర్ వినీషియస్ జూనియర్ రెండు గోల్స్‌తో బ్రెజిల్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో గ్రూప్ సీ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచిన బ్రెజిల్ మొరాకోను వెనక్కినెట్టింది. ఈ పరాజయంతో స్కాట్లాండ్ నాకౌట్ ఆశలు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడ్డాయి. మ్యాచ్ ప్రారంభమైన 7వ నిమిషంలోనే స్కాట్లాండ్ డిఫెండర్ చేసిన తప్పును అనుకూలంగా మార్చుకున్న రాయన్ అందించిన పాస్‌ను వినీషియస్ గోల్‌గా మలిచి బ్రెజిల్‌కు 1-0 ఆధిక్యాన్ని



ఇచ్చాడు. ఆ తర్వాత మరో గోల్ చేసినా విఏఆర్ ఫౌల్‌గా ప్రకటించారు. ఫస్టాఫ్ అదనపు సమయంలో (45+3 నిమిషం) బ్రూనో గుమారెస్ ఇచ్చిన అద్భుతమైన క్రాస్‌ను వినీషియస్ హెడర్ ద్వారా నెట్‌లోకి పంపి బ్రెజిల్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఈ టోర్నీలో గ్రూప్ స్టేజ్ మూడు మ్యాచ్‌ల్లోనూ గోల్స్ చేసిన ఐదో బ్రెజిల్ ఆటగాడిగా వినీషియస్ రికార్డు సృష్టించాడు. సెకండాఫ్‌లోనూ బ్రెజిల్ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 60వ నిమిషంలో గుమారెస్ అందించిన మరో అసిస్ట్‌ను మాథ్యూస్ కున్హా గోల్‌గా మార్చడంతో బ్రెజిల్ 3-0తో తిరుగులేని విజయాన్ని ఖాయం చేసుకుంది. స్కాట్లాండ్ ఆటగాళ్లు స్కాట్ మెక్‌టోమినే, ఫెర్గూసన్ గోల్స్ చేయడానికి గట్టి ప్రయత్నాలు చేసినప్పటికీ, బ్రెజిల్ గోల్ కీపర్ అలిసన్ వారి ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకున్నాడు. బ్రెజిల్ జట్టు ఏకంగా 21 సార్లు గోల్ కోసం ప్రయత్నించి మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించింది.




# అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో.. రికార్డు బద్దలు

## సంచలనాత్మక ప్రదర్శనతో రాణించిన అనుష్క, దేవ్

**న్యూఢిల్లీ:** జాతీయ రికార్డును బద్దలు కొట్టి, 2026 ఆసియా క్రీడలకు అర్హత సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. 18 ఏళ్ల ఆ అమ్మాయి వరుసగా అద్భుతమైన త్రోలు చేసింది. ఆమె 62.07 మీటర్లతో ప్రారంభించి, ఆసియా క్రీడల అర్హత మార్కు అయిన 61.72 మీటర్లను సులభంగా అధిగమించింది. ఆ తర్వాత ఆమె తన దూరాన్ని 65.64 మీటర్లకు మెరుగుపరుచుకుని, తన చివరి ప్రయత్నంలో హ్యామర్‌ను 67.02 మీటర్లకు విసిరి, తన కెరీర్‌లోనే అత్యుత్తమ త్రోను నమోదు చేసింది. దీంతో తొమ్మిది సంవత్సరాల క్రితం సరితా సింగ్ నెలకొల్పిన 65.25 మీటర్ల సుదీర్ఘకాల జాతీయ రికార్డును బద్దలు కొట్టి, అనుష్కను భారతదేశానికి కొత్త జాతీయ రికార్డు హోల్డర్‌గా నిలిపింది. ఇదే రోజు పురుషుల పోల్ వాల్ట్‌లో మరో జాతీయ రికార్డు కూడా నమోదైంది. దేవ్ కుమార్ మీనా 5.46 మీటర్ల ఎత్తును అధిగమించి తన అద్భుతమైన ప్రస్థానాన్ని కొనసాగించాడు. ఈ మార్కుతో, అతను కుల్దీప్ కుమార్‌తో పంచుకున్న 5.45 మీటర్ల జాతీయ రికార్డును అధిగమించి, ఆసియా క్రీడల అర్హత ప్రమాణాన్ని అందుకున్నాడు. జాతీయ రికార్డును బద్దలు కొట్టడం దేవ్‌కు ఇది వరుసగా రెండవ ప్రదర్శన. ఇక



మహిళల ట్రిపుల్ జంప్‌లో, ఐ. ఇషా ఎలాంగో 13.89 మీటర్ల వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, ఈ ఈవెంట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ పోటీలో అంతకుముందు 13.67 మీటర్ల దూరం దూకి, ఆమె ఇప్పటికే 13.34 మీటర్ల ఆసియా క్రీడల అర్హత ప్రమాణాన్ని అధిగమించింది.



# యుఎస్ ఓపెన్‌లో తన్వి, దేవిక, శ్రీకాంత్, రౌనక్ విజయం

**న్యూఢిల్లీ:** యూఎస్ ఓపెన్-2026 తొలి రోజు భారత షట్లర్లు విజయం సాధించారు. తన్వి శర్మ, దేవికా సిహాగ్, కిదాంబి శ్రీకాంత్, రౌనక్ చౌహాన్ అద్భుతమైన విజయాలు నమోదు చేసి, బిడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టోర్నమెంట్ రెండో రౌండ్‌కు చేరుకున్నారు. ఫుల్లెర్టన్‌లో జరిగిన ఈ టోర్నీలో ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ రజత పతక విజేత తన్వి శర్మ, మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో జర్మనీకి చెందిన యవోన్ లీపై 23-21, 21-16 తేడాతో విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో గెలిచిన ఈ యువ క్రీడాకారిణి, ఆ తర్వాత పోటీపై పట్టు సాధించి వరుస గేమ్‌లలోనే మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. థాయ్‌లాండ్ మాస్టర్స్ ఛాంపియన్ దేవికా సిహాగ్ కూడా పెరూకు చెందిన ఇనెస్ లూసియా కాస్టిల్లోను 21-14, 21-14 తేడాతో ఓడించి, తన ప్రచారాన్ని విజయంతో ప్రారంభించింది. ఇక పురుషుల సింగిల్స్ డ్రాలో, ఇద్దరు భారతీయుల మధ్య జరిగిన పోరులో మొదటిదానిలో, మాజీ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ రజత పతక విజేత ఎస్. శంకర్ ముత్తుసామిని 23-21, 21-16 తేడాతో ఓడించి రౌనక్ చౌహాన్ విజయం సాధించాడు. ఆ తర్వాత ఐదవ సీడ్ కిదాంబి శ్రీకాంత్ మరో ఆధిపత్య ప్రదర్శన కనబరిచి, తన స్వదేశీయుడైన డి. సనీత్‌ను కేవలం 30 నిమిషాల్లో 21-14, 21-12 తేడాతో ఓడించి తదుపరి రౌండ్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో కూడా భారత్ విజయం సాధించింది. రక్షితా శ్రీ చెక్ రిపబ్లిక్‌కు చెందిన టెరెజా స్వాబికోవాను 21-15, 21-8 తేడాతో సునాయాసంగా ఓడించింది.

# శ్రీలంక టెస్ట్ మ్యాచ్‌లో.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 333 రన్స్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్‌ఏ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవరల్లో 4 వికెట్లకు 333 పరుగులు చేసింది. సాయి సుదర్శన్‌తో (175 బంతుల్లో 19 ఫోర్లతో 132) పాటు, కెప్టెన్ ధ్రువ్ జురెల్(138 బంతుల్లో 5 ఫోర్లతో 68 బ్యాటింగ్), తెలుగు తేజం షేక్ రషీద్ (92 బంతుల్లో 4 ఫోర్లతో 53) అజేయ హాఫ్‌సెంచరీలతో రాణించారు.శ్రీలంక బౌలర్లలో సుదీర 2 వికెట్లు తీయగా, చామిక



గుణశేఖర,రావిందు ఫెర్నాండో తలో వికెట్ తీసారు. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు సాయి సుదర్శన్, ఆయుష్ పాండే(25) అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 82 పరుగులు జోడించారు. రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. రుతురాజ్ గైక్వాడ్(22) ఎల్బీగా పెవిలియన్ చేరాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా, సాయి సుదర్శన్ శతకం పూర్తి చేసుకున్నాడు. సెంచరీ అనంతరం సాయి సుదర్శన్‌ను గుణశేఖర్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు.

# భారత్‌లో అమెజాన్ రూ.4.53 లక్షలకోట్ల పెట్టుబడులు

## ప్రధాని మోడీతో అమెజాన్ సిఇఒ భేటీ..

**న్యూఢిల్లీ,జూన్ 25:** ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్రమోడీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన తర్వాత భారీ పెట్టుబడులు ప్రకటించింది.ఐదేళ్లలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.4.53 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టంచేసింది. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొన్నది. దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టామని, ఈకామర్స్,ఏఐ,క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నామని అన్నారు. కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈకామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని అమెజాన్ కంపెనీ వివరించింది.



# నెలలో 1.82 లక్షల ఎస్‌బిఐ కొత్త కార్డులు జారీ

**న్యూఢిల్లీ, జూన్ 25:** దేశంలో వినియోగదారుల ఖర్చులు స్థిరంగా పెరుగుతుండటంతో క్రెడిట్ కార్డుల వినియోగం కూడా వృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మేనెలలో ప్రధాన సంస్థల్లో అత్యధిక సంఖ్యలో కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేసిన సంస్థగా ఎస్‌బీఐ కార్డ్ నిలిచింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, మే నెలలో ఎస్‌బీఐ కార్డ్ 1.82 లక్షల కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేసింది. ఇదే కాలంలో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన వ్యయాలు నెలవారీ ప్రాతిపదికన 2 శాతం పెరిగి రూ.38,556 కోట్లకు చేరుకున్నాయి.ఐసీఐసీఐ బ్యాంక్ 1.68 లక్షల కొత్త క్రెడిట్ కార్డులను జోడిస్తూ రెండో స్థానంలో నిలిచింది. ఈ బ్యాంక్ క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన ఖర్చులు గత నెలతో పోలిస్తే 1 శాతం పెరిగి రూ.32,818 కోట్లకు చేరాయి. దేశంలో మొత్తం క్రెడిట్ కార్డు వినియోగదారుల సంఖ్య పరంగా అగ్రస్థానంలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మే నెలలో 1.42 లక్షల కొత్త కార్డులను జారీ చేసింది. ఈ బ్యాంక్ కార్డుల ద్వారా జరిగిన వ్యయాలు 2 శాతం పెరిగి రూ.59,138 కోట్లకు చేరాయి. ప్రధాన ఐదు కార్డు జారీదారులలో ఇదే అత్యధిక వ్యయ పరిమాణంగా నమోదైంది. ఇతర ప్రధాన సంస్థలలో కోటక్ మహీంద్రా బ్యాంక్ మే నెలలో 54 వేల కొత్త కార్డులను జోడించింది. ఈ బ్యాంక్ క్రెడిట్ కార్డుల ఖర్చులు 6 శాతం పెరిగి రూ.6,389 కోట్లకు చేరుకున్నాయి. యాక్సిస్ బ్యాంక్ 52 వేల కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేసింది.






# స్వల్పలాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,జూన్ 25:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలకే పరిమితం అయ్యాయి. ముడి చమురు ధరలు తగ్గడంకొంత మద్దతిచ్చింది. ఆటో మరియు ఎఫ్‌ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. మెటల్, ఐటీ, ఆయిల్ గ్యాస్, ఎనర్జీ రంగాల షేర్లలో బలహీనత కూడా మార్కెట్‌కు స్వల్ప అడ్డంకిగా మారింది.రోజు ముగింపులో బీఎస్‌ఈ సెన్సెక్స్ 109.25 పాయింట్లు పెరిగి 77,100.47 వద్ద ముగియగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 34.35 పాయింట్లు లాభపడి 24,056 వద్ద స్థిరపడింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.18 , నిఫ్టీ 0.97 పెరిగాయి. ఆటో షేర్లు మార్కెట్‌కు బలాన్నిచ్చాయి. మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 3.94 , మారుతి సుజుకి ఇండియా 3.81 , ఐసీఐసీఐ బ్యాంక్ 0.98శాతం పెరగడం సూచీలకు ప్రధాన మద్దతునిచ్చింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.44శాతం పడిపోగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.51 శాతం క్షీణించింది. బీఎస్‌ఈలో 1,641 షేర్లు లాభాల్లో ముగియగా, 2,581 షేర్లు నష్టాల్లో ముగిశాయి.

192 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.787 నుంచి 6.782 కు తగ్గింది.రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడి రూ.94.55 నుంచి రూ.94.40కు మెరుగుపడింది.ఆగస్టు 2026 డెలివరీ ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.24 పెరిగి రూ.1,44,612కు చేరాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 99 సెంట్లు తగ్గి 72.75 డాలర్లకు చేరింది. బంగారం ఫైనాన్స్ కంపెనీలుబంగారం ధరలు తగ్గడంతో గోల్డ్ ఫైనాన్స్ కంపెనీల షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ 3.06,ముత్తూట్ ఫైనాన్స్ 3.39శాతంక్షీణిస్తే మణప్పురం ఫైనాన్స్ 0.11 శాతంపెరిగింది. ముడి చమురు ధరలు తగ్గడంతో విమానయాన కంపెనీల షేర్లు ర్యాలీ చేశాయి.స్పైస్‌జెట్ 2.69 ఇండిగో 4.89 శాతం పెరిగాయి. స్టెర్లైట్ టెక్నాలజీస్ షేరు 5 అప్పర్ సర్క్యూట్ తాకి రూ.613.35 వద్ద ముగిసింది.స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ షేరు 5.86శాతం పడిపోయింది.ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ షేరు 1.65 శాతంక్షీణించింది.రైల్‌టెల్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ సదర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ నుంచి రూ.29.83 కోట్ల ప్రాజెక్టు ఆర్డర్ లభించినప్పటికీ షేరు1.35 శాతం తగ్గింది. ముడి చమురు ధరల తగ్గుదల, ఆటో రంగంలో కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతు ఇచ్చినా, రెండో అర్ధభాగంలో లాభాల స్వీకరణ కారణంగా సూచీలు రోజువారీ గరిష్ఠ స్థాయిల నుంచి వెనక్కి వచ్చాయి.

# డాలర్ వర్సెస్ రూపాయి

## 16 పైసలు బలపడిన భారత్ కరెన్సీ

**ముంబై, జూన్ 25:** అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు వరుసగా తగ్గుముఖం పట్టడంతో భారత రూపాయి గురువారం అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 16 పైసలు బలపడి 94.39 వద్ద ట్రేడింగ్ ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల ధోరణి, డాలర్ సూచీ స్వల్ప బలహీనత రూపాయికి మద్దతు ఇచ్చాయని, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణ కారణంగా లాభాలు పరిమితమయ్యాయని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. అంతర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌కు వ్యతిరేకంగా 94.30 వద్ద ప్రారంభమై, రోజంతా 94.13 నుంచి 94.56 మధ్య ట్రేడింగ్ జరిగింది. చివరకు 94.39 వద్ద ముగిసి, గత ముగింపు స్థాయితో పోలిస్తే 16 పైసలు పెరిగింది. ముందురోజు రూపాయి 21 పైసలు బలపడి 94.55 వద్ద ముగిసింది.మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ పరిశోధనా విశ్లేషకుడు అనుజ్ చౌదరి మాట్లాడుతూ, కమోడిటీ ధరలు తగ్గడం, అమెరికన్ డాలర్ బలహీనపడటం వల్ల రూపాయి బలపడిందన్నారు. ముడి చమురు ధరల పతనం, దేశీయ మార్కెట్లలో సానుకూల ధోరణి కూడా



రూపాయికి అనుకూలంగా పనిచేశాయని పేర్కొన్నారు. మరోవైపు, కమోడిటీ ధరల తగ్గుదల, ద్రవ్యోల్బణ ఆందోళనలు తగ్గడం రూపాయికి దిగువ స్థాయిల్లో మద్దతు ఇవ్వవచ్చన్నారు. సమీప కాలంలో రూపాయి 94.20 నుంచి 94.80 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.ఇక ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.04 శాతం తగ్గి 101.57 వద్ద ట్రేడైంది.అంతర్జాతీయ చమురు బెంచ్‌మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర బ్యారెల్‌కు 1.33 శాతం తగ్గి 72.76 డాలర్లకు చేరింది.దేశీయ స్టాక్ మార్కెట్లలో సెన్సెక్స్ 109.25 పాయింట్లు పెరిగి 77,100.47 వద్ద ముగియగా, నిఫ్టీ 34.35 పాయింట్లు లాభపడి 24,056 వద్ద స్థిరపడింది.అయితే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నికరంగా రూ.1,843.40 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ డేటా వివరిస్తోంది.



# బంగారం, వెండి ఇటిఎఫ్‌లకు షాక్

## వెండి 4 శాతం, పసిడి రెండు శాతం పతనం

**న్యూఢిల్లీ, జూన్ 25:** దేశీయ మార్కెట్లలో బంగారం, వెండి ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ గురువారం భారీగా పతనమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో విలువైన లోహాల ధరలు ఒత్తిడికి లోనయిన ప్రభావం ఈటీఎఫ్‌లపై స్పష్టంగా కనిపించింది. వెండి ఈటీఎఫ్‌లు దాదాపు 4 శాతం వరకు పడిపోగా, బంగారం ఈటీఎఫ్‌లు 2 శాతానికి పైగా నష్టాలను నమోదు చేశాయి. వెండి ఆధారిత ఈటీఎఫ్‌లలో నిప్పాన్ ఇండియా సిల్వర్ ఈటీఎఫ్ (సిల్వర్‌బీస్) 3.99 శాతం క్షీణించి రూ.202.58 వద్ద ట్రేడయ్యింది. ఎస్‌బీఐ సిల్వర్ ఈటీఎఫ్ 3.93 శాతం తగ్గి రూ.208.26కి చేరగా, హెచ్‌డీఎఫ్‌సీ సిల్వర్ ఈటీఎఫ్ 4.01 శాతం క్షీణించి రూ.200.39 వద్ద నమోదైంది. టాటా సిల్వర్ ఈటీఎఫ్ కూడా 3.92 శాతం పడిపోయి రూ.20.01 వద్ద ట్రేడైంది. బంగారం ఈటీఎఫ్‌ల విషయానికి వస్తే, నిప్పాన్ ఇండియా గోల్డ్ ఈటీఎఫ్ (గోల్డ్‌బీస్) 2.21 శాతం తగ్గి రూ.114.55కి చేరింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ గోల్డ్ ఈటీఎఫ్ 2.76 శాతం క్షీణించి రూ.117.95 వద్ద నమోదైంది. ఎస్‌బీఐ గోల్డ్ ఈటీఎఫ్ 2.8 శాతం పడిపోగా, హెచ్‌డీఎఫ్‌సీ గోల్డ్ ఈటీఎఫ్ 2.64 శాతం నష్టంతో రూ.117.75 వద్ద ట్రేడైంది. ఇదే సమయంలో మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో కూడా బంగారం, వెండి ఫ్యూచర్స్ ధరలు తగ్గాయి. జూలై డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 0.53 శాతం క్షీణించి 10 గ్రాములకు రూ.1,38,786కు చేరగా, వెండి జూలై ఫ్యూచర్స్ ధర కిలోకు 1.2 శాతం తగ్గి రూ.2,10,519 వద్ద నమోదైంది. ఇన్వాసెట్ పీఎంఎస్ బిజినెస్ హెడ్‌హర్షల్ దసాని మాట్లాడుతూ, కేవలం బులియన్ ధరలసవరణ మాత్రమేకాదు. బలమైన డాలర్, పెరుగుతున్న వడ్డీ రేట్ల అంచనాలు, గతంలో భారీగా పెరిగిన సురక్షిత పెట్టుబడుల నుంచి పెట్టుబడిదారులు నిష్క్రమించడం వంటి కారణాలతో ఈ సవరణ చోటుచేసుకుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.